RNI No.: TELTEL2015/62825

# తెలంగాణ సేన

TELANGANA SENA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PUBLISHED FROM : HYDERABAD

సంపుటి : 10 సంచిక : 206 శుక్రవారం 21 - 02 - 2025 ఎడిటర్ : బొమ్మరబోయిన వెంకన్న ముదిరాజ్ అసోసియేట్ ఎడిటర్ : కే రాజేంద్ర ప్రసాద్ పేజీలు : 08 వెల : 2 రూ/-

విలేకరులు కావలెను

తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో

తెలంగాణ సేన దినపత్రికలో పనిచేయుటకు

విలేకరులు కావలెను

జిల్లా రిపోర్టర్ లు, నియోజకవర్గ రిపోర్టర్ లు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ లు కావలెను.

9959236324 9951247932

## సీఎం రేఖా గుప్తా ఆన్ డ్యూటీ



కొత్త సర్కార్‌కు సవాళ్ల స్వాగతం!

వికసిత్ ఢిల్లీ లక్ష్యాన్ని సాకారం చేసేందుకు తమ ప్రభుత్వం ఒక్క రోజు కూడా వృథా చేయం

ఆప్ సర్కార్ అమలు చేసిన సంక్షేమ పథకాలన్నింటినీ కొనసాగిస్తాం!

యమునా నది ప్రక్షాళన పెద్ద సవాల్?!

వాయుకాలుష్యం మరో అతిపెద్ద సమస్య

దిల్లీ ముఖ్యమంత్రిగా రేఖా గుప్తా బాధ్యతలు స్వీకరించారు. ప్రధాని నరేంద్ర మోదీ సహా పలువురి ప్రముఖల సమక్షంలో ప్రమాణస్వీకారం చేసిన అనంతరం ఆమె సచివాల యానికి వెళ్లారు. ఆ సమయంలో రేఖా గుప్తా వెంట దిల్లీ బీజేపీ ఇన్?ఛార్జ్? బైజయంత్ పండా, అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవా సహా పలువురు పార్టీ నాయకులు ఉన్నారు.

వికసిత్ దిల్లీ లక్ష్యాన్ని సాకారం చేసేందుకు తమ ప్రభుత్వం ఒక్క రోజు కూడా వృథా చేయదని సీఎం రేఖా గుప్తా తెలిపారు. ప్రజలకు ఇచ్చిన అన్ని వాగ్దానాలను తాము నెరవేరుస్తామని చెప్పారు. కొత్త మంత్రివర్గం గురువారం సాయంత్రం 7 గంటలకు సమావేశమవుతుందని వెల్లడించారు. అనంతరం మంత్రులతో కలిసి యమునా ఘాట్‌లో హారతి ఇస్తామని పేర్కొన్నారు.

**రేఖా గుప్తా సర్కార్‌కు సవాళ్ల స్వాగతం**

దిల్లీలో బీజేపీ ప్రభుత్వానికి అనేక సవాళ్లు స్వాగతం పలుకుతున్నాయి. గత ప్రభుత్వ

మిగతా..2 లో

## నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టుకు హాజరైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి


- ఎన్నికల ప్రచారానికి సంబంధించి మూడు పోలీస్ స్టేషన్‌లలో రేవంత్ రెడ్డిపై కేసులు
- ఈ కేసుల విచారణ నిమిత్తం కోర్టుకు హాజరైన రేవంత్ రెడ్డి
- రేవంత్ రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు ఉద్దేశపూర్వకంగా కేసులు నమోదు చేశారన్న న్యాయవాది



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్‌లోని నాంపల్లిలో గల ప్రజాప్రతినిధుల కోర్టుకు హాజరయ్యారు. ఎన్నికల ప్రచారానికి సంబంధించి ఆయనపై మూడు పోలీస్ స్టేషన్‌లలో కేసులు నమోదయ్యాయి. నల్గొండ టూటౌన్ పోలీస్ స్టేషన్, బేగంబజార్ పోలీస్ స్టేషన్, మెదక్ జిల్లాలోని కౌడిపల్లి పోలీస్ స్టేషన్లలో ఈ కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల విచారణ నిమిత్తం ఆయన కోర్టుకు హాజరయ్యారు. రేవంత్ రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా కేసులు నమోదు చేసిందని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ లీగల్ సెల్ వైస్ చైర్మన్ తిరుపతి వర్మ కోర్టుకు తెలిపారు. అనంతరం తదుపరి విచారణను వచ్చే నెల 23వ తేదీకి వాయిదా వేశారు.

మిగతా..2 లో

## ఐదేళ్లు దోచుకున్నారు.. బొత్సపై షర్మిల ఫైర్



విజయవాడ: వైసీపీ నేత బొత్స సత్యనారాయణపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐదేళ్లు ఖాళీగా ఉన్నది ఎవరో, రాష్ట్ర సంపదను పందికొక్కుల్లా తిన్నది ఎవరో రాష్ట్ర ప్రజానీకానికి తెలుసు అని విమర్శించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్‌లో వైసీపీపై వైఎస్ షర్మిల ధ్వజమెత్తారు. బొత్స సత్యనారాయణ మాటలు వింటుంటే దెయ్యాలు వేదాలు వర్ణించినట్లుందని ఆక్షేపించారు. నమ్మి అధికారం ఇస్తే ఖాళీగా ఉన్నదెవరో తెలుసునని

మిగతా..2 లో

## శ్రీవారి ఆలయం పై విమానం.. భక్తుల ఆగ్రహం



- తిరుమల శ్రీవారి ఆలయంపై విమానాల రాకపోకలు నిత్యం పరిపాటిగా మారిపోయాయి.
- శ్రీవారి ఆలయం పై విమానాలు వెళ్ళడం పట్ల భక్తులు ఆవేదన వ్యక్తం

తిరుమల, ఫిబ్రవరి 20: కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల శ్రీవారి ఆలయం పై నుంచి మరోసారి విమానం వెళ్లడం తీవ్ర కలకలం రేపుతోంది. గత కొంత కాలంగా తరుచూగా శ్రీవారి ఆలయం పై నుంచి విమానాలు వెళ్తుండటం చర్చనీయాంశంగా మారింది.

మిగతా..2 లో

## అమెరికాలో ఢీకొన్న రెండు విమానాలు.. ఇద్దరి మృతి



- అమెరికాలో వరుసగా చోటుచేసుకుంటున్న విమాన ప్రమాదాలు
- ఆరిజోనా రాష్ట్రంలో ఢీకొన్న రెండు చిన్న విమానాలు
- ప్రమాదంలో ఇద్దరి మృతి

మిగతా..2 లో

## ఎన్డీయే పక్షాల సీఎంలు, డిప్యూటీ సీఎంలతో మోదీ మీటింగ్..

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఈ సమావేశానికి హాజరయ్యారు.
- ఢిల్లీ సీఎం రేఖాగుప్తా, డిప్యూటీ సీఎం పర్వేష్ సాహెబ్ సింగ్ కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు.
- ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు కట్టుబడి ఉన్నామని, అన్ని హామీలు అమలుచేస్తామని పవన్



ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖాగుప్తా ప్రమాణ స్వీకారం ముగిసిన తర్వాత ఢిల్లీలో ఎన్డీయే పక్షాల సీఎంలు, డిప్యూటీ సీఎంల సమావేశం జరిగింది. అలాగే బీజేపీ ఎన్డీయే నేతలకు ప్రత్యేక విందు ఏర్పాటుచేసింది. ఈ సమావేశంలో ప్రధాని మోదీ, అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షులు నడ్డా హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఈ సమావేశానికి హాజరయ్యారు. అలాగే ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టడంతో ఆ రాష్ట్ర సీఎం యోగి ఆదిత్యనాథ్ ఢిల్లీ సీఎం ప్రమాణ స్వీకారానికి, ఎన్డీయే పక్షాల సీఎంల సమావేశానికి హాజరుకాలేదు. ఈ సమావేశంలో ప్రభుత్వాల పనితీరు ప్రధాని మోదీ

మిగతా..2 లో

## కేసీఆర్ బీజేపీకి, నరేంద్ర మోదీకి భయపడుతున్నారా?

- కమ్యూనిస్టులు కాంగ్రెస్ పార్టీకి తొత్తులుగా మారారన్న కేసీఆర్ వ్యాఖ్యలపై ఆగ్రహం
- కమ్యూనిస్టులను విమర్శించే నైతిక హక్కు కేసీఆర్‌కు లేదన్న జాన్ వెస్లీ
- కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని కూనంనేని సాంబశివరావు డిమాండ్



తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బీజేపీకి భయపడుతున్నారా? లేక ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి భయపడుతున్నారా? అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ప్రశ్నించారు. కమ్యూనిస్టులు కాంగ్రెస్ పార్టీకి తొత్తులుగా మారారన్న కేసీఆర్ వ్యాఖ్యలను ఆయన ఖండించారు. కమ్యూనిస్టులను విమర్శించే నైతిక హక్కు కేసీఆర్‌కు లేదని ఆయన అన్నారు. గత ఎన్నికల్లో బీజేపీకి లాభం చేకూరేలా కేసీఆర్ వ్యవహరించారని ఆరోపించారు. బీజేపీ పట్ల బీఆర్ఎస్ వైఖరి ఏమిటో చెప్పాలని ప్రశ్నించారు. కమ్యూ నిస్టులపై కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

మిగతా..2 లో

## కేసు కొట్టి వేయాలంటూ కౌశిక్ రెడ్డి పిటిషన్

- అసెంబ్లీ ఎన్నికల సమయంలో బెదిరించారంటూ నోడల్ అధికారి ఫిర్యాదు
- పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసిన కమలాపూర్ పోలీసులు



తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ప్రచార సమయంలో ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించారంటూ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై కేసు నమోదైంది. ఈ కేసును కొట్టివేయాలంటూ కౌశిక్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై ఈరోజు తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. విచారణ జరిపిన హైకోర్టు తదుపరి విచారణను మార్చి 12వ తేదీకి వాయిదా వేసింది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో హుజూరాబాద్‌లో ప్రచారం సందర్భంగా ఆత్మహత్య చేసుకుంటానని కౌశిక్ రెడ్డి బెదిరించాడని కేసు నమోదైంది. కమలాపూర్ నోడల్ అధికారి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రచారంలో ఆత్మహత్య చేసుకుంటానని కౌశిక్ రెడ్డి బెదిరింపులకు పాల్పడ్డారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. నోడల్ అధికారి ఫిర్యాదుతో పలు సెక్షన్ల కింద కమలాపూర్ పోలీస్ స్టేషన్‌లో

మిగతా..2 లో

## జగన్‌తో స్నేహంగా ఉంటూ ఏపీ నీళ్ల దోపిడీని కేసీఆర్ ఏనాడు అడ్డుకోలేదు

- ఉత్తమ్ కుమార్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి
- ఒక్క ఎకరానికి కూడా నీళ్లు ఇవ్వలేదు
- కమీషన్ల కోసం ఎక్కువ వడ్డీలకు అప్పులు
- రోజుకో టీఎంసీని ఏపీ తరలిస్తుంది



ఏపీ ప్రభుత్వం చేస్తున్న జలదోపిడీకి గత బీఆర్ఎస్ ప్రభుత్వం సహకరించిందని తెలంగాణ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. తెలంగాణ సచివాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు కేవలం 200 టీఎంసీలు సరిపోతాయని చెప్పిన ఘనత బీఆర్ఎస్ దేనని తీవ్రంగా విమర్శించారు.

**500 టీఎంసీలు కావాలన్నాం :** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే కృష్ణా నది నీటిలో తెలంగాణకు 500 టీఎంసీలు కావాలనే వాదన ప్రారంభించామన్నారు. పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి చేసి ఉంటే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అద్భుతంగా ఉండేదని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వల్లే తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆరోపించారు. జగన్‌తో స్నేహంగా ఉంటూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఏపీ చేస్తున్న జలదోపిడీకి సహకరించారన్నారు. జగన్ పోతిరెడ్డిపాడు కెపాసిటీ పెంచుతున్నా, అక్రమంగా ముచ్చుమర్రి నిర్మాణం చేపట్టినా కేసీఆర్ నోరెత్తలేదని మండిపడ్డారు. "పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్?ఎస్ ప్రభుత్వం కనీసం టెలిమెట్రీల ఏర్పాటు కూడా చేయలేదు. కృష్ణా జలాలను ఏపీ మాజీ ముఖ్యమంత్రి జగన్ ప్రభుత్వం బేసిన్ అవతలకు తరలిస్తుంటే అస్సలు పట్టించుకోలేదు. కృష్ణా జలాల్లో 299 టీఎంసీలు తెలంగాణ హక్కు అయితే 190 టీఎంసీల కంటే ఎక్కువగా ఎన్నడూ వాడలేదు. కృష్ణా బేసిన్‌లో నిర్మిస్తున్న ప్రాజెక్టులు పూర్తి చేసి ఉంటే తెలంగాణ వాటా పూర్తిగా వాడుకునేవాళ్లం. ఏదుల, డిండి ప్రాజెక్టులను కూడా పదేళ్లలో గత ప్రభుత్వం

మిగతా..2 లో

తెలంగాణ సేన
TELANGANA SENA TELUGU DAILY
శుక్రవారం 21 - 02 - 2025

## జగన్‌కు పిచ్చి ముదిరి డ్రామాలాడుతున్నారు..

# మంత్రి సవిత విసుర్లు

మొదటి పేజి తరువాయి

రూ.7 వేలుగా ఉన్నప్పుడు రైతు నష్టపోతాడని రూ.1500 క్వింటాకు బోనస్ ఇచ్చి రైతులను చంద్రబాబు ఆదుకున్నారని గుర్తుచేశారు. జగన్ రెడ్డి పెట్టిపోయిన రూ.1680 కోట్ల ధాన్యం బకాయిలను తాము విడుదల చేశామని తెలిపారు. పోలీసులపై జగన్ రెడ్డి వాడిన భాష సరైనది కాదని అన్నారు. పిచ్చి ముదిరితే మరోసారి లండన్ వెళ్లి టాబ్లెట్స్ డోస్ పెంచుకోవాలని సలహా ఇచ్చారు. నారా భువనేశ్వరిని అసభ్యకరంగా మాట్లాడిన అరాచకవాది కోసం మరో అరాచకవాది పరామర్శకు వెళ్లడం విచిత్రంగా ఉందని విమర్శలు చేశారు. అన్ని వ్యవస్థలను, శాంతిభద్రతలను నాశనం చేసిన జగన్ రెడ్డికి ఈ మంచి ప్రభుత్వం గురించి మాట్లాడే అర్హత లేదని అన్నారు. ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేయడం చూసి జీర్ణించుకోలేక జగన్ రెడ్డి తమ ప్రభుత్వంపై విషం చిమ్ముతున్నారని ధ్వజమెత్తారు. నిజంగా జగన్ రెడ్డి ప్రజాపక్షపాతి అయితే అసెంబ్లీకి రావాలని సవాల్ విసిరారు. తప్పకుండా అతనికి మైక్ ఇస్తాం.. ప్రతీ విషయంపై చర్చించిస్తామని మంత్రి ఎస్ సవిత తెలిపారు.

## శ్రీవారి ఆలయం పై విమానం.. భక్తుల ఆగ్రహం

మొదటి పేజి తరువాయి

అయితే ఈరోజు మాత్రం ఆలయంపై తక్కువ ఎత్తులో విమానం వెళ్లింది. ఆగమ నిబంధనలకు విరుద్ధంగా నిత్యం శ్రీవారి ఆలయం పై విమానాలు వెళ్తుండడం పట్ల భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తిరుమల శ్రీవారి ఆలయంపై విమానాల రాకపోకలు నిత్యం పరిపాటిగా మారిపోయాయి. కొద్దిరోజులుగా తిరుమల కొండపై ఆలయానికి సమీపంలో విమానాలు తిరుగుతున్నాయి. వీటిని చూసిన భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈరోజు కూడా ఓ విమానం శ్రీవారి ఆలయం గోపురం మీదుగా వెళ్లింది. ఆగమశాస్త్ర నిబంధనల ప్రకారం శ్రీవారి ఆలయంపై ఎటువంటి రాకపోకలు సాగించకూడదు. అయితే ఈ విధంగా తరచూ శ్రీవారి ఆలయంపై నుంచి విమానాలు వెళ్లడంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై టీటీడీ అభ్యంతరం వ్యక్తం చేస్తున్నప్పటికీ విమానయాన శాఖ అధికారులు మాత్రం పట్టించుకోని పరిస్థితి. టీడీపీ అభ్యంతరం తెలుపుతున్నా, భక్తులు ఆందోళన చేస్తున్నప్పటికీ తిరుమల ఆలయంపై నుంచి విమానాల రాకపోకలు నిత్యకృత్యంగా మారిపోయాయి. తిరుమల గోపురంపై నుంచి విమానాలు వెళ్లడంపై టీటీడీ ఇప్పటికే పలుమార్లు కేంద్రవిమానాయన శాఖకు విజ్ఞప్తి చేసింది. కనీసం తిరుమల శ్రీవారి ఆలయం సమీపంలో కాకుండా తిరుమల గగనతలంలో ఇతర ప్రదేశాల నుంచి విమానాల రాకపోకలు సాగించాలన్న టీటీడీ వినతులను విమానాయన శాఖ పట్టించుకున్న దాఖలాలు లేవు. కొద్దిరోజుల క్రితం తిరుమలకు వచ్చిన హోంమంత్రి అనిత కూడా ఈ అంశంపై స్పందించారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి ఈ అంశం వచ్చిందని.. దీనిపై దర్యాప్తుకు ఆదేశించినట్లు తెలిపారు. నివేదికలు వచ్చిన వెంటనే కేంద్రంతో రాష్ట్ర ప్రభుత్వం చర్చించి శ్రీవారి ఆలయం పైనుంచి విమానాల రాకపోకలు జరుగకుండా చూసుకుంటామని హోంమంత్రి అనిత చెప్పారు

## తెలంగాణ అభివృద్ధికి కేంద్రం కృషి

బండి సంజయ్ కుమార్ తెలిపారు. రైతులను అన్నివిధాలా కేంద్రం ఆదుకుంటుందని అన్నారు. ఆరు గ్యారెంటీలను తెలంగాణలో సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. ఆరు గ్యారెంటీ స్కీంల్లో ఎన్ని అమలు చేస్తున్నారో దమ్ము ఉంటే చర్చకు సిద్ధమా అని బండి సంజయ్ కుమార్ సవాల్ విసిరారు. ఇవాళ(గురువారం) హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు, గ్రాంట్లపై తాము చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. రేవంత్ రెడ్డి సిద్ధమా అని ఛాలెంజ్ చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీపై రేవంత్‌రెడ్డి తన స్థాయిని మరచి పోయి మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. రేవంత్ చిల్లర మాటలు ఇక ఆపు అని హెచ్చరించారు. రేవంత్ మాటలను ప్రజలు మెచ్చడం లేదని అన్నారు. రేవంత్ తన వైఖరి మార్చుకోవాలని బండి సంజయ్ సూచించారు.

### రేవంత్ ప్రభుత్వం మోసం చేసింది: కిషన్‌రెడ్డి

యాదాద్రి: రేవంత్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయడం లేదని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి నిలదీశారు. ఇవాళ(గురువారం) యాదాద్రిలో కిషన్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా మీడియాతో కిషన్‌రెడ్డి మాట్లాడారు. అన్నివర్గాలను రేవంత్ ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు పార్టీలు నాటకాలాడుతున్నాయని ఆరోపించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో 3 స్థానాల్లోనూ బీజేపీదే విజయమని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై అన్నివర్గాల్లోనూ వ్యతిరేకత ఉందని కిషన్‌రెడ్డి విమర్శించారు.

## ఎన్డీయే పక్షాల సీఎంలు, డిప్యూటీ సీఎంల సమావేశం

ఇచ్చారు. దీనికి చంద్రబాబు, పవన్ ధన్యవాదాలు తెలియజేశారు. ఎన్డీయే సమావేశం పూర్తైన తర్వాత జాతీయ మీడియాతో పవన్ మాట్లాడుతూ... ఆరోగ్యం బాగోలేకపోవడం వల్లే గత ఎన్డీయే సమావేశాలకు తాను హాజరుకాలేకపోయానని చెప్పారు. ఇప్పటికీ తాను వెన్నునొప్పితో బాధపడుతున్నానని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉన్నామని... అన్ని హామీలను నెరవేరుస్తామని చెప్పారు.

## అమెరికాలో ఢీకొన్న రెండు విమానాలు..

అమెరికాలో వరుస విమాన ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయి. గత నెల 31న ల్యాండ్ అవుతున్న ఓ విమానాన్ని హెలికాప్టర్ ఢీకొన్న ఘటనలో 67 మంది మృత్యువాత పడ్డ సంగతి తెలిసిందే. తాజాగా అమెరికాలో సింగిల్ ఇంజిన్‌తో కూడిన రెండు చిన్న విమానాలు ఢీ కొన్నాయి. ఈ ఘటనలో ఇద్దరు మృతి చెందారు. ఈ ప్రమాదం తాలూకు వీడియో ఒకటి నెట్‌లో చక్కర్లు కొడుతోంది. అమెరికాలోని ఆరిజోనా రాష్ట్రంలో ఈ ప్రమాదం జరిగింది. అమెరికా కాలమానం ప్రకారం బుధవారం ఉదయం రన్ వే పై సెస్నా 1725, లాంకైర్ 360 ఎంకే 11 ఢీకొన్నట్లు అక్కడి అధికారులు తెలిపారు. మృతులకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

### అసెంబ్లీ ఎన్నికల సమయంలో

## బెదిరించారంటూ నోడల్ అధికారి ఫిర్యాదు

ప్రస్తుతం ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టులో కేసు విచారణలో ఉంది. ఈ కేసును కొట్టి వేయాలంటూ కౌశిక్ రెడ్డి గతంలో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ఈరోజు విచారణ జరిపిన హైకోర్టు, తదుపరి విచారణను వాయిదా వేసింది.

### బండి సంజయ్‌పై నమోదైన కేసును కొట్టివేసిన ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టు

కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌పై నమోదైన కేసును నాంపల్లి ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టు కొట్టివేసింది. మునుగోడు ఉప ఎన్నికల సమయంలో మర్రిగూడ పోలీస్ స్టేషన్‌లో బండి సంజయ్?పై కేసు నమోదైంది. బీఆర్ఎస్‌ను దండుపాళ్యం బ్యాచ్‌తో పోల్చారంటూ ఫిర్యాదు అందడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణ జరిపిన ప్రత్యేక కోర్టు కేసును కొట్టివేసింది.

## కేసీఆర్ బీజేపీకి, నరేంద్ర మోదీకి భయపడుతున్నారా?

కేసీఆర్‌కు సహకరిస్తే కమ్యూనిస్టులు త్యాగధనులు అవుతారు, లేకుంటే ఇతర పార్టీలకు తొత్తులు అవుతారా అని నిలదీశారు. కమ్యూనిస్టులపై చేసిన వ్యాఖ్యలను కేసీఆర్ వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కమ్యూనిస్టుల త్యాగాలు కేసీఆర్‌కు బాగా తెలుసునని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి పదవి లేకుండా కేసీఆర్ ఉండలేరా అని ప్రశ్నించారు. ప్రతిపక్ష నాయకుడిగా ప్రజల పక్షాన పోరాడాలని సూచించారు. కమ్యూనిస్టుల అజెండాను తీసుకుంటామని చెప్పి మోసం చేసిన చరిత్ర కేసీఆర్‌ది అన్నారు.

### వచ్చి రాగానే కొత్త ప్రభుత్వంపై ఆప్ ఒత్తిడి..

## ఢిల్లీ మహిళలు వేచి చూస్తున్నారని..

దేశ రాజధాని ఢిల్లీలో బీజేపీ కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. సీఎంతోపాటు మరో ఆరుగురు మంత్రులు కూడా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ క్రమంలో వచ్చి రాగానే కొత్త ప్రభుత్వంపై ఆప్ ఒత్తిడి తెచ్చింది. ఢిల్లీ ప్రజలకు ఇచ్చిన హామీని బీజేపీ ఇప్పుడు నెరవేర్చాలని ఆప్ సీనియర్ నేత, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అతిషి అన్నారు. గురువారం మొదటి మంత్రివర్గ సమావేశంలో ఢిల్లీ మహిళలకు నెలకు రూ. 2500 ఇచ్చే పథకాన్ని ఆమోదించాలని కోరారు. అంతేకాదు మార్చి 8 నాటికి బీజేపీ ప్రభుత్వం తమ ఖాతాల్లోకి రూ. 2500 జమ చేస్తుందని ఢిల్లీ మహిళలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రధానమంత్రితో సహా అందరు బీజేపీ నేతలు తమ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత, మొదటి మంత్రివర్గంలో మహిళలకు నెలకు



రూ. 2500 ఇచ్చే పథకాన్ని ఆమోదిస్తామని హామీ ఇచ్చారు. ఢిల్లీలో మహిళలందరూ తమ ఫోన్‌లను తమ బ్యాంకు ఖాతాలకు లింక్ చేసుకోవాలని, తద్వారా మార్చి 8న వారి ఖాతాలో రూ. 2500 జమ అయ్యిందని మెసేజ్ వస్తుందని ప్రధానమంత్రి ఓ ర్యాలీలో చెప్పారని అతిషి గుర్తు చేశారు. ఇప్పుడు కొత్త ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేసిందని, రేఖ గుప్తా సీఎంగా బాధ్యతలు స్వీకరించారని అతిషి పేర్కొన్నారు. ఈ క్రమంలో ఢిల్లీ ప్రభుత్వ మొదటి మంత్రివర్గ సమావేశం ఈరోజు రాత్రి 7 గంటలకు జరుగుతుంది. కాబట్టి నేడు రేఖ గుప్తా, ఢిల్లీ బీజేపీ ప్రభుత్వం ప్రతి మహిళకు నెలకు రూ. 2500 ఇస్తామని బీజేపీ చేసిన వాగ్దానాన్ని క్యాబినెట్ సమావేశంలో ఆమోదించాలన్నారు. ఈ క్రమంలోనే ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అతిషి కొత్తగా నియమితులైన ముఖ్యమంత్రి రేఖ గుప్తా, ఆమె మొత్తం మంత్రివర్గాన్ని ప్రమాణ స్వీకారం చేసినందున అభినందించారు.

### ఆ మందులు వికటించాయా..

# ఆందోళనకరంగా జగన్ మాటలు

మొదటి పేజి తరువాయి

జగన్ భద్రతపై వైసీపీ నేతలు చేస్తున్న వ్యాఖ్యలపై మండిపడ్డారు మంత్రులు. కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ.. జగన్ ఒక ఎమ్మెల్యే మాత్రమే అని.. ప్రతిపక్ష నేత కాదన్నారు. జగన్‌కు జైలు యాత్రలతో ఖైదీలు, వాళ్ళ కుటుంబ సభ్యులలో మంచి క్రేజ్ వచ్చిందని ఎద్దేవా చేశారు. జగన్‌కు లండన్ మందులు వికటించినట్టున్నాయని.. మగాళ్ళ అందాలు, బట్టలిప్పడం లాంటి మాటలు ఆందోళన కలిగిస్తున్నాయని మంత్రి వాసంశెట్టి అన్నారు.

### భద్రత లేదంటూ డ్రామాలు: మంత్రి బాలవీరాంజనేయ

ప్రకాశం: ఎన్నికల కోడ్ ప్రతి ఒక్కరికీ వర్తిస్తుందని.. జగన్ పర్యటనకు అనుమతి లేదని జిల్లా కలెక్టర్ ముందుగానే చెప్పారని మంత్రి బాలవీరాంజనేయస్వామి అన్నారు. ఎన్నికల కమిషన్‌ను ధిక్కరించి మిర్చియాడ్‌కు జగన్ వెళ్లారన్నారు. తనకు భద్రత లేదని జగన్ డ్రామాలు చేస్తున్నారని మండిపడ్డారు. మిర్చియార్డ్‌లో ఉన్న మిరపకాయల బస్తాలు కూడా దొంగతనం చేశారన్నారు. ప్రజాస్వామ్యం పట్ల కూటమి ప్రభుత్వానికి విలువలు గౌరవం ఉందని స్పష్టం చేశారు. జగన్‌కు భద్రత కల్పించడంలో ప్రభుత్వ వైఫల్యం ఏమీ లేదన్నారు. జగన్‌పై ఉద్దేశపూర్వకంగా కేసులు పెట్టలేదన్నారు. అధికారంలో ఉన్నప్పుడు జగన్ బ్లూ రాజ్యాంగం, రాజారెడ్డి రాజ్యాంగం నడిపారని మండిపడ్డారు. జగన్ ఎన్ని పుస్తకాలు పెట్టుకున్నా ఇబ్బంది లేదన్నారు. ప్రజాస్వామ్య విలువల్ని కాపాడుకుంటూ తాము ముందుకెళ్తున్నామని మంత్రి చెప్పారు.



### చూస్తూ ఊరుకోం.. జాగ్రత్త: ప్రత్తిపాటి

పల్నాడు: అధికారంలో ఉన్నప్పుడు జగన్ రెడ్డి అడ్డగోలుగా రైతుల భూములు లాక్కున్నారని చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ధ్వజమెత్తారు. రైతుల గురించి జగన్ రెడ్డి మాట్లాడటం రాజకీయ డ్రామాలో భాగమే అని అన్నారు. మిర్చి గిట్టుబాటు ధర రూ.7 వేలుగా ప్రకటించి జీవో ఇచ్చింది జగన్ కాదా అని ప్రశ్నించారు. నేడు ఏ ముఖం పెట్టుకొని మిర్చిరైతులు నష్ట పోతున్నారని గగ్గోలు పెడుతున్నారని ప్రశ్నించారు. వైసీపీ పాలనలో అరకొరగా ధాన్యంకొని, రైతులకు సకాలంలో డబ్బులు ఇవ్వలేదన్నారు. రైతులపై జగన్ రెడ్డి కపట ప్రేమ చూపడం రాజకీయ స్వలాభం కోసమే అని విమర్శించారు. అసెంబ్లీలో గొంతెత్తని వ్యక్తి, అన్నదాతల గురించి రోడ్లపై హంగామా ఎందుకని నిలదీశారు. 14 ఏళ్ళు సీఎంగా పని చేసిన చంద్రబాబుకు ఎలాంటి భద్రత కల్పించారో జగన్ చెప్పాలని డిమాండ్ చేశారు. పనిలేనప్పుడు రోడ్లెక్కి.. నోటికొచ్చినట్టు మాట్లాడిపోతాం అంటే చూస్తూ ఊరుకోమని ప్రత్తిపాటి పెల్లారావు హెచ్చరించారు.

### క్షమాపణ చెప్పాల్సిందే: శ్రీనివాసరావు

బాపట్ల: గుంటూరు జిల్లాలో వైసీపీ నేతలు రోజుకొకరు పార్టీని వీడుతున్నారని.. ఆందోళనలో ఉన్న జగన్ రెడ్డి గుంటూరులో బల ప్రదర్శన చేపట్టారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు వ్యాఖ్యలు చేశారు. వైసీపీ అల్లరి మూకలతో జగన్ రెడ్డి మిర్చి యార్డ్‌లో రైతులను ఇబ్బంది పెట్టారన్నారు. ఆరుగాలం పండించి యార్డ్‌కు తెచ్చిన మిర్చి పంటను తొక్కి నాశనం చేశారని ఆగ్రహించారు. యార్డ్‌లో మిర్చి నష్టపోయిన రైతులకు జగన్ రెడ్డి క్షమాపణ చెప్పి నష్టపరిహారం ఇవ్వాలని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు

# సీఎం రేఖా గుప్తా ఆన్ డ్యూటీ

మొదటి పేజి తరువాయి

పథకాలను కొనసాగిస్తూనే కీలక ఎన్నికల హామీలను అమలు చేయడం రేఖాగుప్తా సర్కార్‌కు కత్తిమీద సాములాగే కనిపిస్తోంది. ఇదే సమయంలో రాజధాని నగరాన్ని కొన్నేళ్లుగా పట్టిపీడిస్తున్న కాలుష్య భూతాన్ని తరిమికొట్టడం, మౌలిక వసతుల కల్పన, యమునా నది ప్రక్షాళన బీజేపీ ప్రభుత్వం ముందు అతిపెద్ద సమస్యలుగా ఉన్నాయి.ఢిల్లీలో 26 ఏళ్ల తర్వాత అధికారంలోకి వచ్చిన బీజేపీ మొదట ఎన్నికల హామీలపై దృష్టిపెడతామని ఇప్పటికే సంకేతాలిచ్చింది. ఢిల్లీలోని ప్రతి పౌరుడి సంక్షేమం, సాధికారత, సమగ్రాభివృద్ధి కోసం పూర్తి నిజాయితీతో, అంకితభావంతో పనిచేస్తానని సీఎం రేఖా గుప్తా ఇప్పటికే ప్రకటించారు. ఈ కోవలో ఎన్నికల హామీల్లో అత్యంత కీలకమైన మహిళలకు ప్రతినెలా 2500 రూపాయలు చెల్లించే పథకాన్ని అమలు చేయాల్సి ఉంది. ఇది బీజేపీ ఎన్నికల మేనిఫెస్టోలో అత్యంత కీలకమైన పథకం.

ఇదే సమయంలో ఆప్ సర్కార్ అమలు చేసిన సంక్షేమ పథకాలన్నింటినీ కొనసాగిస్తామని బీజేపీ ప్రకటించినందున 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇవ్వాల్సి ఉంది. ఉచితంగా మంచినీటి కనెక్షన్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాలి. ఢిల్లీలో ఆయుష్మాన్ భారత్ పథకాన్ని అమలు చేస్తామని బీజేపీ ఇప్పటికే ప్రకటించింది. లబ్ధిదారులకు ఒక్కొక్కరికి 5 లక్షల రూపాయల వరకు ఉచిత వైద్యం అందించాల్సి ఉండగా మరో రూ.5 లక్షలు అదనంగా ఖర్చు చేస్తామని బీజేపీ హామీ ఇచ్చింది. ఆప్ సర్కార్ తీసుకొచ్చిన మొహల్లా క్లినిక్‌ల్లో అవినీతి జరిగిందని ఆరోపించిన బీజేపీ నేతలు వాటిని ప్రక్షాళన చేస్తామని చెప్పారు.

**యమునా నది ప్రక్షాళన పెద్ద సవాల్?!**

కాలుష్య కాసారంగా మారిన యమునా నదిని ప్రక్షాళన చేయడం, బీజేపీ సర్కారు ముందున్న మరో సవాలు. గత పదేళ్లలో ఆప్ సర్కారు యమునానదిని పట్టించుకో లేదని బీజేపీ విమర్శిస్తూ వచ్చింది. అధికారంలోకి రాగానే యమునానదిని శుద్ధి చేస్తామని ప్రధాని మోదీ సైతం ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చారు. అయితే ఇప్పటికే అధికార యంత్రాంగం ఆ పనిలో నిమగ్నమైంది.



**వాయుకాలుష్యం మరో అతిపెద్ద సమస్య**

ఢిల్లీలో రహదారులు, మురుగునీటి పారుదల వ్యవస్థ అధ్వానంగా తయారైందని బీజేపీ నేతలు పెద్దఎత్తున ఆప్ సర్కార్‌పై విమర్శలు గుప్పించారు. ఫలితంగా ఆయా వ్యవస్థలను చక్కదిద్దాల్సిన బాధ్యత రేఖాసింగ్ సర్కార్‌పై ఉంది. ఢిల్లీలో వాయుకాలుష్యం అతిపెద్ద సమస్యగా తయారైంది. ప్రపంచంలోనే అత్యంత కాలుష్యకారక రాజధానుల్లో ఢిల్లీ ఒకటిగా నిలిచింది. ఈ పరిస్థితిలో మార్పు తెచ్చేందుకు సమర్ధ విధానాలను అమలుచేయడం సహా ఎలక్ట్రిక్ వాహనాలను పెద్దఎత్తున ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది.

# ఐదేళ్లు దోచుకున్నారు.. బొత్సపై షర్మిల ఫైర్

మొదటి పేజి తరువాయి

విమర్శించారు. ఐదేళ్లలో ఎలాంటి పని చేయకుండా రాష్ట్ర సంపదను పందికొక్కుల్లా దోచుకుతిన్నారని ఆరోపించారు. ఐదేళ్ళ కుంభకర్ణుడి లెక్క నిద్ర పోయారని ఎద్దేవా చేశారు. అధికారం అనుభవిస్తూ ఖాళీగా కూర్చున్నారని మండిపడ్డారు. పార్టీ పాలసీకి, తండ్రి ఆశయాలకు విరుద్ధంగా బీజేపీకి దత్తపుత్రుడిగా మారారని విమర్శించారు. ప్రజల సంపదను ప్యాలెస్‌కు మళ్లించుకున్నారని విమర్శించారు. ఐదేళ్ళు ఖాళీగా ఉండి ఎన్నికల ముందు సిద్ధం అంటూ బయటకు వచ్చారని తెలిపారు. ఐదేళ్ళు పని చేయకుండా ఖాళీగా ఉన్నారని తెలిసి ప్రజలు మిమ్మల్ని పనికి రాకుండా చేశారని మండిపడ్డారు. 151 సీట్ల నుంచి వైసీపీని 11 సీట్లకు ప్రజలు పరిమితం చేశారని.. అయినా కూడా మీ వైఖరీలో మార్పు రావడం లేదని విమర్శించారు. చివరకు ప్రతిపక్ష హోదా లేకుండా ప్రజలు బుద్ధి చెప్పారని అన్నారు. మిర్చి రైతుల కష్టాలపై వైసీపీ కంటే ముందుగానే కూటమి ప్రభుత్వాన్ని తాము ప్రశ్నించామని తెలిపారు. రేట్ల హెచ్చుతగ్గులపై రైతు నష్టపోకుండా రూ.5వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి పెట్టాలని డిమాండ్ చేశామని గుర్తు చేశారు.

### వారితో కుట్ర చేస్తున్నారా.. ఏపీ ఫైబర్ నెట్ ఎండీపై జీవీరెడ్డి ఫైర్

కేంద్ర ప్రభుత్వం నుంచి వెంటనే నిధులు తీసుకురావాలని కూటమి ప్రభుత్వాన్ని నిలదీశామని అన్నారు. సూపర్ సిక్స్‌లో భాగంగా పెట్టుబడి సహాయం రూ.20 వేలను వెంటనే అమలు చేయాలని తాము డిమాండ్ చేశామన్నారు. ప్రతి నెల కూటమి హామీలపై ఏపీ వ్యాప్తంగా ఆందోళనలు చేస్తున్నామని గుర్తుచేశారు. అసెంబ్లీలో అడిగే అవకాశం కాంగ్రెస్ పార్టీకి లేదు కాబట్టి.. 11 సీట్లతో అసెంబ్లీకి వెళ్లే అవకాశం మీకుంది కాబట్టి.. వైసీపీని శాసన సభకు వెళ్లాలని డిమాండ్ చేశామన్నారు. రైతుల పట్ల కూటమి నిర్లక్ష్యాన్ని సభ వేదికగా ఎండగట్టాలని వైసీపీని అడిగామని అన్నారు.



చంద్రబాబు సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూనే, వైసీపీ సభ్యులు అసెంబ్లీకి వెళ్లాలని కోరితే.. ప్రజల పక్షాన నిలబడాలని అడిగితే.. వ్యక్తిగత అజెండా అంటూ వైసీపీ నేతలు భుజాలు తడుముకోవడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. ప్రజలకు సమాధానం చెప్పకుండా దాటవేయడం మీ అవివేకానికి నిదర్శనమని ఆక్షేపించారు. మళ్లీ మళ్లీ వైసీపీని అడుగుతూనే ఉంటామని స్పష్టం చేశారు. అసెంబ్లీకి వెళ్లే అంశంపై వైసీపీ పాలసీ ఏంటో చెప్పాలని ప్రశ్నించారు. వైసీపీ సభ్యులు అసెంబ్లీకి వెళ్లకపోతే వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఇంట్లో కూర్చొని ప్రెస్ మీట్‌లు పెట్టడానికి కాదు ప్రజలు మీకు ఓట్లు వేసిందని విమర్శించారు. దమ్ముంటే తమ ప్రశ్నలకు సమాధానం చెప్పాలని వైఎస్ షర్మిల సవాల్ విసిరారు.

# జగన్‌తో స్నేహంగా ఉంటూ ఏపీ నీళ్ల దోపిడీని కేసీఆర్ ఏనాడు అడ్డుకోలేదు

మొదటి పేజి తరువాయి

పూర్తి చేయలేదు" ఉత్తమ్ కుమార్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి

**ఒక్క ఎకరానికి కూడా నీళ్లు ఇవ్వలేదు :** పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టుపై రూ.25 వేల కోట్లు ఖర్చు చేసి ఒక్క ఎకరానికి కూడా నీళు ఇవ్వలేదని మంత్రి ఉత్తమ్ ఆరోపించారు. కృష్ణా జలాలను ఏపీ ప్రభుత్వం అధికంగా వాడుకుంటున్న విషయాన్ని కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన తెలిపారు. సీతారామ ప్రాజెక్టుకు 67 టీఎంసీల అనుమతిని తామే సాధించినట్లు స్పష్టం చేశారు. సమ్మక్క- సారక్క ప్రాజెక్టుకు కూడా అనుమతులు సాధించామన్నారు.

**కమీషన్ల కోసం ఎక్కువ వడ్డీలకు అప్పులు :** మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణం, కుంగిపోవటం బీఆర్ఎస్ పాలన కాలంలోనే జరిగిందని, మేడిగడ్డ బ్యారేజీ కుంగడంపై కేసీఆర్ ఎప్పుడూ నోరు కూడా విప్పలేదని ఉత్తమ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. మేడిగడ్డ డిజైన్, నిర్మాణంలో లోపాలు ఉన్నాయని జాతీయ డ్యామ్ సేఫ్టీ కమిటీ చెప్పిందని, ఎవరైనా ప్రాజెక్టుల కోసం దీర్ఘకాలిక, తక్కువ వడ్డీకి రుణాలు తెస్తారా అని ప్రశ్నించారు. కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం కమీషన్ల కక్కుర్తి కోసం అడ్డగోలుగా ఎక్కువ వడ్డీకి అప్పులు తెచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వల్లే కృష్ణా జలాల్లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగినట్లు ఆయన ఆరోపించారు.

**రోజుకో టీఎంసీని ఏపీ తరలిస్తుంది :** పదేళ్లపాటు కనీసం ఎస్ఎల్‌బీసీ టన్నెల్ నిర్మాణాన్ని కేసీఆర్ పట్టించుకోలేదని, కృష్ణా జలాలను జగన్ ప్రభుత్వం బేసిన్ అవతలకు తరలిస్తుంటే చూస్తు ఉన్నారని మంత్రి ఉత్తమ్ అన్నారు. కృష్ణా జలాల్లో కేటాయింపులు చెరో సగం చేయాలని వాదన తానే మొదలుపెట్టినట్లు తెలిపారు.



తెలంగాణకు 299 టీఎంసీలు సరిపోతాయని గతంలో కేసీఆర్ ఒప్పుకుని వచ్చారని ఆరోపించారు. గతంలో శ్రీశైలం ప్రాజెక్టు అట్టడుగు నుంచి కూడా రోజుకో టీఎంసీని ఏపీ తరలించుకుపోతుంటే కేసీఆర్ నోరెత్తలేదని మండిపడ్డారు.

# జిల్లాలో మాదక ద్రవ్యాలను నియంత్రించాలి

మాదక ద్రవ్యాల కలిగే నష్టాలపై అవగాహన కల్పించాలి::

జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్



**తెలంగాణ సేన మహబూబాబాద్, ఫిబ్రవరి.20 :** జిల్లాలో మాదక ద్రవ్యాలను నియంత్రించాలని కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. గురువారం ఐ.డి.ఓ.సి లోని కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీ సుధీర్ రాం నాథ్ కేకన్, స్థానిక సంస్థల, రెవెన్యూ అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్ టొప్పో, కె.వీరబ్రహ్మచారీ లతో కలిసి సంబంధిత అధికారులతో జిల్లా స్థాయి నార్కో కోఆర్డినేషన్ సెంటర్ కమిటీ (ఎన్‌కార్డ్)సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నివారణకు పోలీసశాఖ కృషి చేస్తోందని, వాటికి ఇతర శాఖలన్నీ సహకారం, అందించాలన్నారు జిల్లాలో గంజాయి రవాణాను అరికట్టే దిశగా దృష్టి సారించాలని, గంజాయి ఒక సామాజిక దురాచారంగా తయారైందన్నారు. దీనిపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు కళాజాత బృందాలు, ర్యాలీలు, సమావేశాలు నిర్వహించాలని అన్నారు. సంక్షేమ హాస్టళ్ళలోని విద్యార్థులకు, వీటిపై అవగాహనా కల్పించేందుకు వివిధ రకాల పోటీలు నిర్వహించాలని, పాఠశాల విద్యార్థులకు ప్రార్థన సమయాలలో పలు సందేశాలతో అవగాహన కల్పించాలని, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించాలన్నారు. ప్రతీ పట్టణ మండల, గ్రామ స్థాయిలో రెవెన్యూ, పోలీసు యంత్రాంగం కలిసి మాదక ద్రవ్యాల నివారణకు ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించే విధంగా,చర్యలు,చేపట్టాలన్నారు.ఎస్పీ సుధీర్ రాం నాథ్ కేకన్ మాట్లాడుతూ జిల్లాలో ప్రత్యేకించి గంజాయి వివిధ మార్గాల ద్వారా రవాణాలో ఉందని, వాటిపై పోలీసు యంత్రాంగం ఎప్పటికప్పుడు నిఘా,పెట్టి,నియంత్రించేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటు న్నామని, దీనికి ఇతర శాఖలనుండి కూడా సహకారం, అందించాలన్నారు. మాదకద్రవ్యాల రవాణా మరియు ఉత్పత్తి చేయడం చట్టవ్యతిరేకమైన చర్య అని, జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో ఈ మాదకద్రవ్యాల సరఫరా ఎక్కువగా ఉన్నదని అటువంటి ప్రాంతాల్లో పోలీసు శాఖ ద్వారా నిరంతర పర్యవేక్షణ జరుగుతుందని, ఇట్టి చర్యలకు పాల్పడిన వారు కఠినంగా శిక్షించ బడుతారని తెలిపారు. ప్రజలు ముఖ్యంగా యువతీ, యువకులు,ఈ,మాదకద్రవ్యాల బానిసై తమ ఉన్నత భవిష్యత్తును నాశనం చేసుకోరాదని కోరారు. అదే విధంగా గంజాయికి బానిసైన వారి కోసం మెడికల్ విభాగం ఆధ్వర్యంలో డీఅడిక్షన్ సెంటర్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. గంజాయి వినయోగం ఎక్కడ కనిపించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ప్రతీ పాఠశాలలో, కాలేజీల్లో మాదక ద్రవ్యాలపై యువతకు అవగాహన పరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్, తొర్రూరు ఆర్డీవో లు కృష్ణవేణి, గణేష్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకట్ లకావత్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసరావు డీఎంహెచ్‌వో డాక్టర్ మురళీధర్, డ్రగ్ ఇన్స్పెక్టర్ ఉమారాణి, జిల్లా టి.బి. కంట్రోల్ అధికారి డాక్టర్ వెంకట్రాములు, ట్రైబల్ వేల్ఫేర్ డి.డి దేశీరాం, డి.ఐ.ఈ.ఓ మదార్ ,బి.సి డెవేల్మెంట్ అధికారి నరసింహస్వామి, మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి శ్రీనివాస్, ప్రభుత్వ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ లీల, విద్యశాఖ అధికారి శ్రీరాములు సి.సెక్షన్ సూపరింటెండెంట్ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్య శాఖ నియమ నిబంధనలు పాటించని ప్రైవేట్ ఆసుపత్రుల పై చర్యలు తీసుకోవాలి

అర్హత లేని వ్యక్తులతో ల్యాబ్ మరియ మెడికల్ షాపులు నడిపిస్తున్న ఆస్పత్రులను సీజ్ చేయాలి

రికార్డులు మెయింటెన్ చేయని ఆయుష్ హాస్పిటల్ ను సీజ్ చేయాలి

లోకల్ బాడీ కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో ను కోరిన

బోడ రమేష్ నాయక్

ఎల్ హెచ్ పి ఎస్ జిల్లా అధ్యక్షుడు మహబూబాబాద్



**మహబుబాబాద్ తెలంగాణ సేన ఫిబ్రవరి :** జిల్లా కలెక్టర్ కార్యాలయంలో లోకల్ బాడీ కలెక్టర్ లెనిన్ గారిని,కలిసి,మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఆరోగ్యశాఖ నియమా నిబంధనలు పాటించని ప్రైవేట్ ఆస్పత్రుల పై చర్యలు తీసుకోవాలని వినతి పత్రం అందించిన తర్వాత ఎల్ హెచ్ పి ఎస్ జిల్లా అధ్యక్షుడు బోడ రమేష్ నాయక్ మాట్లాడుతూ మహబూబాబాద్ అతిపెద్ద గిరిజన జిల్లా ఈ గిరిజన జిల్లాలో ఉన్నటువంటి గిరిజన ప్రజల యొక్క అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకొని ఆరోగ్యశాఖ నియమ నిబంధనలు పాటించకుండా టెస్టుల పేరుతో, సర్జరీల పేరుతో లక్షల రూపాయలలో అధిక డబ్బుల వసూళ్లకు,పాల్పడుతున్నారుఅయినా కూడా ప్రజలు జీవితం పై ఆశ తోటి తమకున్న ఆస్తులను అమ్ముకుని ఆసుపత్రి యాజమాన్యం వారు అడిగినంత డబ్బులు చెల్లిస్తున్నారు. అయినా కూడా వాటికి సంబంధించిన రికార్డులను మెయింటైన్ చేయడం లేదు. ప్రైవేట్ ఆస్పత్రులలో ధరల పట్టికలు ఉండవు, సరియైన మిషనరీలు ఉండవు, సరియైన మౌలిక సదుపాయాలు ఉండవు, పార్కింగ్ ఉండదు. అనుభవం లేని వారితో ల్యాబ్ లను నడిపిస్తున్నారు. అర్హత లేని వారితోటి మెడికల్ షాపులను నిర్వహిస్తున్నారు. ఇటు వంటి ఎన్నో సమస్యలు ఉన్నా కూడా స్థానికంగా జిల్లా కేంద్రంలో ఉండే జిల్లా ఆరోగ్య శాఖ జిల్లా అధికారి ఏమాత్రం పట్టించుకోవడం లేదు. జిల్లా కేంద్రంలోని ఆయుష్ ఆసుపత్రి (బంధం చెరువు) లో ఆస్పత్రి ఏర్పాటు చేసినప్పటినుండి ఇప్పటివరకు రికార్డులను మెయింటెన్ చేయడం లేదు. సీఎం రిలీఫ్ ఫండ్ కోసం అప్లై చేసుకుంటే ఇప్పటివరకు ఆ హాస్పిటల్ నుండి అప్రూవల్ చేయడం లేదు. అమాయక గిరిజనులను గత ఆరు నెలల నుండి ఆసుపత్రి చుట్టూ తిప్పించుకుని ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఈ కారణంగా సంబంధిత వారికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు ఆలస్యం అవుతుంది. ఇటువంటి ఆస్పత్రులపై పర్యవేక్షణ చేసి ఆరోగ్యశాఖ నియమా నిబంధనలు పాటించని ప్రైవేట్ హాస్పిటల్స్ లపై చర్యలు తీసుకుని రికార్డులు మెయింటైన్ చేయను ఆయుష్ హాస్పిటల్ ను సీజ్ చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తేజావత్ వాసు నాయక్, సురేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# విప్లవోద్యమ విజయానికి విద్యార్థి ఉద్యమం అవసరం




**హైదరాబాద్, తెలంగాణ సేన న్యూస్ :** బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పూర్వ విప్లవ విద్యార్థులు 50 ఏళ్ల విప్లవ విద్యార్థి ఉద్యమ ప్రస్థానం పై ఫిబ్రవరి రెండు రోజుల సదస్సును నిర్వహించారు. మొదటి రోజు ముఖ్యఅతిథిగా ప్రొఫెసర్ జగన్మోహన్ సింగ్ పాల్గొని ప్రసంగించారు. ఇప్పుడు ఈ దేశంలోని బి జె పి పాలనలో ప్రజలకు మేలు జరగదు. దోపిడీ హింస దౌర్జన్యాలు పెరుగుతున్నాయి. ఇవి పోవాలంటే సమాజంలో విప్లవం రావాల్సిన అవసరం ఉందన్నారు. ఇవన్నీ దూరం కావాలంటే ఐక్య ఉద్యమాలు అవసరం అని,1920లో దేశంలో ఎటువంటి ఆర్థిక సంక్షోభం ఉండేదో ఇప్పుడు కూడా అదే పరిస్థితి నెలకొంది. నాడు భగత్ సింగ్ విప్లవోద్యమాలను నిర్మించి దేశ స్వాతంత్ర్యం కోసం ప్రజలను సన్నద్ధం చేశారు. అలాగే రాడికల్ స్టూడెంట్స్ కూడా ఉద్యమాలు నిర్మించి ప్రజలను జాగృతం చేశారు. స్వతంత్ర ఉద్యమ కాలంలో పోరాడి సాధించుకున్న హక్కులను కూడా నేటి పాలకులు హరిస్తున్నారు. ప్రజల మౌలిక హక్కులను కూడా కాలరాస్తున్నారు. బ్రిటిష్ పాలకులను ఎదిరించడానికి భారతదేశంలో గదర్ పార్టీ పుడితే నేటి సమాజాన్ని మార్పు కోసం రాడికల్ విద్యార్థులు పోరాడారని జగ్మోహన్ సింగ్ అన్నారు.ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ పాలకులు ఇప్పుడు నేరుగానే ప్రజలపై యుద్ధం చేస్తున్నారని అంటున్నారని చెప్పారు. ప్రస్తుత సంక్షోభ కాలంలో మనుషులు మిగలడమే ఒక సవాలుగా మారిందని అన్నారు. ఈ పరిస్థితుల్లో 70, 80ల కాలం నాటి విద్యార్థి పోరాటాలు సమాజానికి మార్గదర్శకం కావాలని అన్నారు.విద్యార్థులందరికీ చైతన్య దీపికగా ఉన్నటువంటి వరవరరావు ఈరోజు జైలు నిర్బంధంలోఉన్నారని, ఆర్ ఎస్ యు ప్రారంభంలో ఒకరైన శివారెడ్డి అన్నారు. భారత విప్లవోద్యమంలో వస్తున్న నేపథ్యంలో తెలంగాణలో నిర్మించిన పోరాటమే విప్లవానికి బాటగా నిలుస్తుంది అన్నారు. విప్లవోద్యమ విజయానికి విప్లవ విద్యార్థి ఉద్యమం అవసరమన్నారు. దానికోసమే రాడికల్ విద్యార్థి సంఘం ఏర్పడిందన్నారు.ప్రపంచీకరణ తర్వాత జాతీయ రాజ్యాలు నశించిపోయాయని డాక్టర్ గోపీనాథ్ అన్నారు. ప్రస్తుత ప్రభుత్వాలన్నీ ప్రపంచ కాబూలీవాలాలనీ వ్యాఖ్యానించారు. 780ల కాలంలో విద్యార్థులు ఉద్యమాల్లోకి వచ్చేవాళ్ళు నేడు ఆ పరిస్థితి లేదు అన్నారు. హాస్యం ఒకటే అయినప్పుడు పార్టీలన్నీ ఏకం కావాలని అన్నారు. సమాజ మార్పు కోసం కోరే వాళ్లంతా ఏకతాటి పైకి రావాలని అన్నారు. 70 ఏళ్ల కాలంలో విశ్వవిద్యాలయాలన్నీ విప్లవ కేంద్రాలుగా ఉన్నాయని ఒకప్పటి పిడిఎస్ యు నాయకుడు ప్రదీప్ అన్నారు. ఇప్పుడు విద్యార్థులు ఎలాంటి కార్యక్రమాలు చేయడం లేదు. అన్ని విలువలపై ముప్పేట దాడి జరుగుతున్న సందర్భంలో అందరూ ఐక్యంగా ఉద్యమాలు నిర్మించి ఫాసిజాన్ని ఓడించాలన్నారు.70, 80 కాలం నాటి విద్యార్థి పోరాటాలను స్ఫూర్తిగా తీసుకొని ఈరోజు వాటిని ముందుకు తీసుకుపోవాలని సూరపనేని జనార్ధన్ సోదరులు మోహన్ రావు అన్నారు.ఆర్ఎస్ యు విద్యార్థులు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పడానికే నేను మార్క్సిజం చదువుకున్నానని ప్రొఫెసర్ కాత్యాయని విద్మహే అన్నారు. 80వ దశకంలో తరగతి గదిలో విద్యార్థులకు ప్రొఫెసర్లకు మధ్య చర్చ జరిగేదని ఇప్పుడు అలాంటి వాతావరణం లేదని అన్నారు. నాటి విద్యార్థులు విలువలతో కూడిన సమాజాన్ని నిర్మించేందుకు నిరంతరం కృషి చేసేవారు అన్నారు. నేడు ఆ పరిస్థితి ఎక్కడ కనిపించడం లేదన్నారు. విలువలు మృగ్యమైన ప్రస్తుత సమాజంలో మానవీయ విలువలను నిలబెట్టడమే ఎలా అనేది మన ముందున్న ప్రశ్న అని అన్నారు.

# పరిహారం పెరుగుతుంది.. మీకు న్యాయం జరుగుతుంది

పార్టీకన్నా, పదవికన్నా మీకు న్యాయం చేయడమే నాకు ముఖ్యం

పరిహారం పెంచకుంటే సొంత పార్టీతోనే కొట్లాడుతా

మీకు అన్యాయం జరిగితే మీతోపాటు ధర్నా చేస్తా

ఉదండాపూర్ గ్రామస్తులకు అనిరుధ్ రెడ్డి హామీ

ఉదండాపూర్ లో జరిగేది సర్వే కాదు రీసర్వే అని స్పష్టీకరణ



**జడ్చర్ల, తెలంగాణ సేన ఫిబ్రవరి :** 'నాకు పార్టీ కన్నా, నా ఎమ్మెల్యే పదవి కన్నా మీకు న్యాయం చేయడమే ముఖ్యం.. మీకు న్యాయం జరగకపోతే మీతో పాటుగా నేను కూడా ధర్నాలో కూర్చుంటానని' జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి ఉదండాపూర్ ముంపు బాధిత రైతులకు స్పష్టం చేసారు. ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కింద ఇచ్చే మొత్తాలను ఖచ్చితంగా పెంచేలా చూస్తానని, అవార్డు పాసైన ఆరు నెలల లోపుగా నిర్వాసితులందరికీ పరిహారం మొత్తాలు అందేలా చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.ఉదండాపూర్ ముంపు గ్రామస్తులతో గురువారం సమావేశమైన అనిరుధ్ రెడ్డి నిర్వాసితులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. తాను ఎమ్మెల్యేగా నెగ్గిన తర్వాత తొలిసారిగా అసెంబ్లీలో ఉదండాపూర్ గురించే మాట్లాడానని, ఎన్నికలకు ముందు కూడా ఉదండాపూర్ సమస్యలపై పాదయాత్ర చేసానని అనిరుధ్ రెడ్డి గ్రామస్తులకు గుర్తు చేసారు. ముంపు బాధితులకు ఇచ్చే పరిహారం మొత్తాన్ని పెంచాలని గ్రామస్తులు ఎవరూ అడగకున్నా వారి పరిస్థితి గురించి తెలిసి తానే పరిహారాన్ని రూ.25 లక్షలకు పెంచాలని కోరానని చెప్పారు. అలాగే కుటుంబాలకు పరిమారం ఇవ్వడంలో సింగిల్ ఫ్యామిలీ, జాయింట్ ఫ్యామిలీ అని వేరు చేసి పరిహారాన్ని తక్కువగా ఇవ్వటాన్ని కూడా తాను ప్రశ్నించానన్నారు. ఈ విషయంలో తాను కేవలం నోటి మాటలు మాట్లాడటం లేదని, జిల్లా కలెక్టర్ తో సహా అధికారులందరికీ లిఖితపూర్వకంగా ఫిర్యాదులు చేసానని చెప్పారు. తాను అధికారులకు రాసిన లేఖలను ఈ సందర్భంగా ఉదండాపూర్ గ్రామస్తులకు చూపించారు. ఉదండాపూర్ లో ఇదివరకే సర్వే జరిగిందని, ఇప్పుడు జరగబోయేది రీ సర్వే అని, ఇది మూడు రోజుల్లో పూర్తవుతుందని తెలిపారు. సర్వేకు, రీసర్వే కు తేడా గుర్తించాలన్నారు. ఉదండాపూర్ గ్రామస్తులు అడిగిన కారణంగానే ఈ రీసర్వే జరుగుతోందన్నారు. ఇది వరకు జరిగిన సర్వేలో అన్యాయం జరిగిందని ఎవరు భావిస్తారో వారి ఇళ్లను మళ్లీ కొలుస్తారని, మిగిలిన వాటి జోలికి వెళ్లడం ఉండదని అనిరుధ్ రెడ్డి చెప్పారు. ఒకసారి కొలిచిన చోట మరోసారి కొలిస్తే తప్పేమిటని ప్రశ్నించారు. తాండాలలో సర్వే పూర్తయి వారికి అవార్డు కూడా పాసైయిందని, అందుకే వారికి సంబంధించిన పరిహారం మొత్తాలు వారి ఖాతాల్లోకి వచ్చాయని ఉదండాపూర్ లో కూడా రీసర్వే పూర్తయి, అవార్డు పాసైతే ఆరు నెలల్లోపు అందరికీ పరిహారం మొత్తాలు వారి ఖాతాల్లోకి వచ్చేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఉదండాపూర్ రిజర్వాయర్ పనులను నాలుగేళ్లపాటు ఆపేస్తామంటే తానే ఆ పనులను పూర్తి చేయాలని కోరానని తెలిపారు. ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్మాణ పనులు కొనసాగుతాయని స్పష్టం చేసిన ఎమ్మెల్యే, రిజర్వాయర్ నిర్మాణం పూర్తయితే గ్రామాన్ని ఇళ్లను తరలించకుండా నీళ్లు వదులుతారా? అని గ్రామస్తులను ప్రశ్నించారు. 'మీకు మంచి చేస్తేనే కదా నాకు కూడా మంచి జరుగుతుందని' పేర్కొన్నారు. గ్రామస్తులకు ఇచ్చే పరిహారం మొత్తాన్ని ఖచ్చితంగా పెంచేలా చూస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా పాలమూరు జిల్లాకు చెందిన వారు కావడంతో ఆయన కూడా దీనికి అనుకూలంగానే ఉన్నారని అనిరుధ్ అభిప్రాయపడ్డారు. అయితే పరిహారాలు పెంచే వ్యవహారం ప్రస్తుతం ప్రభుత్వ పరిశీలనలో ఉందని, ఈ విషయంగా నిర్ణయం తీసుకోవడంలో ఏమాత్రం పొరపాట్లు జరిగినా న్యాయ వివాదాలు తలెత్తే అవకాశం ఉండటంతో అన్ని విషయాలను అధికారులు నిశితంగా పరిశీలిస్తున్నారన్నారు. తాము అడిగిన ప్రకారంగా పరిహారం మొత్తాలను పెంచి ఇవ్వడానికి అదనంగా రూ.170 కోట్లు అవసరమౌతాయని అంచనా వేసారని తెలిపారు. ప్రాజెక్టు పనులను చేసే ఇన్ఫ్రా కంపెనీలకు నష్టం వస్తుందంటే వారి అంచనాలను పెంచుతున్నప్పుడు, రైతులకు నష్టం జరుగుతుందంటే పరిహారాన్ని మాత్రం ఎందుకు పెంచరని పేర్కొన్నారు. తాను ఎప్పుడూ ఉదండాపూర్ గ్రామస్తుల పక్షాన్నే ఉంటానని పునరుద్ఘాటించారు. పరిహారం ఖచ్చితంగా పెరుగుతుందన్నారు. ఈ విషయంలో ఉదండాపూర్ గ్రామస్తులకు అన్యాయం జరిగితే వారితో పాటుగా తాను కూడా ధర్నాలో కూర్చుంటానని హామీ ఇచ్చారు. పరిహారం పెంపు విషయంలో తేడా వస్తే సొంత పార్టీతోనైనా కొట్లాడుతానని, తనకు పార్టీ కంటే, తన ఎమ్మెల్యే పదవి కంటే కూడా ఉదండాపూర్ గ్రామస్తులకు న్యాయం జరగడమే ముఖ్యమని స్పష్టీకరించారు.

# అధికారం ఉన్నప్పుడు కవితకు దురాజ్పల్లి గుర్తు రాలేదా

రేఖా బోయలపల్లి , కాంగ్రెస్ రాష్ట్ర నాయకురాలు

**ఉమ్మడి నల్గొండ జిల్లా తెలంగాణ సేన ప్రతినిధి :** నాడు బిఆర్ ఎస్ అధికారంలో ఉన్నప్పుడు అంతకుముందు ఏ నాడు దురాజ్పల్లి లింగమంతుల స్వామిని కవిత దర్శించుకున్నదని లేదని, బోనం పెట్టింది లేదని రాష్ట్ర కాంగ్రెస్ నాయకురాలు రేఖ బోయినపల్లి గురువారం తెలిపారు.ఈ సందర్భంగా రేఖ మాట్లాడుతూ రాజకీయం చేయడం కోసమే కవిత వచ్చి బోనం పెట్టిందన్నారు.గతంలో బిఆర్ ఎస్ అధికారంలో ఉన్నప్పుడు మహిళల్ని, ప్రజల్ని ,రైతుల్ని పట్టించుకుని కవిత ఇప్పుడు చిలక పలుకులు పలుకుతుందన్నారు.ప్రజా ప్రభుత్వం వచ్చాక మహిళల కోసం రైతుల కోసం ఎన్నో కార్యక్రమాలు చేపట్టిందన్నారు.ప్రజా ప్రభుత్వం వచ్చాక మహిళలకి ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తూ 500 రూపాయలకే సిలిండర్ ఇస్తూ మహిళలను కోటీశ్వరులు చేయాలని దృఢ సంకల్పంతో మొదటి దశలో 1000 మెగావాట్ల సోలార్ ప్లాంట్లు ఏర్పాట్లు చేశారన్నారు.ఆడబిడ్డల భద్రత కోసం టి- సేఫ్ యాప్ తయారు చేశారని గుర్తు చేశారు.మహిళా సంఘాల ద్వారా మహిళల కోసం మొదటి దశలో 150 ఎలక్ట్రికల్ బస్సులు కొనుగోలు చేశారన్నారు.మహిళా సంఘాల బలోపేతానికి ఇందిరా మహిళా శక్తి ద్వారా సంచార చేపల విక్రయాల కేంద్రాలను ఏర్పాటు చేశారు.రైతుల కోసం ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేసి ఎకరాకి 12,000 రైతు భరోసా ఇచ్చి సన్నాలకి క్వింటాలు 5 రూపాయలు బోనస్ ఇచ్చి భూమిలేని పేద రైతులకు రైతు ఆత్మీయ భరోసా కింద సంవత్సరానికి 12 వేల రూపాయలు ప్రజా ప్రభుత్వం ఇస్తుంది. కనీవిని ఎరగని రీతిలో 66.70 లక్షల ఎకరాల్లో వరి సాగు చేసి దేశంలోనే ప్రథమ స్థానంలో తెలంగాణ నిలిచిందన్నారు.కృష్ణా జలాల్లో 811 టిఎంసిలకి 299 టీఎంసీలకు సంతకం పెట్టింది కేసీఆర్ కాదా అని ప్రశ్నించారు.



## కీసరగుట్ట పై భక్తులకు తగిన ఏర్పాట్లు చేయాలని

ఆర్డీవోకు వినతి



**సనత్ నగర్, తెలంగాణ సేన న్యూస్, ఫిబ్రవరి 20 :** తమిళ సంఘం నాయకుడు, సికింద్రాబాద్ బోయిగూడా లోని ఐడిహెచ్ కాలనీ అధ్యక్షుడు శ్రీ అంగముత్తు శ్రీనివాస్ గురువారం మేడ్చల్ జిల్లా కీసర డివిజన్ గౌరవనీయులైన ఆర్డిఓ శ్రీ కే వెంకట ఉపేందర్ రెడ్డి ని కలిసి కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ ఇచ్చిన లేఖను అందజేయడం జరిగింది.రాబోయే మహాశివరాత్రి పర్వదినమున సికింద్రాబాద్లోని బోయిగూడ, అమ్ముగూడ, యాప్రాల్, బొల్లారం, సిక్ విలేజ్, బోయిన్ పల్లి తదితర ప్రాంతాల్లో స్థిరపడిన తమిళు లు పెద్ద ఎత్తున జాతరకు హాజరవుతారని ఆయన అన్నారు. వారి కోసం కీసరగుట్టలోని శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయం వద్ద ఏర్పాట్లు చేయాలని, తాగునీరు విద్యుత్ లైట్లు, టాయిలెట్లు, పారిశుద్ధ్యం ఇలాంటివి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే శ్రీ గణేష్ కోరారు. గత 150 ఏళ్లుగా సికింద్రాబాద్ లో నివసిస్తున్న తమిళ కుటుంబాలన్నీ ప్రతి సంవత్సరం మహాశివరాత్రి జాతర సందర్భంగా వారం రోజులపాటు కీసరగుట్టపై ఉంటారని, జాతరలో ఆనందంగా పాల్గొంటారని అంగముత్తు శ్రీనివాస్ తెలిపారు.

## రామకోటి రామరాజుకు ఘన సన్మానం

రామకోటి సేవలు అభినందనీయం - వంగపల్లి అంజయ్య స్వామి



**తెలంగాణ సేన ఫిబ్రవరి :** రామకోటి రామరాజు సేవలు అభినందనీయం అని వంగపల్లి అంజయ్య స్వామి అన్నారు. గురువారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ లో యాదాద్రి భువనగిరి జిల్లా కాచారం రేణుక ఎల్లమ్మ దేవాలయం వ్యవస్థాపక అధ్యక్షుడు వంగపల్లి అంజయ్య స్వామి ఆధ్వర్యంలో రామకోటి రామరాజు ఘన సన్మానం చేశారు. అనంతరం వంగపల్లి అంజయ్య స్వామి మాట్లాడుతూ యాదాద్రి భువనగిరి జిల్లా కాచారంలో శ్రీ రేణుకా ఎల్లమ్మ దేవాలయం వార్షికోత్సవ వేడుకలు ఆదివారం అనగా 23-02-2025 రోజున నిర్వహించే వార్షికోత్సవ వేడుకలకు రావాల్సిందిగా రామకోటి రామరాజుకు ఆహ్వాన పత్రిక అందజేయడం జరిగిందన్నారు. అనంతరం రామకోటి రామరాజు మాట్లాడుతూ వంగపల్లి అంజయ్య స్వామి ప్రజలను భక్తి మార్గం వైపు పయనించే విధంగా కృషి చేస్తూ ప్రతి మంగళవారం రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించడం అభిందనేయం అని ప్రతి ఒక్కరూ దైవభక్తి కలిగి ఉండాలని అన్నారు.

## ఆర్యవైశ్యులకు బిజెపిలోనే సముచితస్థానం బుద్ధ మహేందర్ గుప్తా



**తెలంగాణ సేన ఫిబ్రవరి :** ఢిల్లీ రాష్ట్రానికి నూతన ముఖ్యమంత్రిగా ఆర్యవైశ్య మహిళ రేఖా గుప్తా బాధ్యతలు చేపట్టడం అభినందనీయమని బిజెపి సీనియర్ నాయకుడు బుద్ధ మహేందర్ గుప్త అన్నారు, గురువారం సిద్దిపేట జిల్లా జగదేవ పూర్ మండల కేంద్రంలో బిజెపి సీనియర్ నాయకులు బుద్ధ మహేందర్ గుప్త మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీలోనే అందరికి న్యాయం జరుగుతుందని, భారత ప్రధాని మోడీ నాయకత్వంలో భారతదేశం శరవేగంగా అభివృద్ధి చెందుతుందని, ఆర్యవైశ్యులకు బిజెపిలో మంచి గుర్తింపు ఉంటుందని, కష్టపడ్డ కార్యకర్తలకు బిజెపి పార్టీలోనే గుర్తింపు ఉంటుందని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి పార్టీ జయకేతనం ఎగురవేస్తుందని, బి ఆర్ ఎస్, పార్టీ , కాంగ్రెస్ పార్టీ మాటలకే పరిమితమయ్యాయని, ప్రజా సంక్షేమ పాలన బిజెపికే సాధ్యమని, ప్రజలు బిజెపి వైపు ఉన్నారని అన్నారు. తెలంగాణలో రాబోయే కాలంలో బిజెపి అధికారం చేపట్టడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

## విద్యార్థులకు ఫుడ్ పాయిజన్... ఆగ్రహం ఎమ్మెల్యే

**మహబూబ్నగర్ తెలంగాణ సేన న్యూస్ :** మహబూబ్నగర్ జిల్లా జడ్చర్ల మండలం పోలేపల్లి సేజ్ లోలోని యూనివర్సిటీలో విద్యార్థులకు గురువారం ఫుడ్ పాయిజన్ అయినది. విషయం తెలుసుకున్న జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి హుటా హుటిన యూనివర్సిటీని సందర్శించారు. ఈ సందర్భంగా ఫుడ్ పాయిజన్ అయినా సంబంధించిన వివరాలు గురించి ఆరా తీశారు. యూనివర్సిటీ పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫుడ్ పాయిజన్ అయిన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని యూనివర్సిటీ యాజమాన్యానికి సూచించారు.

## ఎస్సీ బాలుర గురుకుల పాఠశాలలు తరలి పోతున్నా పట్టించు కొని ప్రభుత్వం

ఏటూరు నాగారం రెవిన్యూ డివిజన్ ఉసే లేదు, బస్ డిపో మాటే మరిచారు

నేతకాని ప్రజా జేఏసీ నాయకులు జాడి ఈశ్వర్ నేతకాని



**ములుగు జిల్లా ప్రతినిధి, తెలంగాణ సేన న్యూస్ :** వెంకటాపురం ఫిబ్రవరి 20 గురువారం: ఏజెన్సీ ప్రాంతమైన ఏటూరు నాగారం అభివృద్ధిని కాకుండా చేయడం లో బాగామే ఇక్కడ ఉన్న ఎస్సీ బాలుర గురుకుల పాఠశాలను మల్లంపల్లి ములుగు కు తరలించారని, వెంటనే ఆ ఎస్సీ బాలుర గురుకుల పాఠశాల ను ఏటూరు నాగారం కు మార్చాలని నేతకాని ప్రజా జేఏసీ నాయకులు, తెలంగాణ నేతకాని సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు జాడి ఈశ్వర్ నేతకాని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఏజెన్సీ లో మారు మూల ప్రాంతాలలో ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ హాస్టల్ లాంటివి, ఇంకా మొదలగు పరిశ్రమలను ఏర్పాటు చేస్తే అభివృద్ధి అవుతుందని, వాటి చుట్టూ చిన్న చితక వ్యాపారాలు నడుస్తుంటాయి తద్వారా ఇక్కడ ఉన్న గిరిజన, దళిత బిడ్డలకు ఉపాధి దొరుకుందని తెలిపారు. . ఏటూరునాగారం రెవిన్యూ డివిజన్ ప్రకటనలకే పరిమితం అవుతుంది, కానీ ముందుకు సాగడం లేదని, బస్ డిపో మాట ను మరిచిపోయారని, ఇలా ఐతే ఏజెన్సీ ప్రాంతాన్ని ఎప్పుడు అభివృద్ధి చేస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక గురుకులం పాతశాలలు పట్టించుకోకుండా ఉన్నారంటే ఇది ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం అని తెలిపారు. ప్రభుత్వ అధికారులు ఇక నైనా మొద్దు నిద్ర విడనాడాలని ఎస్సీ బాలుర గురుకులంను వెంటనే ఏటూరునాగరం కు మార్చాలని తెలిపారు.

## ఆదర్శ విద్యామందిర్ పాఠశాలలో మెరిసిన అణిముత్యం

అభినందించిన ఎమ్మెల్యే వేముల



**నకిరేకల్ ,తెలంగాణ సేన :** జాతీయస్థాయిలో జరిగే హ్యాండ్ బాల్ పోటీలకు జటావత్ కృష్ణుడు ఎంపికయ్యాడు స్థానిక ఏవీ ఎం పాఠశాలలో 9వ, తరగతి చదువు తున్న కృష్ణుడిని గురువారం స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రత్యేకంగా అభినందించారు.ఇంకా జీవితంలో ఎన్నో పతకాలు తేవాలని ప్రోత్సహించారు.ఈ కార్యక్రమంలో ఎంఈఓ నాగయ్య పాల్గొని విద్యార్థిని అభినందించి విద్యతో పాటు విద్యార్థులను తీర్చిదిద్దుతున్న ఫిజకల్ డైరెక్టర్ నిమ్మశంకర్ గౌడ్ కు ఈ సందర్భంగా నకిరేకల్ ఎంఈఓ నాగయ్య అభినందలు తెలిపారు. పాఠశాల ప్రిన్సిపాల్ స్వప్న శ్రీకాంత రెడ్డి, జితేందర్ రెడ్డి, ఉపేందర్, ఎం ఆర్ సి సిబ్బంది. శ్యామ్ సురేష్ రవి పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ యాదవరెడ్డి కి ఆహ్వాన పత్రిక అందజేత



**తెలంగాణ సేన ఫిబ్రవరి :** సిద్దిపేట జిల్లా గజ్వేల్ లో గురువారం ఎమ్మెల్సీ యాదవరెడ్డి కి యాదాద్రి భువనగిరి జిల్లా కాచారం రేణుక ఎల్లమ్మ దేవాలయం వ్యవస్థాపక అధ్యక్షుడు వంగపల్లి అంజయ్య స్వామి ఆహ్వాన పత్రిక అందజేశారు ఈ సందర్భంగా అంజయ్యస్వామి మాట్లాడుతూ యాదాద్రి భువనగిరి జిల్లా కాచారంలో శ్రీ రేణుకా ఎల్లమ్మ దేవాలయం వార్షికోత్సవ వేడుకలు ఆదివారం అనగా 23 - 02 - 2025 రోజున నిర్వహించే వార్షికోత్సవ వేడుకలకు రావాల్సిందిగా ఎమ్మెల్సీ యాదవరెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేయడం జరిగింది అని అన్నారు అనంతరం ఎమ్మెల్సీ యాదవరెడ్డి మాట్లాడుతూ వంగపల్లి అంజయ్య స్వామి సేవలు అభినందనీయం అని, ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ, ప్రతి మంగళవారం రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం అభిందనీయం అని, అన్నారు.

## శ్రీ శ్రీ శ్రీ శివాంజనేయ స్వామి జాతర గోడపత్రిక విడుదల




**మహబూబ్ నగర్, తెలంగాణ సేన న్యూస్ :** మహబూబ్నగర్ జిల్లా మిడ్జిల్ వేముల గ్రామంలో ఈనెల 26 తేదీన మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా ప్రతి యేట అంగరంగ ఎంతో వైభవంగా నిర్వహిస్తున్న శ్రీ శ్రీ శ్రీ శివాంజనేయం స్వామి 29వ వార్షికోత్సవ గోడపత్రిక గౌరవ శ్రీ మాజీ మంత్రివర్యులు. బిఆర్ఎస్ పార్టీ మహబూబ్నగర్ జిల్లా అధ్యక్షులు డా. లక్ష్మారెడ్డి గారి చె విడుదల చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా మరియు మండల గ్రామ ముఖ్య నాయకులు జిల్లా మాజీ పరిషత్ వైస్ ప్రెసిడెంట్ కోడుగల్ యాదయ్య. సర్పంచులసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రణిల్ చందర్. మాజీ ముండా డైరెక్టర్ శ్రీకాంత్ ఇంతియాజ్. మాజీ ఎంపీపీ బరిగెల సుదర్శన్. మాజీ జెడ్ టి సి శశిరేఖబాలు. జగన్ గౌడ్ శ్రీనివాస్ గౌడ్ నారాయణరెడ్డి వీరారెడ్డి పట్నం బంగారు భీమరాజ్ నవీన్ నవీన్ చారి వరుణ్ రాజు ఆంజనేయులు రామిరెడ్డి శ్రీనివాస్ గౌడ్ లింగం గౌడ్ ఆంజనేయులు దేవి రెడ్డి రాంరెడ్డి మాలే శ్రీనివాస్ గౌడ్ నరసింహ భాస్కర్ చారి అయ్యప్ప రెడ్డి శేఖర్ గౌడ్ నరేష్ కే శీను సురేష్ కుమార్ డి శేఖర్ నాని తదితరులు పాల్గొన్నారు.

## డిల్లి ముఖ్యమంత్రి రేఖా గుప్తకు అభినందనలు తెలిపిన నరేష్ గుప్త




**తెలంగాణ సేన ఫిబ్రవరి :** ఢిల్లీ ముఖ్యమంత్రిగా ఆర్యవైశ్య మహిళ రేఖా గుప్తా బాధ్యతలు చేపట్టడం అభినందనీయమని గజ్వేల్ పట్టణ బిజెపి పార్టీ ఉపాధ్యక్షుడు నరేష్ గుప్తా అన్నారు గురువారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ లో ఆర్యవైశ్య నాయకుడు బిజెపి పట్టణ ఉపాధ్యక్షుడు నరేష్ గుప్తా మాట్లాడుతూ బిజెపి పార్టీలోనే అందరికి న్యాయం జరుగుతుందని, భారత ప్రధాని మోడీ నాయకత్వంలో భారతదేశం శరవేగంగా అభివృద్ధి చెందుతుందని, ఆర్యవైశ్యులకు బిజెపిలో మంచి గుర్తింపు ఉంటుందని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి పార్టీ జయకేతనం ఎగురవేస్తుందని ప్రజలు బిజెపి వైపు ఉన్నారని అన్నారు.

## పిడిచేడ్ లో ఘనంగా చత్రపతి శివాజీ విగ్రహం ఆవిష్కరణ





**తెలంగాణ సేన ఫిబ్రవరి :** సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం పిడిచెడ్ గ్రామంలో నూతనగా ఏర్పాటు చేసిన శివాజీ విగ్రహాన్ని శివాజీ జయంతి సందర్భంగా శివాజీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చత్రపతి శివాజీ విగ్రహం ఘనంగా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ పంగ మల్లేశం,గ్రామ మాజీ సర్పంచ్ నాగిరెడ్డి, మాట్లాడుతూ పిడిచెడ్ లో శివాజీ విగ్రహం ఏర్పాటు చేయడం అభినందనీయం అని యువతకు స్ఫూర్తి శివాజీ మహారాజ్ అని అన్నారు,అనంతరం విగ్రహ ఏర్పాటుకు సహకరించిన వారికి యూత్ సభ్యుల ఆధ్వర్యంలో చిరు సన్మానం చేశారు, ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ శిల్ప అశోక్, పిట్ల రాములు, అనంతరావుపల్లి మాజీ సర్పంచ్ కొమురయ్య, రాగట్లపల్లె పాండు, హనుమంత్ రెడ్డి , అంజయ్య శర్మ పంతులు, హైందవ సోదరులు, భజరంగ్ దళ్ సభ్యులు, విశ్వ హిందు పరిషత్ సభ్యులు,అన్ని పార్టీల నాయకులు కార్యకర్తలు,శివాజీ అభిమానులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## జువాలజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా లైఫ్ మెంబర్‌గా డాక్టర్ మోదాల మల్లేష్

**నకిరేకల్ తెలంగాణ సేన :** నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలం పాలెం గ్రామానికి చెందిన ప్రముఖ విద్యావేత్త, పరిశోధకుడు డాక్టర్ మోదాల మల్లేష్ జువాలజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా లైఫ్ మెంబర్‌గా ఎంపికయ్యారు.జంతుశాస్త్ర పరిశోధనలలో ఆయన చేసిన గణనీయమైన కృషికి గుర్తింపుగా ఈ గౌరవం లభించింది.డా. మల్లేష్ పత్తి పంటలపై కీటకాల వైవిధ్యం పై పరిశోధన చేసినందుకు గాను కాకతీయ విశ్వవిద్యాలయం నుండి పీహెచ్‌డీ పట్టా పొందారు. అంతేకాక, మొక్కజొన్న, మినప పంటలలోని కీటకాలపై కూడా విస్తృతంగా పరిశోధనలు చేశారు. ఆయన పరిశోధన ఫలితాలు అనేక జాతీయ, అంతర్జాతీయ ఖ్యాతి గల జర్నల్‌లలో ప్రచురించబడి, శాస్త్రీయ వర్గాల్లో విశేష గుర్తింపు పొందాయి.పరిశోధనల ద్వారా వ్యవసాయంలో సుస్థిరత, పంటల పరిరక్షణకు దోహదం చేయాలనే లక్ష్యంతో ముందుకుసాగే డా. మల్లేష్ సాధన ఈ గుర్తింపుకు దారితీసింది. ప్రస్తుతం ఆయన ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (ఆటానమస్), నల్లగొండలో జంతుశాస్త్రం అధ్యాపకుడిగా సేవలు అందిస్తున్నారు.డాక్టర్ మల్లేష్‌ను సొసైటీ లైఫ్ మెంబర్‌గా ఎంపిక చేయడం పట్ల విద్యా, పరిశోధనా వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

## నేడే ఇందిరమ్మ ఇళ్ల శంకుస్థాపన పాల్గొన్న సీఎం

**తెలంగాణ సేన న్యూస్ మహబూబ్నగర్ :** సీఎం రేవంత్ రెడ్డి నేడు సొంత జిల్లా మహబూబ్ నగర్ జిల్లాలో ఇందిరమ్మ ఇల్లు శంకుస్థాపనలో చేయనున్నారు నారాయణపేట అక్కపాలెం లో ఈ పథకానికి శ్రీకారం చుట్టున్నారు. కాగా ఈ సర్కార్ పథకానికి తొలి విడతలో రాష్ట్రంలో 72.045 ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసింది. వాటన్నిటికీ నేడు శంకుస్థాపనలు శ్రీకారం చేయనున్నారు. ఇంటి నిర్మాణానికి ఐదు లక్షలు పూర్తి సబ్సిడీలో ప్రభుత్వం ఆర్థిక సాయం చేస్తుంది. బేస్పేట్ కట్టంగనే లక్ష రూపాయలు లబ్ధిదారులు అకౌంట్లో జమ చేయనున్నారు.

# సంక్షేమ హాస్టళ్ల అభివృద్ధి, విద్యార్థులకు మెరుగైన బోధన, వారి ఆరోగ్యంపై సంక్షేమ హాస్టళ్ళ ప్రత్యేక అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి



**మహబూబాబాద్, టౌన్ తెలంగాణ సేన ఫిబ్రవరి.20 :** రాష్ట్రంలోని సంక్షేమ హాస్టళ్ల అభివృద్ధి, విద్యార్థులకు మెరుగైన బోధన, వారి ఆరోగ్యంపై రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని అందుకనుగుణంగా సంక్షేమ హాస్టళ్ళ ప్రత్యేక అధికారులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు.గురువారం జిల్లా కలెక్టరేట్ లోని ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, స్థానిక సంస్థల అధనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో తో కలిసి జిల్లాలోని సంక్షేమ హాస్టళ్ళ ప్రత్యేక అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, తహసిల్దార్ లు, ఎం.పి.డి.ఓ లతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా లోని అన్ని సంక్షేమ వసతి గృహాలను రానున్న మూడు రోజులు హాస్టళ్ళ ప్రత్యేక అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, తహసిల్దార్లు, ఎం.పి.డి.ఓ ల సమన్వయంతో విస్తృతంగా సందర్శించి రోజు వారీ నివేదికలను అందజేయాలి.ఇందులో భాగంగా హాస్టళ్ళలో విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించి వండే భోజనం శుచిగా శుభ్రంగా ఉండే విధంగా ప్రత్యేక అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల మెరుగైన భోధనకు చర్యలు చేపట్టాలని, అదేవిధంగా ఖచ్చితమైన మెనూ పాటించాలని, నిత్యావసరాల సరుకుల యొక్క నాణ్యతలను పరీక్షించాలని అన్నారు పారిశుద్ధ్య సమస్యలు ఏమైనా ఉంటే పరిష్కరించాలని అన్నారు. ట్రైబల్ వెల్ఫేర్ వసతి గృహాల్లో సాంక్షన్ అయి ఉన్న పనులను ఏజెన్సీ వారితో మాట్లాడి పనులు త్వరగా పూర్తయ్యే విధంగా చర్యలు చేపట్టాలని అన్నారు.రానున్న పదవ తరగతి పరీక్షల దృష్ట్యా సంక్షేమ హాస్టల్స్ విద్యార్థులు 100% హాజరు ఉండే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. విద్యార్థులు ఏదైనా సబ్జెక్టులలో వెనుకబడి ఉంటే వారిని గుర్తించి నిపుణులతో ప్రత్యేక శ్రద్ధతో చదువు చెప్పించాలన్నారు.జిల్లాలోని సంక్షేమ హాస్టళ్ళలో చదివే విద్యార్థులందరూ 100% ఉత్తీర్ణత సాధించే విధంగా అధికారులు ప్రత్యేక యాక్షన్ ప్లాన్ రూపొందించుకొని అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టాలన్నారు. ప్రత్యేక అధికారులు రాత్రి వేళల్లో బస చేసి విద్యార్థుల యొక్క సమస్యలను ప్రత్యేకంగా విని, వారితో మాట్లాడి వారి ఆరోగ్యంపై వివరాలను కనుగొని ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కరించాలన్నారు.అదేవిధంగా మాదక ద్రవ్యాల నిర్మూలన కొరకు సంక్షేమ హాస్టల్లో మండల స్థాయి సమావేశాలు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సంక్షేమ హాస్టళ్ళలో విద్యార్థులకు అవగాహన కలిగించేందుకు ఒక ప్రణాళికను సిద్ధం చేయాలని అన్నారు.స్థానిక సంస్థల ఆదరపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో మాట్లాడుతూ.. సంక్షేమ హాస్టల్స్ కు సరఫరా చేసే నిత్యవసర సరుకుల ఏజెన్సీ వారితో మాట్లాడి నాణ్యమైన సరుకులను అందించే విధంగా చర్యలు తీసుకోవాలని, హాస్టల్ వెల్ఫేర్ అధికారులు కచ్చితంగా హాస్టల్లో ఉండి విద్యార్థులను ఉదయం 5 గంటలకు మేల్కొల్పి చదివే విధంగా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.ఈ సమావేశంలో సంక్షేమ హాస్టళ్ళ స్పెషల్ అధికారులు జడ్పీ సీఈవో పురుషోత్తం డిఆర్డిఓ మధుసూదన రాజు, డి.సి.ఓ వెంకటేశ్వర్లు, ఏ డి సర్వే లాండ్స్ అధికారి నరసింహమూర్తి డి హెచ్ ఓ మరియన్న, డీఈవో డాక్టర్ రవీందర్ రెడ్డి, డిడి ట్రైబల్ వెల్ఫేర్ అధికారి దేశిరాం, డిఎస్ఓ ప్రేమ్ కుమార్, గ్రౌండ్ వాటర్ అధికారి సురేష్, బీసీ డెవలప్మెంట్ అధికారి నరసింహస్వామి, డిఎం సివిల్ సప్లై అధికారి కృష్ణవేణి, మండలాల హాస్టళ్ళ స్పెషల్ అధికారులు, తహసిల్దార్లు, ఎంపీడీవో లు తదితరులు పాల్గొన్నారు.

## డిగ్రీ కళాశాలలో సైబర్ క్రైమ్ అవగాహన సదస్సు



**ములుగు జిల్లా ప్రతినిధి, తెలంగాణ సేన న్యూస్ :** ఏటూరునాగారం తెలంగాణ గిరిజన సంక్షేమ డిగ్రీ కళాశాల ఏటూరునాగారం నందు గురువారం రోజున సైబర్ క్రైమ్ అవగాహన సదస్సును ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఏటూరునాగారం ఎస్సై ఎస్ కే. తాజుద్దీన్ విచ్చేసి విద్యార్థులకు నేటి సమాజంలో జరుగుతున్నటువంటి సైబర్ మోసాల గురించి వివరించి విద్యార్థులు ఈ మోసాల పట్ల తగు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఎవరైనా సైబర్ మోసాల వలలో చిక్కుకొని డబ్బులు కోల్పోయినట్టయితే వెంటనే 1 9 3 0 నెంబర్ కి డయల్ చేయాలని సూచించారు. మా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి .శ్రీవాణి గారు మాట్లాడుతూ విద్యార్థులు ఎటువంటి సైబర్ మోసాలకు గురికాకుండా తగు జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. ఆ తర్వాత ఎన్ఎస్ఎస్ పిఓ డాక్టర్ రాధిక. కె మాట్లాడుతూ నిజజీవితంలో తనకు జరిగినటువంటి సైబర్ మోసాలను విద్యార్థులకు తెలియజేస్తూ విద్యార్థులు మోసపోకుండా ఉండాలని చెప్పారు.ఆ తరువాత ఈ సమావేశానికి వచ్చిన ఎస్ఐ గారి కి కృతజ్ఞతలను తెలియజేశారు. ఈ సమావేశంలో కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది విద్యార్థులందరూ పాల్గొన్నారు.

## వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్ల చేయాలి

### జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్




**మహబుబాబాద్ తెలంగాణ సేన :** రానున్న వేసవిలో జిల్లాలో ఎక్కడ కూడా నీటి ఎద్దడి ఏర్పకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అధికారులను ఆదేశించారు.గురువారం జిల్లా కలెక్టరేట్ లోని మినీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో తో కలిసి ఎంపీఓ, ఎం.పి.డి.ఓ లు మిషన్ భగీరథ ఇంట్రా, గ్రిడ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న వేసవిలో నీటి ఎద్దడి నెలకొన్న ప్రాంతాలను గుర్తించి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అందుకుగాను సమస్యాత్మక ప్రాంతాల్లో పైప్ లైన్ల మరమ్మత్తులు చేయించి నీటి ఎద్దడిని నివారించాలన్నారు. వేసవి కాలంలో నీటి సరఫరాలో సమస్యలు ఎక్కడ ఉత్పన్నమవుతాయో గుర్తించి పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. లీకేజీ మరమ్మతులు ఏమైనా ఉంటే వాటిపై దృష్టి పెట్టి ఎక్కడ కూడా త్రాగునీటి సరఫరాలో సమస్యలు రాకుండా చూడాలని అధికారులకు సూచించారు. గ్రామ పంచాయతీ పరిధిలో అధికారులు సమన్వయంతో పనిచేసి రాబోయే వేసవిలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా ప్రణాళిక బద్ధంగా పని చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యంగా నీటి పంపులు, మోటర్లు, వాల్స్ లు పైపులకు సంబంధించి మరమ్మతులు వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎక్కడైతే సమస్యలు ఉన్నాయో ఆయా గ్రామాలను నీటి సరఫరా అధికారులు సందర్శించి అందుకు కావలసిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని తెలిపారు. నీరు వృధా కాకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ సమావేశంలో జెడ్పీ సీ.ఈ.ఓ పురుషోత్తం, డి.పి.ఓ హరిప్రసాద్, మిషన్ భగీరథ ఈ.ఈ కృష్ణారెడ్డి, ఎం.పి.ఓ, ఎం.పి.డి.ఓ లు, వివిధ శాఖల అధికారులు, మండల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణను తీర్చిదిద్దిన మహానేత

తెలంగాణ ఆవిర్భావం, ఆ తర్వాత రాష్ట్రాభివృద్ధిలో కేసీఆర్ పాత్ర చరిత్రాత్మకమైనది. ఉద్యమ నాయకుడిగా తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు జీవం పోసి, రాష్ట్రాభివృద్ధికి అంకితమై ఆయన పనిచేశారు. గమ్యాన్ని ముద్దాడేవరకు విశ్రమించవద్దని ఉద్యమ సమయంలో కేసీఆర్ పదే పదే చెప్పేవారు. అదే పంథాను ఆయన అభివృద్ధిలో చూపించారు. అభివృద్ధికి అడ్డం పడినవారందరితో పోరాడి పదేండ్లలో తెలంగాణను దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దారు. 1969లో తొలి దశ తెలంగాణ ఉద్యమం మొదలైనప్పటికీ అది కాలక్రమేణా కనుమరుగైంది. ఆ తర్వాత తెలంగాణ తన అస్తిత్వాన్ని కోల్పోయింది. చాలామందికి తెలంగాణ ప్రాంతం ఒకప్పుడు ప్రత్యేక రాష్ట్రమనే సంగతి కూడా తెల్వకుండాపోయింది. అలాంటి పరిస్థితుల్లో కేసీఆర్ మళ్లీ పోరుజెండా ఎత్తుకున్నారు. 2001లో టీఆర్ఎస్ పార్టీని స్థాపించి ఉద్యమానికి కొత్త జవసత్వాలు ఇచ్చారు. ఉద్యమాన్ని కేసీఆర్ శాస్త్రీయంగా, రాజ్యాంగబద్ధంగా నడిపారు. ఏం చేస్తే స్వరాష్ట్రం సాధించవచ్చో క్షుణ్ణంగా అధ్యయనం చేసి, తెలంగాణ ఆకాంక్షను జాతీయ స్థాయికి తీసుకెళ్లారు. నిరాహార దీక్షలు, సభలు, ర్యాలీలు, పార్లమెంటు లోపల, వెలుపల నిరంతరంగా పోరాటం చేస్తూ ఉద్యమాన్ని సజీవంగా ఉంచారు. అంతేకాదు, ఢిల్లీ పెద్దలకు ఉద్యమ సెగ తాకేలా చేసేందుకు అనేకసార్లు రాజీనామా చేసి, ప్రజాక్షేత్రంలో తన బలాన్ని నిరూపించుకున్నారు. ఈ క్రమంలో ఒకటి కాదు, రెండు కాదు తెలంగాణ కోసం సామ దాన దండోపాయాలన్నింటినీ వాడారు. 'నో స్టోన్ లెఫ్ట్ అన్ టర్న్' అనే సూక్తి ఇందుకు సరిగ్గా సరిపోతుంది. తెలంగాణ ఏర్పాటుతో ప్రజల ఎదురుచూపులు ఫలించాయి. ఉద్యమ నాయకుడిగా నిరూపించుకున్న కేసీఆర్.. పాలకుడిగానూ నిరూపించుకున్నారు. ఆయన నాయకత్వంలో తెలంగాణ అభివృద్ధిలో దూసుకుపోయింది. అయితే, పసికందు తెలంగాణను తన కాళ్ల మీద తాను నిలబడేలా చేయడమంటే మాటలు కాదు. ఉమ్మడి ఏపీ నుంచి వారసత్వంగా వచ్చిన ఎన్నో కష్టాలు ఒకవైపు వెక్కిరిస్తుండగా.. మరోవైపు తెలంగాణను ఫెయిల్యూర్ రాష్ట్రంగా చేయాలని వ్యతిరేక శక్తులు కుట్రలు మొదలుపెట్టాయి. అందులో మొట్టమొదటిది మనకు రావాల్సిన కరెంటును అడ్డుకోవడం. తెలంగాణను అంధకారంలోకి నెట్టాలని, చీకటి రాష్ట్రంగా చిత్రీకరించాలని వేసిన కుయుక్తులను కేసీఆర్ పటాపంచలు చేశారు. అతితక్కువ కాలంలోనే రాష్ట్రవ్యాప్తంగా 24 గంటల కరెంటు సరఫరా చేశారు. కొత్త ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసి తెలంగాణలో మిగులు కరెంటు ఉండేలా ప్రణాళికలు రచించారు. స్వరాష్ట్రంగా ఏర్పడకముందు తెలంగాణ ఒక కరువు ప్రాంతం. ఎర్రటి నేలలతో నిండిన తెలంగాణను పచ్చగా చేయాలంటే మన నీళ్లు మన బీళ్లకు మళ్లాలి. ఉద్యమ నినాదాన్ని నిజం చేసేందుకు వానలు పడాలని ఒకవైపు యజ్ఞాలు చేస్తూనే.. అంతకంటే వేగంగా ప్రాజెక్టుల నిర్మాణాలను కేసీఆర్ చేపట్టారు. బీఆర్ఎస్ హయాంలో సాగునీటి ప్రాజెక్టుల విప్లవం జరిగింది. ప్రపంచం అబ్బురపడేలా పాతాళంలో ఉన్న గంగను మోసుకొచ్చే కాళేశ్వరం, ఇతర ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. వాటికి అనుబంధంగా నీటిని నిల్వ చేయడానికి రిజర్వాయర్లు నిర్మించారు. తెలంగాణ ఏర్పడకముందు తెలంగాణలో రైతుకు ఎవరూ విలువిచ్చేవారు కాదు.

# ధ్యానం శరణం గచ్ఛామి



రుషులు నిర్దేశించిన మార్గం ధ్యానం. గౌతమ బుద్ధుడు అనుసరించిన పథం ధ్యానం. విశిష్ట జీవనానికి మన పూర్వీకులు ఈ జాతికి అందించిన పరుసవేది ఈ సాధన. మనసును ప్రశాంత స్థితికి తీసుకొచ్చి మన శక్తిని ఉద్దీపనం చేసే అస్త్రమిది. ధ్యానం ప్రధాన లక్ష్యం జీవితం పట్ల అవగాహన పెంచుకోవడమే! మన ఆలోచనలపై అదుపు సాధించడం వల్ల మనసుకు, శరీరానికి ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. శ్వాస మీద ధ్యాస ఒక పద్ధతైతే.. ఆలోచనలను అధిగమించే విధానం మరొకటి. మార్గమేదైనా ధ్యానాన్ని ఆశ్రయిస్తే.. జీవితం ఆరోగ్యంగా సాగిపోవడం ఖాయం. ఆధునిక స్త్రీలు ఇంటి బాధ్యతలతోపాటు ఉద్యోగాలు, వ్యాపారాల్లో రాణిస్తూ కాలంతోపాటే పరుగులు తీస్తున్న వాతావరణం ఇప్పుడు మామూలు విషయమైపోయింది. ఒత్తిళ్లతో కూడిన వాతావరణంలో మహిళలు తమ మానసిక, శారీరక ఆరోగ్యం గురించి శ్రద్ధ చూపించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ నేపథ్యంలో నవతరం నారీమణుల మానసిక ఆరోగ్యం కోసం ధ్యానం ఓ మంచి ఉపకరణంగా నిలుస్తుంది. ధ్యానం చేయడంలో అనుసరించాల్సిన విధానాలు వేర్వేరు రకాలుగా ఉంటాయి.

### శ్వాస మీద ధ్యాస

ముక్కు పుటాల గుండా జరిగే శ్వాసక్రియ (ఉచ్ఛ్వాస, నిశ్వాస) క్రమాన్ని అలా గమనిస్తూ ఉండిపోవాలి. లేదంటే శ్వాసిస్తున్న క్రమాన్ని మనసులో లెక్కిస్తూ ఉండాలి. ఇలా చేస్తే మనసు మీద అదుపు వస్తుంది.

### ఎరుకతో ధ్యానం

దీన్ని మైండ్‌ఫుల్‌నెస్ మెడిటేషన్ అంటారు. ఇందులో గతం, భవిష్యత్తుల గురించిన ఆలోచనలు వదిలిపెట్టి కేవలం వర్తమానంపై దృష్టి సారించాలి. ఆలోచనలు, మానసిక స్పందనలు, పరిసరాల మీద పూర్తి ఎరుకతో ఉండాలి. ఇలా చేయడం జీవితాన్ని యథాతథంగా ఆమోదించి ముందుకు వెళ్లడానికి దోహదపడుతుంది. ఆలోచనలు, భావోద్వేగాల పట్ల ఎరుకతో ఉండటం వల్ల స్త్రీలు తమ గురించి తాము అవగాహన చేసుకుని, జీవితంలో వివిధ సందర్భాల్లో ఎలా స్పందించాలో తెలుసుకోగల్గుతారు.

### మనసు ఖాళీ

మనసులో రోజువారీ జీవితంలో తలెత్తే గందరగోళాన్ని, గజిబిజి ఆలోచనలను ఖాళీ చేసుకోవాలి. మనసును ఆలోచన రహిత స్థితికి తెచ్చుకోవాలి. లేదంటే ఆలోచనలను అలా బయటికి స్వేచ్ఛగా వెళ్లిపోనివ్వాలి.

### వస్తువును చూస్తూ

ఓ చెట్టును కానీ, దీపశిఖను కానీ లేదంటే ఆధ్యాత్మిక ప్రాధాన్యం కలిగిన వస్తువును కానీ అలా చూస్తూ ఉండటం ద్వారా కూడా మనసుపై పట్టు సాధించవచ్చు. అయితే ఇక్కడ మనం చూసే వస్తువు పట్ల ఎరుకతో ఉండాలి. ఆలోచనలను బలవంతంగా తొక్కిపట్టే ప్రయత్నం చేయకూడదు. అలా మనసును స్వేచ్ఛగా వదిలివేయాలి. కాసేపటికి అదే నెమ్మదిస్తుంది.

### సానుభూతిలోజి

మన పట్ల మనం, ఇతరుల పట్ల ప్రేమగా, దయతో మెలగడమూ ధ్యానమే. దీనివల్ల మన మీద మనకే కాకుండా ఎదుటివారి పట్ల సహానుభూతి, సానుభూతి, దయాగుణం అలవడతాయి. ఇది స్త్రీలు తమ మనోస్థితిని సానుకూలంగా మార్చుకుని ఇతరులతో సంబంధాలను మెరుగుపర్చుకునేందుకు దోహదపడుతుంది.

### మంత్ర ఉచ్చారణ

ఓ మంత్రాన్ని లేదంటే పదాన్ని, పదబంధాన్ని ఉచ్చరించడం కూడా ధ్యానమే. దీనివల్ల మనసుకు ఉపశమనం దొరుకుతుంది. మన గురించి మనకు ఎరుక ఏర్పడుతుంది. నామాన్ని ఉచ్చరించడం వల్ల ఒత్తిడి, ఆందోళన లాంటివి దూరమైపోతాయి. మనసు స్థిమిత పడుతుంది.

### ఎన్నో ప్రయోజనాలు

శాస్త్రీయ అధ్యయనాల ప్రకారం ధ్యానంతో మానసిక, భావోద్వేగపరమైన, శారీరకపరమైన ఆరోగ్యం చేకూరుతుంది. ఒత్తిడి, నిరాశ, ఆందోళన దూరమైపోతాయి. క్రమం తప్పకుండా ధ్యానం చేయడం ద్వారా ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతాయి. మానసికంగా స్పష్టత వస్తుంది. ఏవైనా సవాళ్లు ఎదురైనప్పుడు భావోద్వేగాల్లో స్థిరత్వం ఏర్పడుతుంది. ఇక శారీరకంగా చూస్తే ధ్యానం వల్ల అధిక రక్తపోటు తగ్గుతుంది. అలా గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. అయితే, ధ్యానం ఇచ్చే ప్రయోజనాలను పెంచుకోవాలని అనుకుంటే రోజువారీ జీవితంలో ఆరోగ్యకరమైన అలవాట్లకు చోటివ్వాలి. పోషకాలతో కూడిన సమతుల ఆహారం తీసుకోవాలి. క్రమం తప్పకుండా శారీరక, మానసిక వ్యాయామాలు చేయాలి. ఇలా చేస్తే జీవితంలో నాణ్యత కూడా పెరుగుతుంది. ధ్యానం వల్ల నిద్ర కూడా గాఢంగా పడుతుంది. దీంతో మేధో సామర్థ్యం పెరుగుతుంది. ఇవి మాత్రమే కాదు%ొ% ఆహారం తినడాన్నీ ఓ ధ్యానంలాగే పూర్తిచేయాలి. ఆహారం రుచి, రంగు, వాసనను ముద్దముద్దలో ఆస్వాదిస్తూ తినాలి. జీవితం అంటే గమ్యం కాదు ప్రయాణం అని గుర్తుంచుకోవాలి. దీన్ని గుర్తిస్తే చాలు జీవితయాత్ర ఆనందంగా, ఆరోగ్యకరంగా సాగిపోతుంది. ఈ క్రమంలో ధ్యానం, యోగా లాంటివి తమవంతు సాయం చేస్తాయి. ధ్యానం కోసం ఎవరైనా అనుభవజ్ఞుల దగ్గర శిక్షణ తీసుకోవడం మర్చిపోవద్దు. ఎలా చేయాలి? మొదట్లో ఐదు పది నిమిషాలతో మొదలుపెట్టి ధ్యానం చేసే సమయాన్ని పెంచుతూ పోవాలి. ఎవరి అవసరాన్ని బట్టి వారు ఎంత సమయం ధ్యానం చేయాలనేది నిర్ణయించుకోవాలి. ఐదు నిమిషాల నుంచి అరగంటపాటు ఓ నిశ్శబ్ద ప్రదేశంలో బయటి ప్రపంచం ప్రభావం లేకుండా ధ్యానం చేయడం మంచిది. ధ్యానం చేసేటప్పుడు పద్మాసనం లాంటి సంప్రదాయ భంగిమలు మంచివి. లేదంటే మీకు తగినట్టుగా, ఉపశమనం కలిగించే భంగిమ ఏదైనా ఎంచుకోవచ్చు. కుర్చీలో కూర్చొని, పడుకొని కూడా ధ్యానంలోకి

**వెళ్లిపోవచ్చు.**

ధ్యానం అనేది మానసిక, శారీరక ఆరోగ్యానికి హామీనిస్తుంది. అయితే అనారోగ్యంగా ఉన్నప్పుడు సంబంధిత వైద్యుణ్ని కలిసి తగిన చికిత్స తీసుకోవాలి. అంతే తప్ప ధ్యానం మాత్రమే రోగాలను తగ్గించదు.

# రైతుకు లేని భరోసా



పులి-బంగారు కంకణం కథ అందరికీ తెలిసిందే. కంకణానికి ఆశపడి పులి దగ్గరకు వెళ్లామా అంతే సంగతులు. ప్రస్తుత రాష్ట్ర పరిస్థితిని పోల్చి చూపేందుకు ఇంతకు మించిన కథ మరొకటి ఉండదనిపిస్తున్నది. అధికార దాహంతో ఉన్న కాంగ్రెస్ అడ్డగోలుగా హామీలు గుప్పించి, అన్నివర్గాలను ఆకట్టుకునే ప్రయత్నం చేసింది. కేసీఆర్ పాలనలో స్వర్ణయుగం చూసిన రైతులకు ఇంకా మరేదో ఇస్తానని మాయమాటలు చెప్పింది. రైతుబంధును రైతుభరోసాగా మార్చి రెండు వేలు ఎక్కువే ఇస్తానని నమ్మబలికింది. తీరా గెలిచిన తర్వాత అన్నివర్గాలకూ కుచ్చుటోపీ పెట్టినట్టుగానే అన్నదాతలనూ మోసం చేసింది. పెంచుడు మాటేమో గానీ ఉన్న పెట్టుబడి సాయం ఊడిపోతుందని ఓటు వేయించుకున్న తర్వాత తెలిసి వచ్చింది రైతన్నలకు. ఎదురుచూసి.. నీల్గి.. నీరసించిన తర్వాత ఇప్పుడు అసలు సంగతి బయటపెట్టింది. అప్పుడు ఇంతిస్తా, అంతిస్తా అని కోతలు కోసింది. ఇప్పుడు అనర్హుల పేరిట కొర్రీలతో కోతలు కోస్తున్నది. కేంద్రం అమలు చేస్తున్న పీఎం కిసాన్ పథకం నుంచి అరువు తెచ్చుకుని మరీ అర్హతలు ప్రకటిస్తున్నది. ఆ పథకం నిబంధనలను అసెంబ్లీ ముందుంచి మరీ విధేయత చాటుకున్నది. రైతుబంధు స్థానంలో తెచ్చిన రైతుభరోసా వల్ల లబ్ధిదారుల సంఖ్య భారీగా తగ్గిపోతుంది. కుటుంబంలో ఎంతమంది రైతులున్నా ఒక్కరికే సాయం ఇస్తారట. ఆదాయ పన్ను కట్టేవారు కుటుంబంలో ఒక్కరున్నా పంట పెట్టుబడి ఇవ్వరట. ప్రజాప్రతినిధు లు, ప్రభుత్వ ఉద్యోగులు, లాయర్లు, డాక్టర్లు అంటూ చాంతాడంత జాబితా తయారు చేశారు. చివరికి కుటుంబంలో ఇంజినీర్లున్నా మొండిచెయ్యేనట. ఈ కొర్రీల జాబితా వెనకున్న ఉద్దేశం తెలుసుకోవడం అంత కష్టమేమీ కాదు. వీలైనంత మందికి పెట్టుబడి సాయం ఎగ్గొట్టేందుకు సర్కారు యోచిస్తు న్నట్టు కనిపిస్తున్నది. రైతుబంధు లబ్ధిదారుల్లో దాదాపు 86 శాతం మేర చిన్న, సన్నకారు రైతులేనని అందరికీ తెలిసిన విషయమే. ఒకవేళ పెద్ద రైతులను తొలగిస్తున్నారనుకున్నా కోత 14 శాతం మించరాదు. బీఆర్ఎస్ హయాంలో రైతుబంధు లబ్ధిదారులు సీజన్‌కు 70 లక్షల దాకా ఉండేవారు. తాజాగా ప్రభుత్వం విధిస్తున్న కోతల వల్ల వారి సంఖ్య 30 లక్షలకు పడిపోతుంది. అంటే సగానికి పైగా రైతులు ఎగిరిపోతారన్న మాట. సర్కారు మోసకారి లెక్కలతో 50 శాతానికి పైగా రైతులకు ఎగనామం పెడుతుండటం ఏ మాత్రం క్షంతవ్యం కాదు. పంటపెట్టుబడి సాయం నేరుగా రైతులకు అందించే వినూత్న పథకం రైతుబంధుతో రాష్ట్రంలో వ్యవసాయం ముఖచిత్రమే మారిపోయింది. రాష్ట్రం దేశానికే అన్నపూర్ణగా మారింది. ఇది బీఆర్ఎస్ చెప్పుకొంటున్న సంగతి కాదు. స్వయంగా సర్కారే అసెంబ్లీ సాక్షిగా వెల్లడించిన వాస్తవం. మరి అదే సర్కారు సాయంలో కోతలు పెడుతూ రైతును, రాష్ట్రాన్ని ఏం చేయాలనుకుంటున్నది? స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న వేళ సర్కారు హఠాత్తుగా రైతుభరోసా మాట ఎత్తుకోవడం హాస్యాస్పదం. ఇచ్చినట్టు కాదు, ఇవ్వనట్టు కాదు అన్నట్టుగా అరకొరగా అమలు చేసి అయిందనిపించుకునే పనిలో సర్కారు ఉన్నదన్నది స్పష్టమే. కానీ, రైతులను పదే పదే మోసం చేయడం సాధ్యపడదనే వాస్తవాన్ని సర్కారు గుర్తిస్తే మంచిది.

# కాంగ్రెస్ అధిష్ఠానం ప్రేక్షక పాత్ర ఎందుకు?




తెలంగాణలో తమ ప్రభుత్వపు తీరు పట్ల కాంగ్రెస్ అధిష్ఠానం ఎందుకు ప్రేక్షక పాత్ర వహిస్తున్నదనే ప్రశ్నను తరచూ వింటున్నాము. ఈ మాట ప్రతిపక్షాల నుంచే గాక, రాజకీయాలను గమనిస్తూ ఉండే సాధారణ పరిశీలకుల నుంచి కూడా వస్తున్నది. రాష్ట్రాల స్థాయిలో పార్టీ పరిస్థితిని, పార్టీ ప్రభుత్వాల పాలనను ఎప్పటికప్పుడు గమనించటం, అవసరమనుకున్న మార్పులు జరిగేట్టు చూడటం అధిష్ఠానం నిర్వహించే బాధ్యతల్లో ఒకటని మనకు మొదటినుంచి తెలుసు. అట్లా జరగటాన్ని చూస్తూ వస్తున్నాము కూడా. కాని, నెహ్రూ నుంచి మొదలుకొని సోనియాగాంధీ కాలం వరకు కనిపించిన ఈ పద్ధతులు రాహుల్ గాంధీ నాయకత్వం వచ్చేసరికి ఎందువల్ల మారినట్టు? ఇది జాగ్రత్తగా అర్థం చేసుకోవలసిన విషయం. ఇది తెలిస్తే గాని తెలంగాణ గురించి అర్థం కాదు. గత పరిస్థితుల్లోకి వెళ్లేముందు వర్తమానం గురించి కొంత చెప్పుకోవాలి. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది అయింది. అంతకుముందు పదేండ్లు పాలించిన బీఆర్ఎస్‌ను ఎంత అనూహ్యంగా ఓడించి అధికారానికి వచ్చారో, అంతే అనూహ్యమైన వేగంతో ప్రజల దృష్టిలో అప్రతిష్ట పాలవుతున్నారు. అందుకు కారణాలు అనేకం. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయలేకపోవటం, ఆర్థిక స్థితి బాగా లేదని ప్రచారాలు చేస్తూనే అధికారం కోసం అలవికాని హామీలివ్వటం, దారీ తెన్నూ లేని పరిపాలన, మాటల నుంచి చేతల వరకు అస్తవ్యస్తత, ఎన్ని విమర్శలు వచ్చినా ధోరణిని మార్చుకోకపోవటం, వ్యక్తిగతంగా అపసవ్యపు శైలి వంటివన్నీ ఈ కారణాలలోకి వస్తాయి. ఇది ఈ విధంగానే కొనసాగితే రాష్ట్ర నాయకత్వానికి కలిగే నష్టం ఎట్లున్నా, అసలు కాంగ్రెస్ పార్టీకే హాని జరగగలదని ఎవరైనా అంచనా వేయగలరు. అటువంటి ప్రమాదపు సూచనలు కన్పించినప్పుడు అధిష్ఠానం తమ పార్టీ ప్రయోజనాలను కాపాడుకునేందుకు అవసరమైన దిద్దుబాటు చర్యలు తీసుకోగలదని ఎవరైనా భావిస్తారు.

కాని అట్లా జరగనిది ఎందుకు? ముఖ్యంగా జాతీయ స్థాయిలో గాని, వివిధ రాష్ట్రాల్లో గాని కాంగ్రెస్ పరిస్థితి బాగా లేనపుడు ఇటువంటి చర్యలు మరింత అవసరం. జాతీయస్థాయిలో పార్టీ వరుసగా మూడవసారి అధికారానికి రాలేకపోయింది. దేశంలోని రాష్ట్రాలు 28 కాగా కేవలం మూడింట అధికారంలోకి వచ్చి మరొక మూడింట ప్రాంతీయ పార్టీలకు జూనియర్ భాగస్వామిగా అధికారంలో ఉంది. 140 సంవత్సరాల చరిత్ర కలిగి దశాబ్దాల పాటు ఏకచ్ఛత్రాధిపత్యంగా పాలించిన పార్టీకి ఇదెంత అవమానకర స్థితో వేరుగా చెప్పనక్కరలేదు. పార్టీ ఇటువంటి దశకు బలహీనపడినపుడు జాతీయ నాయకత్వం కేంద్రంతో పాటు రాష్ట్రాలలో కూడా సంస్థ తిరిగి బలపడేందుకు అవసరమైన చర్యలు తీసుకోవటం అవసరం. ఈ మాట కేంద్రంలో, రాష్ట్రాలలో తమ పార్టీ ప్రభుత్వాలకు వర్తిస్తుంది. ఈ దృష్టితోనే సోనియాగాంధీ తమ యూపీఏ ప్రభుత్వానికి దిశానిర్దేశం చేసేందుకు తన అధ్యక్షతన కమిటీలు వేశారు. అంతకన్న ముందు ఒక ఏఐసీసీ సెషన్‌లో రాష్ట్రాల గురించి ప్రత్యేకంగా చర్చిస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వాల పరిపాలన మెరుగుగా సాగాలని, అవి ఇతర పార్టీల ప్రభుత్వాలకు ఆదర్శవంతంగా ఉండాలని, ప్రజలు మళ్లీ మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వాలనే ఎన్నుకునేట్టు సాగాలని అన్నారు. కానీ ఆ దశ గడిచిపోయింది. ఇప్పుడు ఇదంతా ఎందుకు తలకిందులవుతున్నట్టు? అధిష్ఠానానికి పీసీసీలపై, రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వాలపై తగిన అజమాయిషీ ఉండాలంటే అర్థం ఇందిరాగాంధీ హయాంలో వలె వ్యక్తిగత ధోరణులు చూపాలని, స్వప్రయోజనాల కోసం రాష్ట్ర నాయకులను కీలు బొమ్మలుగా మార్చాలని కాదు. నిజానికి ఆ వైఖరి కూడా పార్టీ బలహీన పడటానికి కారణాలలో ఒకటి. కనుక, అటువంటి నియంతృత్వ వైఖరులు అక్కరలేదు గాని, అదే సమయంలో ప్రజాస్వామిక నియంత్రణలు అవసరం. ఇందిర అనుసరించిన పద్ధతులలో

సోనియా గాంధీ తగినంత ప్రజాస్వామికతను ప్రవేశపెట్టారు. రాష్ట్ర ముఖ్యమంత్రులను, కాంగ్రెస్ అధ్యక్షులను చీటికి మాటికి మార్చకపోవటం వాటిలో ఒకటి. అదే సమయంలో వారిపై పర్యవేక్షణలు, నియంత్రణలు కొనసాగించారు. ఆ కాలానికి సంబంధించి మరొక గమనించదగిన విషయం అప్పటి నాయకులలోనూ కాంగ్రెస్ సంప్రదాయిక రాజకీయ సంస్కృతి తగినంత ఉండేది. ఇదంతా ఆ తర్వాత కాలంలో బలహీనపడుతూ వస్తున్నది. ఆ కారణంగానే ఈ రోజున మనం తెలంగాణ విషయంలో చూస్తున్నవిధంగా పరిస్థితులు, నాయకత్వాల తీరు మారుతున్నది. వారిపై అధిష్ఠానం తనంతట తానుగానే నియంత్రణ కోల్పోతుండటం ఒకటైతే, గతంలో వలె నియంత్రించే శక్తి స్వీయ బలహీనతల వల్ల స్వతహాగా తగ్గటం మరొకటి అవుతున్నది. ఈ మార్పుల పర్యవసానంగా అధిష్ఠానం పాత్ర పర్యవేక్షణలు, నియంత్రణల దశ నుంచి ప్రేక్షక పాత్రకు క్రమంగా మారుతున్నది. మొత్తం మీద కాంగ్రెస్ మౌలికంగానే బలహీన పడుతుండటానికి సూచికలు ఇవన్నీ. క్రమంగా అధికారాన్ని కోల్పోతుండటం, పార్టీ వ్యవస్థ బలహీనపడుతుండటం, మనుగడ కోసం ఇతర పార్టీలపై ఆధారపడటం వంటివి ఒక విధమైన సూచికలు కాగా, తమ నాయకులను తాము పర్యవేక్షించి, నియంత్రించలేకపోవటమన్న తెలంగాణ వంటి పరిస్థితి మరొక విధమైన సూచిక. ఇటువంటి మలుపు సుమారు 2014 ఎన్నికల ప్రాంతం నుంచి మొదలైంది. అప్పుడు కనిపించిన పరిణామాలు మూడున్నాయి. ఒకటి, పార్టీ లోక్‌సభ ఎన్నికలలో అధికారాన్ని కోల్పోవటమే గాక, సీట్ల సంఖ్య తమ చరిత్రలోనే ఎన్నడూ లేనివిధంగా 50 కన్న దిగువకు పడిపోయి, ప్రతిపక్ష హోదా అయినా లభించకపోవడం. రెండు, సోనియా గాంధీ ఆరోగ్యం దెబ్బతినగా ఆమె క్రియాశీలతలో తగ్గుముఖం. మూడు, గాంధీ కుటుంబ వారసునిగా ముందుకువచ్చిన రాహుల్‌గాంధీ, ప్రత్యక్ష రాజకీయాలలో తన ప్రవేశం జరిగి (2004) అప్పటికి పదేండ్లు గడిచినా, 2004-14 మధ్య తమ పార్టీ అధికారంలో ఉండినప్పటికీ ఏమీ నేర్చుకొనక, అసమర్థుడనే పేరు తెచ్చుకోవడం. ఈ మూడింటికి మూడు పరిస్థితులూ 2014 నుంచి ఇప్పటివరకు మరొక పదేండ్లు గడిచినా కొనసాగుతూనే ఉన్నాయి. విషయం ఏమంటే, ఇటువంటి పరిస్థితులు పరిణామాల మధ్య ఒక బలహీనమైన పార్టీ అధిష్ఠానం, తెలంగాణ తరహా విశృంఖల నాయకత్వాన్ని పర్యవేక్షించలేదు, నియంత్రించలేదు. అది దాదాపుగా తన శక్తికి మించిన పని. అది ఒక నిస్సహాయ స్థితి. మరీ తన చాప కిందకు నీళ్లు వస్తే తప్ప. వారికి కావాల్సింది కర్ణాటక, హిమాచల్‌తో పాటు తెలంగాణలో ఏదో ఒకవిధంగా అధికారం నిలబెట్టుకోవడం. పార్టీ ఆర్థికావసరాలను ఆ ప్రభుత్వాల ద్వారా నెరవేర్చుకొనటం. ఆ రాష్ట్రాలలోని పార్టీ సభ్యులకు ప్రస్తుతం గల అధికార, ఆర్థిక ఆకర్షణలను కొనసాగిస్తూ వారు ఇతర పార్టీలలోకి మారకుండా చూసుకోవటం. ఇవన్నీ జరిగినంత కాలం తెలంగాణ నాయకత్వం ఏమి చేసినా, చేయకున్నా ప్రేక్షక పాత్ర వహించటం. అంతకుమించి మరేమైనా చేయగల ఇందిర కాలపు వంటి శక్తి సామర్థ్యాలు ఇప్పుడు లేనందున, అంతకుమించి చేయగలిగింది కూడా లేదు. పైన అనుకున్నట్టు తమ చాప కిందకు నీరు వస్తే తప్ప.

# రోజూ ఉదయం ఖాళీ కడుపుతో రన్నింగ్ చేస్తే కలిగే అద్భుతమైన లాభాలు ఇవే



మనం ఆరోగ్యంగా ఉండాలంటే రోజూ పౌష్టికాహారాన్ని తీసుకోవడంతోపాటు వ్యాయామం చేయాలన్న సంగతి తెలిసిందే. అయితే చాలా మంది ఉదయం నిద్ర లేచేందుకు బద్ధకం వహిస్తుంటారు. దీంతో సాయంత్రం సమయంలో వ్యాయామం చేస్తుంటారు. కానీ వ్యాయామం ఉదయం చేస్తేనే ఎక్కువ ఫలితం ఉంటుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఎందుకంటే ఉదయం ఖాళీ కడుపుతో వ్యాయామం చేయడం వల్ల శరీరం ఎక్కువ క్యాలరీలను ఖర్చు చేస్తుందని వారు అంటున్నారు. ఇక ఉదయం పరగడుపునే రన్నింగ్ చేయడం వల్ల అద్భుతమైన లాభాలు ఉంటాయని వారు అంటున్నారు. పరగడుపునే రన్నింగ్ చేస్తే పలు వ్యాధులను నయం చేసుకోవచ్చని, అలాగే అన్ని రకాలుగా ఆరోగ్యంగా ఉండవచ్చని వారు చెబుతున్నారు.

**కొవ్వు వేగంగా కరుగుతుంది..**

రోజూ ఉదయం ఖాళీ కడుపుతో వ్యాయామం చేయడం వల్ల శరీరంలోని కొవ్వు మరింత వేగంగా కరుగుతుంది. కండరాలు, ఇతర ప్రదేశాలలో ఉండే గ్లూకోజ్ నిల్వలు త్వరగా ఖర్చవుతాయి. దీంతో శరీరం శక్తి కోసం కొవ్వు మీద ఆధారపడుతుంది. కనుక ఉదయం కాస్త సేపు రన్నింగ్ చేసినా చాలు ఎక్కువ మొత్తంలో కొవ్వు కరిగిపోతుంది. దీంతో అధిక బరువు తగ్గుతారు. త్వరగా బరువు తగ్గాలని చూస్తున్నవారు ఉదయం ఖాళీ కడుపుతో రన్నింగ్ చేస్తే ఫలితం ఉంటుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. అలాగే ఈ విధంగా చేయడం వల్ల ఇన్సులిన్ నిరోధకత తగ్గుతుంది. డయాబెటిస్ ఉన్నవారికి ఇది ఎంతగానో మేలు చేస్తుంది. దీని వల్ల శరీరం ఇన్సులిన్‌ను మరింత సులభంగా గ్రహిస్తుంది. దీంతో షుగర్ లెవల్స్ తగ్గుతాయి. డయాబెటిస్ ఉన్నవారు డాక్టర్ సూచన మేరకు రోజూ రన్నింగ్ చేస్తే డయాబెటిస్‌ను వెనక్కి మళ్లించే చాన్స్ ఉంటుందని అంటున్నారు.


**కండరాల దృఢత్వం..**

ఇక ఉదయం ఖాళీ కడుపుతో రన్నింగ్ చేయడం వల్ల కండరాలు సైతం దృఢంగా మారుతాయి. దీంతో కండరాలు మరింత శక్తిని వినియోగించుకుంటాయి. దీని వల్ల శరీర మెటబాలిజం పెరుగుతుంది. రోజంతా ఉత్సాహంగా ఉంటారు. చురుగ్గా పనిచేస్తారు. బద్దకం తగ్గుతుంది. నీరసం, అలసట ఉండవు. శరీరంలో శక్తి స్థాయిలు పెరుగుతాయి. రోజంతా యాక్టివ్ గా పనిచేస్తారు. ఎంత పనిచేసినా అలసట అనిపించదు. కొందరికి శరీరంలో ఎంత ప్రయత్నించినా కరగని మొండి కొవ్వు ఉంటుంది. అది సైతం ఉదయం ఖాళీ కడుపుతో రన్నింగ్ చేయడం వల్ల కరిగిపోతుంది. దీంతో త్వరగా బరువు తగ్గవచ్చు.

**మానసిక ఆరోగ్యానికి..**


ఉదయం ఖాళీ కడుపుతో రన్నింగ్ చేయడం వల్ల మానసిక ఆరోగ్యం మెరుగు పడుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. దీని వల్ల ఒత్తిడి, ఆందోళన, డిప్రెషన్ తగ్గుతాయి. మైండ్ రిలాక్స్ అవుతుంది. రాత్రి పూట పడుకున్న వెంటనే గాఢ నిద్రలోకి జారుకుంటారు. చక్కగా నిద్ర పడుతుంది. మానసికంగా ఆరోగ్యంగా ఉంటారు. హార్మోన్ల అసమతుల్యత ఉన్నవారు రోజూ ఉదయం ఖాళీ కడుపుతో రన్నింగ్ చేస్తే ఎంతో మేలు జరుగుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. దీంతో హార్మోన్లు సరిగ్గా పనిచేస్తాయి. ఇది స్త్రీ, పురుషుల్లో సంతానం కలిగే అవకాశాలను పెంచుతుంది. సంతానం కోసం చూస్తున్న దంపతులు ఉదయం రన్నింగ్ చేస్తే మెరుగైన ఫలితాలు ఉంటాయని సైంటిస్టులు సైతం చెబుతున్నారు. ఇలా రోజూ ఉదయం ఖాళీ కడుపుతో రన్నింగ్ చేయడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.

# సూర్యుడికి అతి సమీపంగా పార్కర్ ప్రోబ్ చరిత్ర సృష్టించనున్న నాసా స్పేస్‌క్రాఫ్ట్



నాసా ప్రయోగించిన పార్కర్ సోలార్ ప్రోబ్ స్పేస్‌క్రాఫ్ట్ ఇప్పుడు చరిత్ర సృష్టించనున్నది. ఆ స్పేస్‌క్రాఫ్ట్ సూర్యుడికి అత్యంత సమీపంగా వెళ్లనున్నది. అతిభయంకరమైన వాతావరణం, రేడియేషన్‌ను తట్టుకుని ఆ వ్యోమనౌక .. సూర్యుడి సమీపానికి వెళ్తున్నది. డిసెంబర్ 24వ తేదీన సూర్యుడి బహ్యావలయమైన కరోనాకు సమీపంగా పార్కర్ ప్రోబ్ వెళ్తుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అయితే భగభగ మండే భానుడికి సమీపంగా ఉన్న కారణంగా.. ఆ స్పేస్‌క్రాఫ్ట్ నుంచి కొన్ని రోజుల పాటు సిగ్నల్స్ అందవని తెలిసింది. ఒకవేళ సూర్యుడి అగ్నితాపాన్ని తట్టుకుంటే, ఆ స్పేస్‌క్రాఫ్ట్ డిసెంబర్ 27వ తేదీన మళ్లీ సిగ్నల్స్ పంపిస్తుందని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. కరోనా లేయర్‌కు సమీపానికి వెళ్లడం వల్ల సూర్యుడు ఎలా పనిచేస్తాడన్న అధ్యయనాన్ని మరింత లోతుగా విశ్లేషించే అవకాశాలు ఉన్నట్లు శాస్త్రవేత్తలు చెబుతున్నారు. శతాబ్ధాలుగా సూర్యుడి గురించి ప్రజలు స్టడీ చేశారని, కానీ అతి సమీపం నుంచి ఆ వాతావరణాన్ని ఎవరూ అనుభవించలేదని నాసా శాస్త్రవేత్త డాక్టర్ నికోలా ఫాక్స్ తెలిపారు. 6 లక్షల 92 వేల కిలోమీటర్ల వేగంతో పార్కర్ ప్రోబ్ ప్రయాణిస్తోంది. సూర్యుడి కరోనాకు సమీపంగా వెళ్తున్న సమయంలో.. పార్కర్ ప్రోబ్ మెషిన్ సుమారు 982 డిగ్రీల సెల్సియస్ వేడిని తట్టుకోవాల్సి ఉంటుంది. 2018లో పార్కర్‌ను తొలిసారి ప్రయోగించారు. ఇప్పటికే ఆ స్పేస్‌క్రాఫ్ట్ 21 సార్లు సూర్యుడిని చుట్టేసింది. సుమారు 4.5 ఇంచుల కార్బన్ కంపోజిట్ షీల్డ్ ఉన్న పార్కర్ స్పేస్‌క్రాఫ్ట్.. చాలా వేగంగా కరోనాను తాకి మళ్లీ బయటి వాతావరణంలోకి రానున్నట్లు శాస్త్రవేత్తలు చెబుతున్నారు. కరోనా చాలా వేడిగా ఉంటుందన్న విషయం తెలిసిందే. కానీ ఎందుకు అక్కడ వాతావరణం అలా ఉందో తెలుసుకునేందుకు ప్రయత్నం చేస్తున్నామని ఖగోళశాస్త్రవేత్త డాక్టర్ జెన్నిఫర్ మిల్లార్డ్ తెలిపారు. సూర్యుడి కేంద్రానికి 6.1 మిలియన్ల కిలోమీటర్ల దూరం నుంచి పార్కర్ ప్రయాణించనున్నది.

# భారతీయ సినీ మంథన్ బెనెగల్



శ్యాం బెనెగల్.. ఈ పేరు తెలియని సినిమా అభిమాని ఉండరనడంలో అనుమానం లేదు. ఆయన భారతీయ సినిమాకు అంతర్జాతీయ ఖ్యాతి గడించిన ప్రముఖ దర్శకుడు. 'అంకుర్, నిషాంత్, మంథన్, భూమిక' చిత్రాలతో సినీ రంగంలో కొత్త ఒరవడిని సృష్టించారు. అంతర్జాతీయ చిత్ర పరిశ్రమకు ఎన్నో సేవలందించిన ఆయన అనారోగ్యంతో నిన్న సాయంత్రం ముంబైలో మరణించారు. 2019లో శ్యాం బెనెగల్‌ను ముంబైలో కార్టూనిస్టు చిలువేరు మృత్యుంజయ్ ఇంటర్వ్యూ చేశారు. ఈ సందర్భంగా ఆయనతో బెనెగల్ గత జ్ఞాపకాలను పంచుకున్నారు. 1985లో తీసిన సుస్మన్ సినిమా చిత్రీకరణ సందర్భంలో చిలువేరు రామలింగంతో ఉన్న మధురమైన జ్ఞాపకాలను యాదిచేసుకున్నారు. ఆ ఇంటర్వ్యూ 2019, నవంబర్ 3న 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైంది. శ్యాం బెనెగల్‌కు నివాళిగా ఆ ఇంటర్వ్యూ యథాతథంగా ముంబైలో థాడ్‌దేవ్ రోడ్డు. ఎవరెస్టు బిల్డింగ్.. రెండో ఫ్లోర్‌లో ఆఫీసు.. లోపలికి వెళ్లగానే ఎడమవైపు.. పెద్ద సుస్మన్ సినిమా పోస్టర్.. కుడివైపు అంకుర్ నిషాంత్ పోస్టర్లు. కొంచెం ముందుకువెళ్లి డోర్ తీయగానే దర్శకుడు శ్యాం బెనగల్. అభిముఖంగా తపస్సు చేసుకుంటున్నట్టున్నారు. ఒంటరిగా 85 ఏండ్ల వయసులో ఎంతో ఎనర్జిటిక్‌గా కనిపిస్తున్నారు. చుట్టూ బోలెడు పుస్తకాలు, కాగితాలు, ఫొటోల మధ్య షేక్ ముజీబుర్ రెహ్మాన్ లైఫ్‌స్టోరీ మీద స్క్రిప్ట్ రాసుకునే పనిలో ఉన్నారు. ముజీబుర్ రెహ్మాన్ కూతురు ప్రస్తుత బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా రిక్వెస్ట్ మీద ఈ సినిమా తీసే పనిలో బిజీగా ఉన్నారు. ప్రస్తుతం ఈ పని తప్ప వేరే ధ్యాస లేదు. అయినప్పటికీ సుమారు గంటన్నర సమయం కేటాయించారు. సినిమా, తెలంగాణ పల్లె,హైదరాబాద్, భాష రకరకాల అంశాల మీదసుదీర్ఘమైన జ్ఞాపకాలను పంచుకున్నారు. 1985లో భూదాన్ పోచంపల్లిలో, అలాగే ముక్తాపూర్ గ్రామంలో నేత కార్మికుల ఇతివృత్తం మీద తీసిన సినిమాను బెనగల్‌కు గుర్తుచేశాను. అప్పుడు నేను ఐదో తరగతి. చేనేత కార్మికుల సమస్యలు, సహకార సంఘాల వైఫల్యం, దళారుల దౌర్జన్యంతో అరుదైన చేనేత కళ ఎలా చితికిపోతున్నదో సుస్మన్ సినిమా చూపెడుతుంది. ఆ సినిమా షూటింగ్ కోసం ఓంపురి, షబానా అజ్మీ, పల్లవి జోషి.. మా ఇంట్లోనే రిహార్సల్స్ చేసేవారు. మా ఇంట్లోనే బస. మా వీధి జాతరలా ఉండేది. బట్టలపై రాజకీయ నేతలను నేయడం, కొత్త డిజైన్లను సృష్టించడం, కుట్టులేకుండా మూడు కొంగుల చీర, సుస్మన్ సినిమా కోసం పచ్చీసు కుర్తా పైజామా, మగ్గంపై నేసే నేత కళాకారుడైన మా నాయన చిలువేరు రామలింగం సహాయం ఎలా తీసుకున్నారో శ్యాంబెనగల్ చెప్తూ పోయారు. సుస్మన్ స్క్రిప్ట్ వర్క్ మా ఇంట్లో కూడా జరిగింది. సుస్మన్ సినిమా ప్రధాన పాత్రధారుడు ఓంపురికి మా నాయన మగ్గం నేయడం నేర్పించడమే కాకుండా, ఓంపురి పాత్రకు మా నాయనను రిఫరెన్స్‌గా తీసుకున్న విషయం చెప్పారు. బోనాల పండుగ రోజు మా నాయన బండి మీద మగ్గం నేస్తూ గుడికి వెళ్లేలోపు చీర పూర్తిచేసి అమ్మవారికి అప్పటికప్పుడే కట్టించే మా ఊరి సంప్రదాయాన్ని సుస్మన్ సినిమాలో ఓంపురికి అన్వయిస్తూ చిత్రీకరించిన విషయం కూడా ప్రస్తావనకు వచ్చింది. బెంగాల్ నుంచి మృణాల్‌సేన్, సత్యజిత్ రాయ్, కేరళ నుంచి ఆదూర్ గోపాలకృష్ణన్ కన్నడ నుంచి పట్టాభి రామిరెడ్డి (సంస్కార చందమార్త ఫేం), గిరీశ్ కాసరవల్లి, గిరీశ్ కర్నాడ్.. ఈ కోవకు చెందిన సూపర్ క్లబ్ డైరెక్టర్లు అద్భుతమైన ఆర్ట్ ఫిల్మ్‌లను తీస్తున్నారు. అవి ఇంటెలెక్చువల్ సినిమాలు. మామూలు ప్రేక్షకులకు ఎన్నటికీ చేరలేవు. ఇటు డబ్బు దండుకునే పక్కా కమర్షియల్ సినిమాలు, ఫైట్లు, క్లబ్ డాన్సులు, బూతు పాటలతో వేడి వేడి పకోడీలా జనాలను ఊపేస్తున్న కాలం అది. అంత ఆర్టూ పనికి రాదు. ఇంత పచ్చి వ్యాపార సెక్సిజమూ కూడదు. మధ్యే మార్గం ఉందా? కచ్చితంగా ఉంది. ఆ మిడిల్ ఆఫ్ ద రోడ్ ఫిల్మ్‌ను, టెక్నిక్‌ను కనిపెట్టినవారు శ్యాంబెనగల్. అప్పటిదాకా యాడ్ ఫిల్మ్ తీసుకుంటున్న శ్యాంబెనగల్‌ను గుజరాత్ వైట్ రెవొల్యూషన్ పితామహుడు వర్గీస్ కురియన్ పిలిచారు. ఇక్కడ కో-ఆపరేటివ్ పద్ధతిలో పాలు సేకరించి, నెయ్యి, స్వీట్లు, పాలు మార్కెటింగ్ చేస్తున్నాం. దీన్ని ప్రమోట్ చేస్తూ తక్కువ బడ్జెట్‌లో ఒక ఫిల్మ్ చేయగలవా అని అడిగారు. లెక్కలు వేసిన శ్యాం బెనగల్ ఆరు లక్షలు ఖర్చవుతుందన్నారు. గుజరాత్ కో-ఆపరేటివ్ రైతుల నుంచి తలా ఓ రూపాయి సేకరించి కురియన్.. శ్యాం బెనగల్‌కు ఆరు లక్షలు ఇచ్చారు. దాని ఫలితమే మంథన్ అనే గొప్ప సినిమా. మంథన్ అంటే చిలకడం. దాంట్లో స్మితా పాటిల్ హీరోయిన్. బహుశా అది ఆమె తొలి సినిమా అయి ఉంటుంది. అంకుర్, నిషాంత్‌లతో న్యూ వేవ్ పితామహుడిగా శ్యాం బెనగల్ పేరొందారు. మరాఠీ నటి హంసా వాడేకర్ జీవిత ఆధారంగా అమోల్ పాలేకర్, స్మితాపాటిల్, అనంతనాగ్‌లతో తీసిన భూమిక మరచిపోలేని సినిమా. కథనం, టెక్నిక్, ట్రిక్కుమార్క్స్.. భారతీయ చలనచిత్ర రంగంలో పూర్తి భిన్నంగా ఉంటాయి. గాంధీజీపై తీసిన మేకింగ్ ఆఫ్ మహాత్మా.. అంతే అద్భుతమైన సినిమా. భారతీయ సినిమాను 1980 నాటికే అంతర్జాతీయ వేదికలపై నిలబెట్టిన వారాయన . స్మితా పాటిల్, షబానా అజ్మీ అనే రెండు సినీ కళా సౌందర్య దీపాలను మనకు ప్రసాదించిన వారు శ్యాం బెనగల్. ఇది శ్యాంబెనల్ సినిమా అని ఇట్టే చెప్పే విలక్షణ శైలి ఆయనది. మెయిన్ స్ట్రీమ్, కమర్షియల్ సినిమా ధాటిని తట్టుకుని, తన సినిమాను నిలబెట్టుకునే చేవ ఉన్నవారు శ్యాం బెనగల్. ఆయన పంచుకున్న జ్ఞాపకాలు ఆయన మాటల్లోనే.. పుట్టి పెరిగింది సికింద్రాబాద్‌లోని కంటోన్మెంట్ ఏరియా తిరుమలగిరి. మెహబూబియా హై స్కూల్‌లో చదువు. ఆ తర్వాత నిజాం కాలేజీ. చదివింది హైదరాబాద్‌లో అయినా.. ప్రొఫెషనల్ వర్క్ మాత్రం బాంబేలోనే. అప్పట్లో తెలంగాణలోని 9 జిల్లాల్లో నేను విపరీతంగా తిరిగేవాడిని. తెలంగాణలోని ప్రతి పల్లె నాకు తెలుసు. ఏ ప్రాంతానికి వెళ్లినా.. ఆ ప్రాంతాన్ని వదిలి పెట్టాలనిపించేదికాదు. ఆ ప్రాంతంతో అంత అటాచ్‌మెంట్ ఉండేది. తెలంగాణలోని సిద్దిపేటతో పాటు పలు ప్రాంతాల్లో రమణీయమైన పెద్ద పెద్ద రాళ్ల కూర్పు ఉండేది. పంటసాగు సమయంలో పచ్చని పొలాల్లో తెలంగాణ ప్రాంతం కంటికి ఇంపుగా ఉండేది. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్‌లో కూడా అందమైన ఎత్తైన రాళ్లు ఒద్దికగా ఉండేవి. కానీ ఇప్పుడంతా ధ్వంసమైంది. సుమారు అర్ధ శతాబ్దం నుంచి ఎప్పుడైతే తెలంగాణ.. ఆంధ్రా అజమాయిషీలోకి పోయిందో.. అప్పటి నుంచి తెలంగాణ ధ్వంసం కావడం మొదలైంది. శతాబ్దాల పాటు వర్ధిల్లిన అప్పటి హైదరాబాద్ ఇప్పుడు లేదు. కట్టడాలు లేవు. ఆంధ్రా నేతల చేతుల్లోని తెలంగాణ చీడపురుగు పట్టిన పంటలా తయారైంది. ఇక్కడి ల్యాండ్‌స్కేప్ దేశంలో ఓల్డ్ మైసూర్‌లో తప్ప ఎక్కడా లేదు. దక్కనీ ప్రాంతంలో విలక్షణమైన వాతావరణం ఉండేది. ప్రత్యేకంగా తెలంగాణలోని 9 జిల్లాల్లో అప్పటి వాతావరణం అద్భుతంగా ఉండేది. 1960 నుంచి హైదరాబాద్ రూపురేఖలు మారిపోయాయి. తెలంగాణ ప్రాంతీయ జీవన విధానం ఇతివృత్తంగా సినిమాలు తీసే విషయాల గురించి చెబుతూ.. భారత దేశంలోని భాషలు, సంస్కృతులు విభిన్నమైనవి. ప్రత్యేకంగా దక్కనీ ప్రాంతం విలక్షణమైనది. మీరు భారతదేశ పటం ఆకారం చూసినట్టయితే, హైదరాబాద్ నగరం మ్యాప్‌లో మధ్యలో కడుపులా ఉంటుంది. ప్రతిదీ హైదరాబాద్‌లో కలవాల్సిందే. అక్కడ జీర్ణం కావాల్సిందే. హైదరాబాద్‌లో భిన్న భాషలు మాట్లాడే మనుషుల జీవన విధానం ఉంది. ఈ సంస్కృతి భారతదేశంలో ఎక్కడా లేదు. హిందీ, ఉర్దూ, మరాఠీ, కన్నడ.. అన్ని భాషలూ మాట్లాడుతారు. అందుకే 'డిస్టింక్ట్ లింగ్వా ఆఫ్ ఫ్రాంకా'/దక్కనీ భాష అంటారు. అన్ని భాషల మిశ్రమమే దక్కనీ. ఉత్తరాది వారు మన హైదరాబాదీ భాషను హేళన చేసేవారు. అపన్, తుపన్ లాంటి పదాలు వింటే వాళ్లు నవ్వేవారు. కానీ ఇది ఓ ప్రత్యేకమైన విలక్షణమైన భాష. అలాంటి పదాలతో నిజాం కవిత్వాలే రాసేవారు. కులీ కుతుబ్‌షా దక్కనీ భాషలో అందమైన కవిత్వాలు రాసేవారు. ఆ కవిత్వాలను నా సినిమాలో వాడాను. నిషాంత్ సినిమా పాటలు వినండి.. అద్భుతమైన కులీ కుతుబ్‌షా కవిత్వం ఉంటుంది. అలాగే మండి సినిమా పాటలు కూడా.

**పవర్ ఆఫ్ కార్టూనిస్టు**


పద్మావతి, ప్యాడ్‌మ్యాన్‌లాంటి సినిమాల మీద లీగల్ నోటీసులు జారీ చేస్తున్నారన్న ప్రస్తావన వచ్చినప్పుడు ఈ సంగతి గుర్తుచేశాను. ప్రముఖ అమెరికన్ హాస్యపత్రిక 'మ్యాడ్' హాలీవుడ్ సినిమాలను పేరడీ చేస్తూ రెగ్యులర్‌గా కార్టూన్లు వేసేది. అప్పట్లో ఆ ఫీచర్ బంపర్ హిట్. 1980లో ఎంపైర్ స్ట్రైక్స్ బ్యాక్ సినిమా రిలీజైనపుడు 'ఎంపైర్ స్ట్రైక్ అవుట్' అంటూ మార్ట్ డ్రక్కర్ గీసిన కార్టూన్‌ని వేసింది. ఎప్పట్లాగే ఆ కార్టూనూ సూపర్ డూపర్ హిట్ అయ్యింది. ఆ సినిమా నిర్మాణ సంస్థ నుంచి మ్యాడ్ పబ్లిషర్ బిల్ గేయిన్స్‌కు లీగల్ నోటీసులు పంపారు.. వెంటనే మ్యాగజైన్లను మార్కెట్ల నుంచి తొలగించాలని, అలాగే ప్రతులను దగ్ధం చేయాలని, ఆ సినిమా నిర్మాణ సంస్థకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. 'మ్యాడ్'కు వీరాభిమాని అయిన సినిమా నిర్మాత జార్జ్ లూకాస్ 'ఎంపైర్' కార్టూన్ అద్భుతమంటూ కార్టూనిస్టు మార్ట్‌ను ఆస్కార్‌కు నామినేట్ చేస్తున్నానంటూ ఒక అభినందన లేఖ 'మ్యాడ్'కు పంపాడు. అప్పుడు మ్యాడ్ పత్రిక వాళ్లు ఆ అభినందన లేఖను లీగల్ నోటీసు జారీ చేసిన వారికి పంపడంతో కేసు కథ ముగిసింది. ఈ సంగతి వినగానే శ్యాం బెనెగల్ దట్ ఈజ్ ద పవర్ ఆఫ్ కార్టూనిస్టు అన్నాడు. నా దగ్గర ఇప్పటికే కులీ కుతుబ్‌షా కవిత్వాల కలెక్షన్ ఉంది. అది దక్కనీ భాష. ఉత్తరాది సినిమా వాళ్ల రాకతో అప్పటి అందమైన భాష కూడా ధ్వంసమైంది. ఉత్తరాది సినిమావాళ్లు దక్కనీ భాషను ఎలా హేళన చేశారో, ఆంధ్రా సినిమా వాళ్లు తెలంగాణ భాషను అలా వెక్కిరించారు. నిజానికి మన అందరికీ తెలుసు. తెలంగాణ భాష అసలైన తెలుగు భాష. ఆంధ్రా సినిమా వాళ్లకు తెలంగాణ ప్రజల మీద చులకన భావన ఉండేది. చదువు రాదని, తెలివి లేనివాళ్లు అని, అందుకే సినిమాల్లో తెలంగాణ భాషను వెక్కిరించే డైలాగ్‌లు ఉండేవి. కానీ ఈ ప్రాంత ప్రజలు గ్రేస్‌ఫుల్ పీపుల్. వీళ్లకు మర్యాద తెలుసు. దక్కనీ ప్రాంతంలోని ఔరంగాబాద్, నాందేడ్, మరాఠ్వాడా, గుల్బర్గా ప్రాంతాల ప్రజలను పరిశీలించండి, కర్టెసీతో పాటు విలక్షణమైన మనస్తత్వం ఉన్న మనుషులుగా కనిపిస్తారు. కేరళ, తమిళనాడులాంటి కోస్తా ప్రాంతాల్లో పంటలు పండినట్లు, తెలంగాణలో అంత సులువుగా పంటలు పండవు. పంటలు సులువుగా పండే ప్రాంతాల్లో ప్రజలు చాలా అగ్రెసివ్‌గా ఉంటారు. నెహ్రూ డిస్కవరీ ఆఫ్ ఇండియా ఆధారంగా దూరదర్శన్ కోసం 'భారత్ ఏక్ ఖోజ్' తీశారు కదా, నెహ్రూ ప్రాపంచిక దృక్పథం వెనుకంజ వేసి ఇప్పుడు హిందుత్వ తీవ్రవాద దక్పథం పైచేయి అవుతున్నది కదా, దీనిపై మీరెలా స్పందిస్తారు అని అడిగితే.. 'భారత్ ఏక్ ఖోజ్'లో రెండు దృష్టి కోణాలు ఉంటాయి. ఒకటి నెహ్రూ చూసిన భారత దేశం. రెండోది ఓంపురి పాత్రలో సామాన్య చరిత్రకారుడు చూసిన భారతదేశం. ఈ రెండు గొంతుకలు సమాంతరంగా ఈ సినిమాలో నడుస్తాయి. చరిత్ర మారదు. మన అవసరాలకు అనుగుణంగా చూసినప్పుడు చరిత్ర మారినట్లు అనిపిస్తుంది. ఇప్పుడు చరిత్రను కొంతమంది ఆరెస్సెస్ భావజాలంతో చూస్తున్నారు. ఫైటింగ్, డ్యాన్సుల తరహా కమర్షియల్ సినిమాలు కాకుండా రియలిస్టిక్ సినిమాలు తీయడానికి కారణం ఏమిటని అడిగితే.. అవి కృత్రిమమైన సినిమాలు. మన జీవితానికి దూరంగా ఉండే అవాస్తవిక చిత్రాలు. నేను మీడియా కుటుంబం నుంచి వచ్చినవాడిని. మా నాయన ఫొటోగ్రాఫర్. ఆయనకో వీడియో కెమెరా ఉండేది. మేం పది మంది పిల్లలం. ఒక్కొక్కరి మీద తన కెమెరాతో ఒక్కొక్క సినిమాలా తీసేవారు. మా సినిమాలను మేం చూసుకునే వాళ్లం. సహజంగా ఉండేవి. ఆ కెమెరాలతో నేను మా కుటుంబసభ్యులను చిత్రీకరించేవాణ్ని. ఆ ప్రభావమే కుటుంబ విధానం, జీవితంలోని బ్యూటీని క్యాప్చర్ చేసేలా చేసిందేమో. తెలంగాణ తెలుగు సినిమాల గురించి.. అప్పట్లో హైదరాబాద్‌లో తెలుగు సినిమా పరిశ్రమలేదు. మదరాసులో ఉండేది. తెలంగాణ రిప్రజెంటేషన్ సినిమాలే లేవు. కేవలం ఆంధ్రా రిప్రజెంటేషన్ సినిమాలే వచ్చేవి. తెలంగాణ ఫిల్మ్ మేకర్స్ అరకొర తప్ప పెద్దగా ఉండేవారు కాదు. నేను అంకుర్ తీసినప్పుడు.. దక్కనీ భాషలో తీసిన మొదటి సినిమా. తమాషా ఏందంటే విజయవాడ నుంచి ఓ న్యూస్‌పేపర్ రివ్యూలో ఏం రాశారంటే.. తెలంగాణలో తీసిన మొట్టమొదటి తెలుగు సినిమా అని. ఇప్పుడు తెలంగాణ వచ్చాక..తెలంగాణ ఇతివృత్తంతో సినిమాలు వస్తున్నాయని విన్నాను. ఇది మంచి పరిణామం.

# తెలుగు భాషపై చిన్నచూపు




వేల ఏండ్ల నుంచే తెలుగు భాష ఉన్నదనడానికి నిలువెత్తు సాక్ష్యం కరీంనగర్ జిల్లా గంగాధర మండలం కురిక్యాలలోని బొమ్మలమ్మగుట్టపై ఉన్న కురిక్యాల శాసనం. 2008, అక్టోబర్ 31న నాటి కేంద్ర ప్రభుత్వం తెలుగు భాషకు ప్రాచీన హోదా కల్పించడానికి ఈ 'కురిక్యాల శాసనం' చాలా దోహదపడింది. ఈ శాసనాన్ని జినవల్లభుడు క్రీ.శ.945లోనే వేయించినట్టు చరిత్ర చెప్తున్నది. ఇదంతా బాగానే ఉన్నప్పటికీ రాష్ట్రంలో పాలనాపరంగా మాతృభాష సంపూర్ణంగా అమలుకాకపోవడం భాషాభిమానులను ఆశ్చర్యాన్ని గురిచేస్తున్నది. పాఠశాలలు, కళాశాలల్లో మాత్రమే తెలుగును పాఠ్యాంశంగా చూడటం కడు శోచనీయం. ఇంటర్మీడియట్ స్థాయిలో తెలుగు భాష పూర్తిగా కనుమరుగైపోయింది. 90 శాతం ప్రైవేటు కళాశాలలు సంస్కృతాన్నే ప్రోత్సహిస్తున్నాయి. ఇదిలాగే కొనసాగితే మాతృభాష మాట్లాడుకోవడానికి మాత్రమే మిగిలిపోతుంది. పుస్తకాల్లో, మస్తకాల్లో, పాఠశాలల్లో, కళాశాలల్లో, విశ్వవిద్యాలయాల్లో తెలుగు భాష సంపూర్ణంగా అమలుకానందుకు బాధపడాలో, సామాజిక మాధ్యమాల్లో తెలుగు భాషను ఎక్కువగా వాడుతున్నందుకు సం తోషపడాలో అర్థం కావడం లేదు. ఇదిలా ఉంటే సినిమా పేర్లను కూడా తెలుగులో పెట్టకుండా దేశంలోని ఇతర భాషల్లో వాడుతుండటం నిజంగా తెలుగు భాషను కించపరుస్తున్నట్టే లెక్క. ప్రభుత్వ యంత్రాంగం చూసీ చూడనట్టు ఇలాగే వ్యవహరిస్తే%౫% మాతృభాష అయిన తెలుగు భాష కొన్ని రోజుల్లో మృతభాషగా అవుతుందేమోనన్న అనుమానాలు బలపడుతున్నాయి.

# అడవుల రక్షణ బాధ్యత ఆదివాసీలదేనా?



దేశ వనరులను కాపాడాల్సిన బాధ్యత కేవలం ఆదివాసులదే కాదు, మిగతా వారిపై కూడా ఉంది. సహజ వనరులను కాపాడే క్రమంలో ఆదివాసీల జీవితాలు బలవుతున్నాయి. బీర్సాముండా, గుండాదర్, కుమ్రం భీం పోరాట ఫలితంగా రాజ్యాంగంలో ఆదివాసీలకు ప్రత్యేక రక్షణ కల్పిస్తూ 1/70, 1996 పేసా, 2006 అటవీ హక్కుల చట్టాలు రూపుదిద్దుకున్నాయి. ఆదివాసీల అభ్యున్నతే వీటి లక్ష్యం. కానీ, పాలకులు ఆ చట్టాలను అమలు చేయడం లేదు. కొద్ది నెలలుగా మధ్య భారతదేశంలో, ముఖ్యంగా ఛత్తీస్‌గఢ్‌లో ఆదివాసీల మీద పెద్దఎత్తున అణచివేత కొనసాగుతున్నది. ఆదివాసీ గూడెంల సమీపంలో వందలాది పోలీసు క్యాంపులను ఏర్పాటు చేసి వారిని ఆందోళనకు గురిచేస్తున్నారు. మూలవాసీ బచావో మంచ్ నాయకుడు రఘు మాటల్లో ఈ దేశ వనరులను కాపాడేందుకు ఆదివాసులు చేస్తున్న పోరాటాన్ని మిగతా సమాజం పట్టించుకోవడం లేదు. ఇది ఆదివాసీలకు సంబంధించిన సమస్యగా అందరూ చూస్తున్నారు. 1980 నుంచి మావోయిస్టులు ఆదివాసీ సమాజంలోకి, దండకారణ్యంలోకి ప్రవేశించి అక్కడ జరిగే అమానుషం, ఫారెస్టు వాళ్ల దోపిడీలను అరికట్టడం కోసం కృషి చేశారు. కానీ, 1993లో ప్రత్యేక చట్టం వచ్చాక దండకారణ్యంలోని కోట్లాది విలువైన వనరులపై కార్పొరేట్లు, సామ్రాజ్యవాదులు, పెట్టుబడిదారుల కన్నుపడింది. వనరుల దోపిడీకి ఆదివాసుల భూములను ఆక్రమించేందుకు నాటి నుంచి నేటి వరకు వారు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఆదివాసీలకు మావోయిస్టులు మద్దతుగా ఉన్నందుకే 2005లో సల్వాజుడుం మారణ హోమాన్ని సృష్టించారు. ఐదేండ్లలో మూడు వేల గ్రామాలను దగ్ధం చేశారు. 450 మందిని అతి కిరాతకంగా హత్య చేశారు. ఆ క్రమంలోనే ఎర్రబోరు, దోర్నపాలు, కుంట ప్రాంతాల్లో సల్వాజుడుం బేస్ క్యాంప్‌లుగా మార్చి ఒక్కొక్క క్యాంపులో 50 వేలకు పైగా ఆదివాసీలను నిర్బంధించిన స్థితిని మనందరం చూశాం. చివరికి ప్రొఫెసర్ నందిని సుందర్ పోరాటం, జస్టిస్ సుదర్శన్ తీర్పు కారణంగా సల్వాజుడుం రద్దయిందేమో కానీ, దాని మరొక రూపం డీఆర్‌జీ నేటికీ వేటాడుతూనే ఉన్నది. ఆదివాసీల నిర్బంధంపై మాట్లాడినందుకు సునీత పొట్టం అనే ఆదివాసీ, మూలవాసీ బచావో మంచ్ నాయకురాలిని బలవంతంగా అరెస్టు చేశారు. అదేవిధంగా 2021 నుంచి సిలింగేర్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన సాయుధ బలగాల క్యాంపులకు వ్యతిరేకంగా మూలవాసీ బచావో మంచ్ ఆధ్వర్యంలో ఆందోళనలు కొనసాగుతున్నాయి. మరోవైపు ఆదివాసులందరూ మావోయిస్టులేననే దుర్మార్గమైన ప్రచారాన్ని ప్రభుత్వం చేస్తున్నది. ఈ మధ్య జరిగిన ఎన్‌కౌంటర్లు, ఆదివాసీల నిర్బంధంపై మాట్లాడుతున్న హక్కుల నేతలను సైతం పోలీసులు బెదిరిస్తున్నారు. ఆదివాసీల సమస్యల గురించి ఎవరూ మాట్లాడొద్దా? ఇదే విధంగా సోనిసూరీ అనే ఆదివాసీ హక్కుల కార్యకర్తను నిర్బంధించారు. చనిపోయిన భర్తను చూసేందుకు కూడా ఆమెకు అనుమతి ఇవ్వలేదు. తమ హక్కుల కోసం పోరాడుతున్న యువతను అణచివేస్తున్నారు. దీన్ని అందరూ ఖండించాల్సిన అవసరం ఉన్నది. ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలతో కగార్ మారణకాండ కొనసాగుతూనే ఉంది. ఆదివాసీల హక్కులను కాపాడాల్సిన ప్రభుత్వాలు కార్పొరేట్ల దోపిడీకి సహకరిస్తున్నాయి. ప్రభుత్వాలే దళారీగా మారి పెట్టుబడిదారులకు సహజ వనరులను అప్పగించడం దారుణం. 2009లో మావోయిస్టు పార్టీ దేశానికి ప్రమాదకరమని అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్ ప్రకటించారు. చెప్పినట్టే ఏకపక్ష దాడులకు దిగారు. సరిహద్దుల్లో ఉండాల్సిన సాయుధ బలగాలు మధ్యభారతంలోకి ప్రవేశించాయి. అదే ఇప్పుడు ఆపరేషన్ కగార్‌గా మారింది. ఇప్పుడు దంతెవాడ, బస్తర్ ప్రాంతాలతో పాటు బీజాపూర్ జిల్లా కూడా ఇనుప ఖనిజపు పుట్టినిల్లుగా మారింది. ఛత్తీస్‌గఢ్‌లోని ఇనుప ఖనిజ నిల్వలను వెలికితీసేందుకు ఒక స్టీల్ కంపెనీతో రాష్ట్ర ప్రభుత్వం 2005లో ఒప్పందం కుదుర్చుకున్నది. దానికి తోడు నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎండీసీ) ఈ ప్రాంతంలో ఇనుప ఖనిజ నిల్వలను వెలికితీసేందుకు పనిచేస్తున్నది. కంపెనీలతో జరిగిన ఒప్పందాల వల్లనే ప్రభుత్వాలపై ఒత్తిడి పెరుగుతున్నది. తద్వారా ప్రజలను చంపైనా సరే వనరులను అప్పగించాలనే స్థితికి ప్రభుత్వాలు చేరిపోయాయి. ఈ దోపిడీకి వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలు కొనసాగిస్తున్నందున వాటిని అణచివేసేందుకు అనేక రకాల ఆపరేషన్లు జరుగుతున్నాయి. అందులో భాగంగానే ఆదివాసీ ఉద్యమాలపై ఉక్కుపాదం మోపుతూ 2009లో ఆపరేషన్ గ్రీన్ హంట్, 2017లో ఆపరేషన్ సమాధాన్, నేడు ఆపరేషన్ కగార్ పేరిట ఆదివాసీల హత్యాకాండ కొనసాగుతున్నది. వేలాది మంది ఆదివాసీలు ఎన్‌కౌంటర్ అయ్యారు. ఈ ఏడాది జనవరి 1న బీజాపూర్ జిల్లా ముద్దం గ్రామానికి చెందిన 6 నెలల సోడి మంగ్లీతో మొదలైన హత్యాకాండ 275కు చేరింది. తెలంగాణలోనూ సెప్టెంబర్ 5న రఘునాథపాలెంలో ఏడుగురిని హతమార్చారు. డిసెంబర్ 1న ఆరుగురికి విషం పెట్టి మరీ కాల్చిచంపారు. కనీసం ఆ మరణాలపై సత్యశోధన చేయడానికి కూడా ప్రభుత్వాలు అనుమతులు ఇవ్వడం లేదు. ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్ నిషేధిత ప్రాంతంగా మారిపోయింది. హక్కుల సంఘాలకు అనుమతి ఇవ్వడం లేదు. ఎమర్జెన్సీ కాలంలోనూ ఇంతటి దారుణమైన పరిస్థితి లేదు. అందుకే ప్రజలు స్పందించాలని కురుసం శంకర్, రఘు లాంటి మేధావులు కోరుతున్నారు. ప్రజా ఉద్యమాలపై ప్రభుత్వ అణచివేతలు ఎన్నడికీ విజయవంతం కావు. తెలంగాణ ఉద్యమమే అందుకు నిదర్శనం. మావోయిస్టుల సాకుతో ఆదివాసీలను నిర్బంధిస్తే ఉద్యమాలు ఆగవు. ప్రజాస్వామిక పోరాటాలను నిషేధించిన ప్రభుత్వాలు ఎక్కువ కాలం మనుగడ సాగించవు. పాలించే నైతిక హక్కును పాలకులు కోల్పోతారు. ఈ నేపథ్యంలో ప్రజా ఉద్యమాల పట్ల ప్రభుత్వాలు ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించాలి. మూలవాసీ బచావో మంచ్‌పై నిషేధం ఎత్తివేయాలి. మరీ ముఖ్యంగా ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని పౌరహక్కుల సంఘం డిమాండ్ చేస్తున్నది. ఆదివాసీలపై చేస్తున్న హత్యాకాండ పట్ల ప్రజల నుంచి మద్దతు దక్కని పక్షంలోనే ప్రభుత్వాలు అత్యంత దారుణంగా నరమేధాన్ని సృష్టిస్తాయి. ఈ విధానాన్ని మనమంతా ఖండించాలి. దేశ మూలవాసులైన ఆదివాసుల జీవించే హక్కును కాపాడుదాం. ఆపరేషన్ కగార్, ఆదివాసీ హననానికి వ్యతిరేకంగా గొంతెత్తుదాం.


# అనగనగా పెద్ద కథ!



**తెలుగు సాహిత్య ప్రపంచంలో కథ లేదా కథా సాహిత్యానికి ఒక విశిష్ట స్థానం ఉన్నది. 'కథ'ను అనగనగా అని మొదలుపెట్టి 'కథ కంచికి మనం ఇంటికి' అంటూ కథను ముగించడం తెలుగు కథకుల అలవాటు.**

'నిజ జీవితం ఆధారంగా అల్లబడిన సంఘటనల సమాహారం కథ' అని కొందరు, 'కల్పిత ప్రపంచ సమాహారం కథ' అని మరికొందరు కథకు రకరకాల నిర్వచనాలను ఇచ్చారు. కథలో ఉండాల్సిన నీతి విస్తృతం, ఎత్తుగడ, సంవేదన, నడక తీరు, ముగింపు, పరిమిత పాత్రలు, పాత్ర స్వభావాలు, ఏక వస్తు స్వరూపతల గురించి బొడ్డపాటి కుటుంబరాయ శర్మ, జె.నాగయ్య, పోరంకి దక్షిణామూర్తి వంటి అనేకమంది పండితులు అనేకరకాల అభిప్రాయాలను తెలియజేశారు. 'అనగనగా..' అంటే నిజంగా 'చాలాకాలం కిందట' అనే అర్థమేనా? కొంచెం తెలివితేటలు కలిగిన విద్యార్థి 'అనగనగా ఒక పిల్లి ఉంది అంటే చాలాకాలం కిందట ఒక పిల్లి ఉంది' అని అర్థం చెప్పుకోవాలా?, అలాగే 'అనగనగా ఒక రాజు అంటే చాలాకాలం కిందట ఒక రాజే ఉన్నాడని చెప్పుకోవాలా' అని ప్రశ్నిస్తే'అది అంతేలేరా' అని కొందరు గురువులు మృదువుగా మందలిస్తే, మరికొందరు గురువులు పిదప కాలం బుద్ధులు. దిక్కుమాలిన సందేహాలు అని విసుక్కుంటారు. ఏదేమైనా 'కథ్' అనే సం స్కృత ధాతువు నుంచి 'కథ' అనే పదం పుట్టింది. 'చెప్పు ట, సంభాషించుట' అని దీనికి అర్థాలుగా చెప్పవచ్చు. కథల్లో ఇతి వృత్తాన్ని బట్టి పురాణ కథలు, శృం గార కథలు, హాస్యకథలు, క్రైం కథ లు, రాజకీయ కథలు, అభ్యుదయ కథలు, స్త్రీవాద కథలు, దళిత కథలు వంటివి అనేకం ఉన్నాయి. ప్రాచుర్యాన్ని బట్టి చందమామ కథలు, పేదరాశి పెద్దమ్మ కథలు, పంచతంత్ర కథలు, విక్రమార్క కథలు, కాశీమజిలీ కథలు, బేతాళ కథలు, తాతమ్మ కథలు, పిట్ట కథలు వంటి వాటితో పాటు తెలుగు సాహిత్యంలో ప్రత్యేకంగా తెనాలి రామకృష్ణ కథల వంటి హాస్య కథలున్నాయి. ఇంకా హరి కథలు, బుర్రకథలు, ఒగ్గు కథలు, సైన్స్ కథలు, పొడు పు కథల వంటి అనేకరకాల కథలున్నాయి. ఈ ఆధుని క కాలంలో సినిమా కథల వంటివి కూడా ఉన్నాయి. తెలుగు కథలకు నిలయమైన 'కథా నిలయం' అనే పేరు గల గ్రంథాలయాన్ని 1997 ఫిబ్రవరి 22న శ్రీకాకుళంలో కాళీపట్నం రామారావు స్థాపించారు. తిక్కన శిష్యుడైన కేతన రాసిన 'దశకుమార చరిత్ర' కథా కావ్యం కాగా ఆధునిక కాలంలో గురజాడ వేంకట అప్పారావు రాసిన 'దిద్దుబాటు' అనే కథ తెలుగులో తొలి కథ అని అంటారు. ఇక బండారు అచ్చమాంబ, ఆచంట వేంకట సాంఖ్యాయన శర్మ వంటి వారు గురజాడ అప్పారావు కంటే ముందే కథా రచనకు శ్రీకారం చుట్టారు. ఆపై వేలూరి శివరామ శాస్త్రి, కొమర్రాజు వెం కటలక్ష్మణరావు, చింతా దీక్షితులు, కాళోజీ, చలం, బోయినపల్లి రంగారావు, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి, ముని మాణిక్యం, బోయ జంగయ్య, పులిపాటి గురుస్వామి, అల్లం రాజయ్య, అడవి బాపిరాజు, భమిడిపాటి కామేశ్వరరావు, విశ్వనాథ సత్యనారాయణ, పీవీ, మల్లాది రామకృష్ణ శాస్త్రి, కొడవటిగంటి కుటుంబరావు, గూడూరి సీతారాం, సామల, యశోదారెడ్డి, అఫ్సర్, ముళ్లపూడి వెం కటరమణ, మంజుశ్రీ, చాగంటి సోమయాజులు, కాళీపట్నం రామారావు, రావిశాస్త్రి, హితశ్రీ, కొలకలూరి ఇనాక్, కాలువ మల్లయ్య, వాకాటి పాండురంగారావు, భానుమతి, చెరబండరాజు, ఓల్గా, హుమాయూన్ సం ఘీర్, ధీరజ్ కశ్యప్, వేముగంటి.. ఇలా చెప్పుకొంటూ పోతే తెలుగు కథా రచయితల నామధేయాలే చిన్నపాటి గ్రంథం అవుతుంది. నాడు చిన్న పిల్లలు నిద్రపోవడానికి తల్లిదండ్రులు లేదా నానమ్మ తాతయ్యాదులు చిన్నచిన్న కతలు చెప్పేవారు. తెలుగునాట ఎవరైనా సరే చిన్న పిల్లలకు, పెద్దలకు కథ చెప్పేటప్పుడు 'అనగనగ..' అని మొదలుపెడతారు. చిన్న పిల్లల్లో కథ అనగానే ముందుగా కథ వినాలనే ఉత్సాహం ఉంటుంది. కానీ, ప్రశ్నించే తత్వం ఉం డదు. ఏది నిజం, ఏది అబద్ధం అనే ఆలోచనా జ్ఞానం ఉండదు. కల్పనా ప్రపంచంలో విహరించాలి అంతే. కొందరికి కథ కునుకు పట్టిస్తుంది కానీ, ఇది నిజం, ఇది అబ ద్ధం అనే ఆలోచనలను పెంచదు. కథ ల్లోని వాస్తవ, అవాస్తవాలను పక్కకు నెట్టేసి మనసును దేవుని మీదికి పోయేటట్టు చేస్తాయి గుడిలోని హరికథలు, బుర్రకథలు, ఒగ్గు కథల వంటి కథలు. ఇక బడిలోని కథల గురించి చెప్పాలంటే.. అవి మంచిని, మానవత్వాన్ని, నీతిని, పెద్దల ఆదర్శాలను, చదువును సంస్కారాన్ని, సృజనాత్మకతను, సశాస్త్రీయ పథాన్ని తెలియజేసేవిగా ఉంటాయా? ఉన్నాయా? ఉండాలా? అంటే సమాధానం ఉండాలనే ఎక్కువగా వస్తుంది. నేడు సినిమా కథలే ఎక్కువగా కోట్ల వ్యాపారాల నడుమ ప్రకాశిస్తున్నాయి. కొందరు సినిమా కథలో ఏదో ఒక నీతి ఉండాలి, లేదా సమాజానికి ఉపయోగపడే ఏదో ఒక సందేశం ఉం డాలంటున్నారు. అయితే మాట ఒకరకంగా ఉంటుంది. చేత మరొకరకంగా ఉంటుంది. సహజంగా ఉపాధ్యాయులు గానీ, పెద్దలు గానీ, పిల్లలు కానీ కథ మొదలు పెట్టేటప్పుడు 'అనగన గా..' అని అంటారు. అనగనగా అంటే ఏమిటంటే పూర్వం, చాలాకాలం కిందట వంటి అర్థాలను చెప్తా రు. ఇంగ్లీష్‌లో కూడా కథ మొదలు పెట్టేటప్పుడు అని అంటారు. అది 'అనగనగా' కు ఆంగ్ల రూపం అనే చెప్పవచ్చు. నిజానికి కథ మొదలు పెట్టేటప్పుడు ముందుగా అనవలసింది 'అనగనగా?' అని కాదు, 'అనఘనఘ' అని అనాలి. వాడుకలో మహా ప్రాణాక్షరం ఘ..గ..గ మారిపోయి అనగనగా అయ్యింది. దానికి చాలాకాలం కిందట అనే అర్థం ఊహించి చెప్పబడింది. నిజానికి అనగనగా అంటే పదబంధం ప్రకారం చెప్పగ చెప్పగ అనే అర్థాన్ని చెప్పాలి. కానీ అలా చెప్ప డం లేదు. నిజానికి అఘం అంటే పాపం అని అర్థం. అనఘం అంటే పాపం కానిది పుణ్యం అని అర్థం. అనఘ అంటే ఓ పుణ్యాత్ముడని అర్థం. అనఘనఘ అంటే ఓ ఓ పుణ్యాత్ముల్లారా అని అర్థం. హరికథలు, బుర్రకథలు వంటివి చెప్పేటప్పుడు మాన్యులు, మహనీయులు, మహానుభావులు, పుణ్యాత్ములని సంబోధిస్తుంటారు. అలాగే కథ చెప్పేటప్పుడు కూడా 'ఓ ఓ పుణ్యాత్ముల్లారా' అని కథ చెప్పేవారు వినేవారిని సం బోధిస్తారు. ఆ ఉద్దేశంతోనే అనఘనఘ అనే పదబంధాన్ని పూర్వం సృష్టించారు. కానీ, ఉచ్ఛారణ ఆ పద బంధ అర్థానికే ప్రమాదం తెచ్చింది. ఎందరెందరో మహానుభావులు కథలు రాశారు, చెప్పారు. మంచి పేరు తెచ్చుకున్నారు. కథలు చెప్పేది పెద్దలు, వినేది పిల్లలు అంతే అనే దృష్టితో 'అనఘనఘ'ని 'అనగనగ' చేసి 'లాంగ్ లాంగ్ ఎగో' అని ఆంగ్ల భాషా పండితుల చేత కూడా మన పండితులు అనిపించేశారు. హరికథలు, బుర్రకథలు చెప్పేవారు ఇప్పటికీ వినేవారిలో చిన్నారులున్నా, పెద్దలున్నా, ఎవరున్నా మాన్యులు మహనీయులు, మహానుభావులు, పుణ్యాత్ములు అనే పదాలనే ప్రయోగిస్తుంటారు. కథ చెప్పేటప్పుడు కూ డా అనఘనఘ అనే కథ ప్రారంభించాలి. అంటే ఓ ఓ పుణ్యాత్ముల్లారా అని కథ వినేవారిని సంబోధించడం. తెలుగు సాహిత్యం లో మంచి మంచి అర్థాలతో ఇలాంటి పద ప్రయోగాలు కొన్ని ఉన్నాయి. వాటి అర్థం తెలుసుకొని ప్రయోగిస్తే మనం చెప్పే విష యం మహా అర్థవంతంగా ఉంటుంది.

# అతడి పాట కన్నీటి ఊట



ఆ పాట విన్నవారెవరైనా కంటి నుంచి నీళ్లు తీయకుండా ఉండలేరు. ఆ వాగ్గేయకారుడు రాసి, పాడిన పాటలు విన్న విద్యాశాఖాధికారులు రాష్ట్రంలోని రెండు లక్షల బాల కార్మికులను బడిలో చేర్పించారు. అంతెందుకు ఆ పాట విన్న ప్రభుత్వం సైతం రాష్ట్రంలో అక్షరాస్యతా శాతాన్ని పెంచేందుకు కృషిచేసింది. ఆ రచయితే చింతల యాదగిరి. ఆయన పాడిన పాటే 'నా చిట్టీ చేతులు చక్కని రాతలు నేర్వలేదయ్యో/ నా సంకల మేడితో సాలిరువాలు దున్నినానయ్యో'. చింతల యాదగిరి నల్లగొండ జిల్లా, మేళ్ల దుప్పలపల్లి అనే పల్లెటూరుకు చెందినవాడు. 7వ తరగతిలోనే డ్రాపౌట్ అయి ఎడ్లగాసి, నాగలి దున్ని తన బాల్యాన్ని వ్యవసాయానికి ఎరువుగా మార్చా డు. బహుశా ప్రజానాట్య మండలిలో పని చేసినందుకేనే మో 'నా చిట్టీ చేతులు' పాట చింతల యాదగిరి రాశాడని ఎక్కువగా తెలియదు. ఆయన తెలియకున్నా ఈ సమా జం ఆయన పాటలను విన్నది, పాడుకున్నది. ఆయన రాసి పాడిన మచ్చుకు కొన్ని పాటలను పరిశీలిద్దాం. 'గుండెలోన రగిలిన బాధ కన్నీరై కారుతుంది/ కష్టానికి కారకులెవరో తెలుపమని కోరుతుంది' అంటూ యాదగిరి కంటికి కనిపించని బాధకు రూపంగా, కన్నీటిని వస్తుగతంగా మనకు చూపెడుతున్నాడు. అందుకే యూట్యూబ్‌లో ఉన్న ఈ పాటకు పది మిలియన్లకు పైగా వ్యూస్ కనిపిస్తున్నాయి. మొదటి లైన్లలోనే పదునైన పద ప్రయోగం, పాట మొత్తం భావాన్ని ఒక్క పల్లవిలో కూర్చి శ్రోతలను తనవైపునకు తిప్పుకోవడంలో యాదగిరి దిట్ట. 'ఉన్న ఊరు కన్న తల్లిని వదిలి పోలేనే/ నేల తల్లి పొదుగును కాదని చెదిరీ పోలేనే' అని సరళంగా, సూటి గా, ఒక బలమైన స్టేట్‌మెంట్‌తో పాటను ప్రారంభించిన యాదగిరి మనల్ని ఆ పాటలోకి ఆకర్షిస్తాడు. మనకు తెలియకుండానే మనల్ని సమరానికి సన్నద్ధం చేస్తాడు. అంతెందుకు 'అన్నదాత ఆగమవుతుండే/ పురుగుమందుతో ప్రాణాలొదిలిండే/ మట్టిబిడ్డడు మాయమవుతుండే/ మనలనిడిసీ వెళ్లిపోతుండే/ కనికరించని కాలం తోడు/ కాటువేసిన పాలన చూడు' అని యాదగిరి విలపిస్తూ రైతు ఆత్మహత్యలపై పాడిన పాట విన్నవారెవ్వరైనా సరే ఏడవకుండా ఉండలేరు. నిజానికి చాలామంది కవులు కరువుకు కాలాన్ని, ప్రకృతిని కారణంగా చూపిస్తారు. కానీ యాదగిరి మాత్రం రైతులను ప్రభుత్వం కాటు వేసిందని, లేదంటే లోకానికి అన్నం పెట్టే రైతు ఆత్మహత్య చేసుకోడని చెప్తాడు. అంటే సమస్య పట్ల లోతైన అవగాహన ఒక ప్రజా, ఉద్యమ కవికి మాత్రమే ఉంటుందనే విషయం గమనార్హం. ఇలా ప్రపంచాన్ని అర్థం చేసుకోవడానికి కావాల్సిన మార్క్సిస్టు దృక్పథాన్ని యాదగిరికి అందించింది ప్రజానాట్యమండలియే. 'అమ్మ రొమ్ము పాలలోన ఫ్లోరీను జాడ/ అన్నమిచ్చె పంట మీద విషపు నీళ్ల నీడ/ పాకులాడే ప్రాయమందు పట్టుకుంది వెన్ను/ కీలు కీలు అరగదీసి సంపుతుంది నన్ను' అంటూ నల్లగొండ జిల్లాను పట్టి పీడిస్తున్న ఫ్లోరైడ్ సమస్య మీద పాట రాసిన మొట్టమొదటి వాగ్గేయకారుడు చింతల యాదగిరి. దీని విష ప్రభావం నల్లగొండ జిల్లా నీళ్లలో ఎంత దారుణంగా ఉన్నదో పై చరణంలో మనకు తెలుస్తుంది. ఇలా చింతల యాదగిరి వందల పాటలు రాశాడు. ఆయన రాసిన కొన్ని పాటలతో 'తీగో నాగో ఎన్నియ్యలో' అనే పుస్తకాన్ని మట్టిముద్రణలు, అలగడప వారు ముద్రించారు. మూడు దశాబ్దాలుగా పాటల వ్యవసాయం చేస్తున్న చింతల యాదగిరికి నడుస్తున్న తెలంగాణ వాగ్గేయ చరితలో ప్రామాణికమైన పాటకవిగా, ప్రజాకవిగా, వాగ్గేయకారుడిగా కావాల్సిన ప్రచారం, గుర్తింపు దక్కలేదు. తెలంగాణ నేల గర్వించదగిన గొప్ప కవిగాయకుడు చింతల యాదగిరి. నిజానికి చింతల యాదగిరి పాటంటే ఆనందం కాదు, ఆవేదనల మూట. తన్మయత్వం కాదు, తనువు అణువణువులో చెలరేగే ఆవేశం. తన స్వరం నిప్పురవ్వలను వెదజల్లే ఎర్రని కొలిమి. ఆ మండే గొంతులోంచి తన్నుకొచ్చే జీర సముద్రపు అలల హోరును, తుఫాను గాలి జోరును గుర్తుచేస్తూ పాడుతుంది. ఆయన కలంతో పొడిచే పొద్దుపై సంతకం చేస్తూ.. కాలం నుదుటన మరిన్ని పదునైన పాటలు రాయాలని ఆశిద్దాం. (వాగ్గేయకారుడు చింతల యాదగిరి 2024, డిసెంబర్ 15న ఢిల్లీ వేదికగా బహుజన సాహిత్య అకాడమీ అవార్డు అందుకున్న సందర్భంగా..)

# ఉదయం లేవగానే మడమలు నొప్పిగా ఉంటున్నాయా అయితే ఇలా చేయండి

చాలా మందికి ఉదయం నిద్ర లేచిన వెంటనే కాలి మడమలు లేదా పాదాలు నొప్పిగా ఉంటాయి. కొందరికి ఈ నొప్పులు చలికాలంలో ఇంకా ఎక్కువగా ఉంటాయి. అయితే ఈ నొప్పులు వచ్చేందుకు అనేక కారణాలు ఉంటాయి. కానీ పలు సూచనలు పాటిస్తే ఈ నొప్పులను చాలా సులభంగా తగ్గించుకోవచ్చు. ఇందుకు గాను ఇంగ్లిష్ మెడిసిన్‌ను వాడాల్సిన పనిలేదు. పలు సహజసిద్ధమైన పద్ధతుల్లోనే కాలి మడమలు లేదా పాదాల నొప్పులను తగ్గించుకోవచ్చు. అందుకు పాటించాల్సిన సూచనలు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం. పాదాలు లేదా మడమల నొప్పి వచ్చేందుకు ఒక ప్రధాన కారణం ఉంటుంది. అదేమిటంటే.. కాలి వేళ్లను, మడమలను కలిపే కణజాలం ఒత్తిడికి గురైనా లేదా ఎక్కువగా సాగినా కూడా ఈ నొప్పి అనేది వస్తుంది.

## అనేక కారణాలు..

పాదాలపై పదే పదే ఒత్తిడిని కలగజేస్తే ఈ విధంగా కణజాలం సాగే అవకాశాలు ఉంటాయి. అలాగే ఎక్కువ సేపు నిలబడడం, మరీ ఎక్కువగా వాకింగ్ లేదా రన్నింగ్, జాగింగ్ వంటివి చేయడం, సరైన షూస్ లేదా చెప్పులను ధరించకపోవడం వల్ల పాదాలపై, మడమలపై ఒత్తిడి పడుతుంది. దీంతో అక్కడ ఉండే కణజాలం వాపులకు గురవుతుంది. సాగుతుంది. దీని వల్ల పాదాలు లేదా మడమల్లో నొప్పులు వస్తాయి. అలాగే హై హీల్స్ ఉన్న చెప్పులను ధరించడం, అధిక బరువు ఉండడం వల్ల కూడా ఈ నొప్పులు వచ్చేందుకు అవకాశాలు ఉంటాయి.

## విశ్రాంతి అవసరం..

అయితే ఈ నొప్పులు ఉన్నవారు పూర్తిగా విశ్రాంతి తీసుకోవాలి. పాదాలు లేదా మడమల నొప్పులు పూర్తిగా తగ్గే వరకు విశ్రాంతి అవసరం. లేదంటే సమస్య మరింత ఎక్కువయ్యే అవకాశం ఉంటుంది. దీంతో నొప్పులు మరీ ఎక్కువవుతాయి. అప్పుడు మరీ ఇబ్బందిగా ఉంటుంది. నడవడం కూడా కష్టంగా ఉంటుంది. కనుక ఈ తరహా నొప్పులు ఉన్నవారు కచ్చితంగా విశ్రాంతి తీసుకోవాలి. పాదాలకు విశ్రాంతిని ఇవ్వాలి. తేలికపాటి నడక అయినా సరే వద్దు. అలా చేయడం కూడా మంచిది కాదు. పూర్తిగా విశ్రాంతిని ఇవ్వాలి. దీంతో త్వరగా నొప్పుల నుంచి కోలుకునే అవకాశం ఉంటుంది.

## ఆవనూనెతో మసాజ్..

మార్కెట్‌లో పాదాలను సున్నితంగా ఉంచే పాదరక్షలు లేదా షూస్ లభిస్తున్నాయి. వాటిని ధరించాలి. దీంతో పాదాలపై భారం పడకుండా ఆపవచ్చు. దీని వల్ల కూడా నొప్పులు తగ్గుతాయి. అలాగే కాస్త ఆవనూనెను వేడి చేసి రాత్రి పూట పాదాలకు మర్దనా చేయాలి. దీంతో ఎంతగానో రిలీఫ్ లభిస్తుంది. మరుసటి రోజు ఉదయం వరకు నొప్పులు తగ్గిపోతాయి. ఇలా పూర్తిగా కోలుకునే వరకు చేయాలి. నొప్పులను తగ్గించడంలో ఆవనూనె ఎంతగానో పనిచేస్తుంది. పాదాలు సాగేలా చేసే వ్యాయామాలు లేదా యోగా చేయాలి. దీని వల్ల కూడా ఫలితం ఉంటుంది. ఈ తరహా నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది. ఇలా పలు సూచనలను పాటించడం వల్ల పాదాలు లేదా మడమల నొప్పులను సులభంగా తగ్గించుకోవచ్చు.




తెలంగాణ సేన
TELANGANA SENA TELUGU DAILY
శుక్రవారం 21 - 02 - 2025

# ఛత్రపతి శివాజీ స్ఫూర్తితో 121 దుర్గాలను అధిరోహించానంటున్న ఏడేళ్ల చిన్నారి

## ఏడేళ్ల వయసుకే 121 కోటలు ఎక్కిన శర్విక





మీరెప్పుడైనా ఒక దుర్గాన్ని (కోటను) ఎక్కడానికి వెళ్లినప్పుడు, రెండు జడలు వేసుకుని, ముళ్ల పొదలను తెంపుకుంటూ ముందుకు వెళ్తున్న చిన్నారి అక్కడ కనిపించిందంటే ఆమె పేరు శర్విక.ఏడేళ్ల ఆ బాలిక ఇప్పటికే 121 కోటలు ఎక్కేసింది. ఇదొక్కటే కాదు...'ఛత్రపతి శివాజీ మహరాజ్ కి జై' అనే నినాదాలతో మరిన్ని కోటలు ఎక్కడానికి సన్నద్ధమవుతోంది.ప్రపంచవ్యాప్తంగా ఇప్పుడు ట్రెక్కింగ్‌కు క్రేజ్ పెరిగిపోయింది. మహారాష్ట్రలో చాలామంది పర్వతారోహకులు (ట్రెక్కర్లు) కనిపిస్తుంటారు. కానీ ఏడేళ్ల వయసున్న ట్రెక్కర్లు చాలా అరుదు.సహ్యాద్రి పర్వతాల్లోని 121 కోటల్లో ఆమె భారత జాతీయ జెండాను ఎగరేసింది. ఒక కోటను ఎన్నిసార్లు అధిరోహించినా, దాన్ని ఒక్కసారిగానే ఆమె పరిగణిస్తుంది.మహారాష్ట్రలో అత్యంత ఎత్తయిన శిఖరం ఎక్కిన అతి చిన్నవయస్కురాలు శర్విక జితేన్ మాత్రే. ఆమె పేరు మీద చాలా రికార్డులున్నాయి.ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్, ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్, వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్, డైమండ్ బుక్ ఆఫ్ రికార్డ్స్, ఓఎంజీ బుక్ ఆఫ్ రికార్డ్స్ వంటివాటిలో ఆమె పేరు నమోదయింది.రెండున్నరేళ్ల వయసులో శర్విక మొదటిసారి ఒక కోట ఎక్కింది. మహారాష్ట్రలో అధిరోహించడం కష్టంగా భావించే కోటల్లో పన్వెల్– కర్‌జాట్ దగ్గరలోని కల్వంటిన్ శుక్లా కోట ఒకటి. మహారాష్ట్ర నుంచి ఈ కోట ఎక్కిన మొదటి బాలిక శర్విక.మూడేళ్ల వయసులో ఆమె నాసిక్ జిల్లాలోని సల్హేర్ కోటను అధిరోహించింది. మహారాష్ట్రలోని సహ్యాద్రి పర్వతాల్లో అత్యంత ఎత్తయిన దుర్గం ఇదే.నాలుగేళ్ల వయసు రాకముందే కల్సుబాయ్ శిఖరాన్ని అధిరోహించింది. మహారాష్ట్రలో ఇదే ఎత్తయిన కొండ. నాలుగేళ్ల వయసులో ఆ చిన్నారి గుజరాత్‌లోనే ఎత్తయిన గిర్నార్ శిఖరాన్ని ఎక్కింది.ఏడేళ్ల వయసుకు శర్విక 121 కొండలను ఎక్కింది. వాటిలో ఎక్కువభాగం ఎక్కడానికి కష్టంగా ఉండేవి, దుర్భేధ్యమైనవే. మహారాష్ట్రలోని రాజ్‌గఢ్, రాయ్‌గఢ్ మొదలుకుని రోహిడా, పురందర్, కైలాస్‌గఢ్..ఇలా అనేకం ఆమె అధిరోహించిన దుర్గాల జాబితాలో ఉన్నాయి.

**రెండున్నరేళ్ల వయసులోనే కోట అధిరోహణ**

రెండున్నరేళ్ల వయసులో శర్విక మొదటిసారి రాయ్‌గఢ్ కోటను ఎక్కింది. తనకు ట్రెక్కింగ్ అంటే చాలా ఇష్టమని, శివాజీ మహరాజ్ కోటలు ఎక్కేవారని శర్విక బీబీసీతో చెప్పింది."శివాజీ మహరాజ్ కథలు వింటుంటే నాకు సంతోషంగా ఉంటుంది. ప్రత్యేక శక్తి వచ్చిన అనుభూతి కలుగుతుంది" అని శర్విక చెప్పింది.

**ఏడేళ్ల వయసులోనే ఎంతో మందికి రోల్ మోడల్**

ట్రెక్కింగ్‌కు వెళ్లినప్పుడు కొంతమంది ధైర్యం కోల్పోతారని, కానీ వారు శర్విక కోటను ఎక్కుతున్న విధానం చూస్తే, తాము కూడా కోట చివర వరకు ఎక్కడం మొదలుపెడతారని ఆమె తల్లిదండ్రులు చెబుతున్నారు."శర్విక కోట ఎక్కిన తర్వాత ఎవరో ఒకరు ఆమె వీడియో తీసి ఫేస్‌బుక్‌లో పోస్టు చేస్తారు. మేం అక్కడినుంచి ఇంటికి చేరుకునే సమయానికి ఆ వీడియో సోషల్ మీడియాలో వైరలవుతుంటుంది" అని ఆమె తండ్రి జితేన్ మాత్రే చెప్పారు.మొదటిసారి రాయ్‌గఢ్ కోట ఎక్కిన తర్వాత కోటలంటే తనకు అంతకంతకూ ఇష్టం పెరుగుతోందని శర్విక బీబీసీతో చెప్పారు.శర్విక తల్లిదండ్రుల పర్వతారోహకులు. వాళ్లిద్దరికీ ట్రెక్కింగ్ అంటే ఇష్టం. అలా పర్వతారోహణపై శర్వికకు కూడా ఆసక్తి పెరిగిందని ఆమె తల్లి అమృత మాత్రే చెప్పారు.

**చిన్నతనం నుంచి ఫోన్, టీవీకి ఆమడ దూరం**

శర్వికకు ఫోన్, టీవీ చూడాలన్న ఆలోచన ఉండదు. తల్లిదండ్రులు వాటి నుంచి ఆమెను దూరంగా ఉంచారు. శారీరక వ్యాయామం, బయటికెళ్లి ఆడుకోవడం శర్వికకు ఇష్టం.ట్రెక్కింగే కాకుండా ప్రస్తుతం రాక్ క్లైంబింగ్‌ను కెరీర్‌గా మార్చుకునేందుకు ప్రయత్నిస్తోంది శర్విక.కోటలు ఎక్కడం ఇప్పుడామెకు హాబీ అయింది. ఆమెకు, ఆమె కుటుంబానికి ఎంతో సంతోషాన్ని కలిగిస్తున్న హాబీ ఇది.ఏడేళ్ల వయసుకే 121 కోటలు ఎక్కిన శర్విక.ప్రతి కోట నుంచి శర్విక మట్టి సేకరిస్తుంది. దాన్ని ఇత్తడి పాత్రలో దాస్తుంది. అది ఏ కోట నుంచి తెచ్చిందో దానిని పేరును ఆ పాత్ర మీద రాస్తుంది.తాను విన్న పూర్వీకుల కథలను ఆమె బీబీసీ బృందానికి చెప్పింది.ఆగ్రా కోట నుంచి శివాజీ మహరాజ్‌కు స్వేచ్ఛ లభించడం నుంచి హిర్కానీ సాహస కథలదాకా ఇందులో ఉన్నాయి. శివాజీ జీవిత విశేషాలకు సంబంధించిన పుస్తకాలు ఆమె దగ్గర ఉన్నాయి.

**రాక్ క్లైంబింగ్‌లో దేశానికి ప్రాతినిధ్యం వహించాలన్న ఆశయం**

శర్వికకు ట్రెక్కింగ్ అంటే చాలా ఇష్టం. అందుకే ఆమెకు రాక్ క్లైంబింగ్ నేర్పించాలని ఆమె తండ్రి నిర్ణయించుకున్నారు. ఇందుకోసం ఆమె కుటుంబం అలీబాగ్ నుంచి పుణెకు మకాం మార్చింది. రాక్ క్లైంబింగ్‌లో భారత్‌కు శర్విక ప్రాతినిధ్యం వహించాలని తల్లిదండ్రులు కోరుకుంటున్నారు."అలీబాగ్ చాలా బాగుంటుంది. కానీ, శర్విక కోసం ఇష్టం లేకపోయినా పుణెకు మారాం" అని శర్విక తండ్రి జితేన్ మాత్రే చెప్పారు.శర్విక చరిత్ర సృష్టిస్తుందని ఆమె కోచ్ అమోల్ జోగ్‌దండ్ విశ్వాసం వ్యక్తంచేశారు. శర్విక మొదటిసారి పైకి ఎక్కడం చూసినప్పుడు తాను నమ్మలేకపోయానని ఆయన అన్నారు. ఒక చిన్నారి అంత బాగా కోటలను ఎలా ఎక్కగలుగుతుందోనని ఆశ్చర్యపోయినట్లు ఆయన చెప్పారు.ప్రపంచ వేదికపై తన పేరు రాసుకోగల సామర్థ్యం ఆమెకుందని తనకు అనిపిస్తోందని అమోల్ తెలిపారు.

**'శివాజీ కోటలను పరిరక్షించాలి'**

శర్వికకు కోటలు ఎక్కడం ఇష్టం. అలాగే ట్రెక్కింగ్‌కు వెళ్లినప్పుడు చెత్త, ప్లాస్టిక్ బాటిళ్లు వంటివాటన్నింటినీ ఏరివేస్తుంది. ట్రెక్కింగ్ అయిపోయిన తర్వాత సేకరించిన వ్యర్థాలన్నింటినీ చెత్తబుట్టలో వేస్తుంది."కోటలను మరమ్మత్తు చేయడానికి, పరిరక్షించడానికి నేటి తరం చర్యలు తీసుకుంటే మహారాష్ట్ర కోటలు మళ్లీ పూర్వవైభవం సాధించడానికి ఎక్కువ రోజులు పట్టదు" అని శర్విక తండ్రి చెప్పారు.

# బ్రిటీషు వారికి క్షమాపణ చెప్పమని సావర్కర్‌ను గాంధీ కోరారా?







కేంద్ర మాజీ మంత్రి, సీనియర్ జర్నలిస్టు అరుణ్ శౌరీ రాసిన 'ది న్యూ ఐకాన్ – సావర్కర్ అండ్ ది ఫ్యాక్ట్స్' అనే పుస్తకం ఇటీవల విడుదలైంది. ఈ పుస్తకంలో వీడీసావర్కర్ రచనలను, ఆయన వ్యక్తిత్వాన్ని అరుణ్ శౌరీ నిశితంగా సమీక్షించారు.సావర్కర్ రాసిన పత్రాలు, బ్రిటిషు రికార్డుల ఆధారంగా అరుణ్ శౌరీ ఈ పుస్తకాన్ని రాశారు

**బ్రిటిషు వారితో సావర్కర్**

వినాయక్ దామోదర్ సావర్కర్‌పై ప్రజల్లో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. సావర్కర్‌ను దేశభక్తుడు, జాతీయవాది అని బీజేపీ పిలుస్తుండగా, కాంగ్రెస్ అనేక ప్రశ్నలను లేవనెత్తుతోంది.సావర్కర్ గొప్ప హేతువాది అని, ఆ విషయంలో ఆయనను అభినందిస్తున్నట్లు అరుణ్ శౌరీ తెలిపారు."సావర్కర్ అనేక ఆచారాలను ప్రశ్నించారు, దానికి ఆయనను అభినందిస్తున్నాను. కానీ, ఆయన బ్రిటిషు వారికి సాయం చేశారు" అని అరుణ్ అన్నారు."జాతీయ స్థాయిలో స్వాతంత్ర్యం కోసం ఉద్యమం జరుగుతున్నప్పుడు బ్రిటిషు వారికి సావర్కర్ మద్దతుగా నిలిచారు. బ్రిటిషు వారికి రాజకీయంగా సహాయం చేస్తానని వాగ్దానం చేశారు" అని అరుణ్ శౌరీ చెప్పారు."సావర్కర్ బ్రిటిషు వారి షరతులను అవసరానికి మించి అంగీకరించారు. అవి ఆయనను జైలు నుంచి విడుదల చేయడానికి సంబంధించినవి కూడా కావు. సావర్కర్ వైస్రాయ్ లిన్‌లిత్‌గోను కలిసినప్పుడల్లా, ఆ సమావేశానికి సంబంధించిన పూర్తి రికార్డును లిన్‌లిత్‌గో లండన్‌కు పంపేవారు. ఆ రికార్డులలో 'సావర్కర్ నన్ను రెండుసార్లు వేడుకున్నారు' అని లిన్‌లిత్‌గో రాశారు" అని అరుణ్ తెలిపారు.

**సావర్కర్ క్షమాపణ**

సావర్కర్ రాసిన క్షమాపణలపై అనేక ఊహాగానాలు ఉన్నాయి. వాస్తవానికి, నాసిక్ కలెక్టర్ హత్యలో సావర్కర్ దోషిగా తేలారు. ఆయనపై 25 సంవత్సరాల చొప్పున రెండు వేర్వేరు శిక్షలు విధించారు.ఆ శిక్షను అనుభవించడానికి ఆయనను అండమాన్ (కాలాపానీ)కి పంపారు. జైలుకు వెళ్లిన తర్వాత సావర్కర్ బ్రిటిషు వారికి చాలా క్షమాపణ లేఖలు రాశారు. ఈ విషయంపై పలువురు సావర్కర్‌ను విమర్శించారు.అయితే, బ్రిటిషు వారికి క్షమాపణ చెప్పడాన్ని సావర్కర్, ఆయన మద్దతుదారులు సమర్థించుకున్నారు.అది తమ వ్యూహంలో భాగమన్నారు. దీంతో కొన్ని రాయితీలు పొందవచ్చన్నారు. సావర్కర్ ఇచ్చిన ఈ వివరణను అరుణ్ శౌరీ తన పుస్తకంలో ప్రస్తావించారు.సావర్కర్ క్షమాపణలను శివాజీ వంటి వ్యూహాలుగా అరుణ్ శౌరీ భావించడం లేదు."శివాజీకి (ఔరంగజేబు లేదా ఆయన సైన్యం వల్ల) ఎప్పుడు ఇబ్బందులు ఎదురైనా, దక్షిణాదిని గెలవడానికి సహాయం చేస్తానని ఔరంగజేబుకు ఉత్తరం రాసేవారు. ఔరంగజేబు అక్కడి నుంచి వెళ్లిన వెంటనే, శివాజీ మళ్లీ తన పని తాను చేసుకునేవారు. కానీ, సావర్కర్ బ్రిటిషు వారి వద్ద శివాజీ వ్యూహాన్ని అనుసరించారా? అంటే కచ్చితంగా కాదు. ఆయన బ్రిటిషు వారికి సాయం చేస్తూనే ఉన్నారు" అని అరుణ్ తెలిపారు.

**క్షమాపణ కోరమని గాంధీజీ అడిగారా?**

సావర్కర్ దుష్ప్రచారాలకు బాధితుడని 2021లో కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ బహిరంగ వేదికపై వ్యాఖ్యానించారు. గాంధీజీ కోరిక మేరకే సావర్కర్ క్షమాపణలు రాశారని ఆయన ఆరోపించారు.దీనిపై అరుణ్ శౌరీ మాట్లాడుతూ "1910లో సావర్కర్‌ని దోషిగా నిర్ధరించిన విషయం ఆయనకు (రాజ్‌నాథ్‌సింగ్‌కు) తెలియకపోవచ్చు. జైలు శిక్ష అనుభవించేందుకు సావర్కర్‌ను అండమాన్‌కు పంపారు. అయితే, ఆయన రెండు నెలల్లోనే క్షమాపణ చెప్పారు. ఆ తర్వాత అనేక క్షమాపణ లేఖలు రాశారు. ఆ సమయంలో గాంధీ దక్షిణాఫ్రికాలో (1910–11) ఉన్నారు. 1915లో గాంధీ భారతదేశానికి తిరిగి వచ్చారు. సావర్కర్ అప్పటికే నాలుగేళ్లు జైలులో ఉన్నారు, ఐదు క్షమాపణలు దాఖలు చేశారు" అని అన్నారు.శౌరీ వివరిస్తూ "రాజకీయ ఖైదీలందరికీ బ్రిటిషు వారు సాధారణ క్షమాభిక్షప్రకటించినప్పుడు సావర్కర్ పేరును అందులో చేర్చలేదు. దీంతో సావర్కర్ తమ్ముడు నారాయణ్ గాంధీజీ సలహా కోరారు. దీంతో సావర్కర్ తన పిటిషన్‌లో తాను రాజకీయ ఖైదీ అని రాస్తే, అప్పుడు ఆయన కూడా క్షమాభిక్ష పరిధిలోకి వస్తారని గాంధీజీ సూచించారు. సావర్కర్ అదే చేశారు. ఆయనతో పాటు జైలులో ఉన్న తన సోదరులు భారతదేశంలో బ్రిటిషు పాలనకు వ్యతిరేకం కాదని హామీ ఇచ్చారు" అని తెలిపారు.


**గాంధీజీకి మిత్రుడా?**

1948లో మహాత్మాగాంధీ హత్యకు గురైన ఆరో రోజున, ఈ హత్యకు కుట్ర పన్నారనే ఆరోపణలపై సావర్కర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అయితే, ఫిబ్రవరి 1949లో ఆయన నిర్దోషిగా విడుదలయ్యారు.సావర్కర్ ప్రకారం, ఆయన ఒకప్పుడు గాంధీజీకి స్నేహితులు. ఇంతకీ గాంధీజీతో సావర్కర్‌కు ఎలాంటి సంబంధం ఉండేది. ఇద్దరూ స్నేహితులేనా?ఈ ప్రశ్నకు అరుణ్ శౌరీ సమాధానమిస్తూ "అస్సలు కాదు. నిజానికి గాంధీజీని సావర్కర్ అసహ్యించుకున్నారు. గాంధీజీని ఆయన మూరు?డు, పిచ్చివాడనేవారు. మూర్ఛ వ్యాధితో బాధపడుతున్న వ్యక్తి అంటుండేవారు. 'నడిచే ప్లేగు' అనేవారు" అని తెలిపారు.

**'హిందుత్వ నుంచి హిందూమతాన్ని కాపాడాలి'**

సావర్కర్ 1923లో 'హిందుత్వ – ఎవరు హిందువు?' అనే పుస్తకం రాశారు. ఇందులో ఆయన తొలిసారిగా హిందుత్వను రాజకీయ సిద్ధాంతంగా ఉపయోగించుకున్నారు.దీనిపై అరుణ్ శౌరి స్పందిస్తూ "సావర్కర్ తను రాసిన పుస్తకంలో హిందుత్వ, హిందూయిజం చాలా భిన్నమైనవని రాశారు" అని తెలిపారు.హిందూమతాన్ని హిందుత్వనుంచి కాపాడాలని శౌరీ 'ది న్యూ ఐకాన్ – సావర్కర్ అండ్ ది ఫ్యాక్ట్స్' పుస్తకంలో విజ్ఞప్తి చేశారు."సావర్కర్ ఆశించిన హిందుత్వం వస్తే ఇక మనది భారతదేశం కాదు, పాకిస్తాన్‌గా మారుతుంది. అది 'కాషాయరంగులోని ఇస్లామిక్ రాజ్యం' అవుతుంది" అని శౌరీ అభిప్రాయపడ్డారు."సావర్కర్ హిందుత్వం క్రూరత్వాన్ని, ద్వేషాన్ని బోధిస్తుంది. ఒక సమాజం అటువంటి విలువలను అవలంబిస్తే హిందూ మతం ఎక్కడ మిగులుతుంది?" అని అరుణ్ శౌరీ ప్రశ్నించారు.

# ఫాల్స్ కిల్లర్ వేల్స్: ఇవి ఒడ్డుకు ఎందుకు వచ్చాయి, వీటిని కాల్చి చంపాలని ఎందుకనుకుంటున్నారు?



ఆస్ట్రేలియాలోని టాస్మానియా దీవిలో ఓ మారుమూల తీరం వద్ద పెద్ద ఎత్తున చిక్కుకుపోయి అవస్థ పడుతున్న 90 'ఫాల్స్ కిల్లర్ వేల్స్'కు కారుణ్య మరణం ప్రసాదించాలని అధికారులు నిర్ణయించారు. 'ఫాల్స్ కిల్లర్ వేల్స్' అనేవి డాల్ఫిన్ జాతికి చెందిన జంతువులు.సంక్లిష్ట పరిస్థితుల కారణంగా వీటిని కాపాడటం అసాధ్యమని అక్కడికి చేరుకున్న నిపుణుల బృందం చెప్పింది.టాస్మానియా దీవి వాయువ్య మూలన ఉన్న ఆర్థర్ నది ఒడ్డుకు 157 'ఫాల్స్ కిల్లర్ వేల్స్' కొట్టుకు వచ్చాయి. అక్కడికి చేరిన కొద్దిసేపటికే 67 చనిపోయాయి. దీంతో మిగిలిన 90 'ఫాల్స్ కిల్లర్ వేల్స్'కు కారుణ్యమరణం ప్రసాదించాలని అధికారులు నిర్ణయించారు.టాస్మానియాలో ఇటీవల సంవత్సరాలలో తిమింగలాలు కొట్టుకొచ్చిన సంఘటనలు చాలానే చోటుచేసుకున్నాయి. 2020లో ఇక్కడ భారీ సంఖ్యలో తిమింగలాలు కొట్టుకు వచ్చాయి. కానీ, గడిచిన 50 ఏళ్లలో 'ఫాల్స్ కిల్లర్ వేల్స్' ఇంత పెద్ద ఎత్తున ఎప్పుడూ కొట్టుకు రాలేదు.

**6 మీటర్లు, 1.5 టన్నుల బరువు**

'ఫాల్స్ కిల్లర్ వేల్స్' సాంకేతికంగా ప్రపంచంలోనే అతిపెద్ద డాల్ఫిన్ జాతికి చెందినది. ఓర్కా(కిల్లర్ వేల్)తో దగ్గరి పోలికలు ఉంటాయి. ఇవి 6 మీటర్లు (19 అడుగులు) వరకు పెరుగుతాయి. 1.5 టన్నుల బరువు ఉంటాయి.ఈ 'ఫాల్స్ కిల్లర్ వేల్స్' ఇప్పటికే తీరం వద్ద 24 నుంచి 48 గంటలుగా ఉన్నాయని, ఇవి తీవ్ర ఒత్తిడిలో ఉన్నాయని అధికారులు బుధవారం చెప్పారు.తన కుమారుడు రాత్రి వేళ షార్క్ చేపల వేటకు వెళ్లిన సందర్భంలో ఒడ్డుకు కొట్టుకువచ్చిన ఫాల్స్ కిల్లర్ వేల్స్ గుంపును గమనించి తనకు చెప్పడంతో బుధవారం ఉదయం అక్కడకు వెళ్లినట్టు స్థానిక నివాసి జోసెలిన్ ఫ్లింట్ ఆస్ట్రేలియన్ బ్రాడ్ కాస్టింగ్ కార్పొరేషన్‌కు చెప్పారు.'అక్కడ వాటి కళ్లు సాయం చేయమని అభ్యర్థిస్తున్నట్టుగా కనిపించాయి" అని చెప్పారు."నిజంగా అది చాలా భయంకరమైనది" అని ఆయన చెప్పారు.

**ఎందుకు చంపుతున్నారు?**

'ఫాల్స్ కిల్లర్ వేల్స్' చిక్కుకున్న ప్రాంతం లాన్‌సెస్టన్ సిటీకి 300 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ ప్రదేశానికి దారీతెన్నూ లేదని, సరైన రవాణా సదుపాయాలు లేవని, రక్షణ పరికరాలను తరలించడం సాధ్యమయ్యే పని కాదని సముద్ర జీవశాస్త్రవేత్త క్రిస్ కర్లియన్ మీడియాకు చెప్పారు. ఇది అత్యంత క్లిష్టమైన ప్రాంతమని ఆయన చెప్పారు."ఈ ప్రాంతానికి ఉన్న మార్గం నిటారుగా రాళ్లతో ఉంటుంది. ఆ దారిలో ఒకే వాహనం వెళుతుంది. అక్కడ, నాలుగు చక్రాల వాహనాలు లభిస్తాయి కానీ, పెద్దగా ఉండవు" అని తెలిపారు.'ఫాల్స్ కిల్లర్ వేల్స్'ను ఒడ్డు నుంచి తిరిగి సముద్రంలోకి పంపేందుకు అనువైన వాతావరణ పరిస్థితులు లేవు. అధికారులు ఓ రెండింటిని సముద్రంలోకి పంపడానికి చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి.ఎగసిపడే అలలను దాటి ఇవి ఈత కొట్టలేవు, అందుకే అవి వెనక్కు కొట్టుకువచ్చేస్తున్నా యని టాస్మానియా ఉద్యానవనాలు, వన్యప్రాణి సేవలకు చెందిన షెల్లీ గ్రహం చెప్పారు.మరో రెండురోజులపాటు వాతావరణం ఇలాగే ఉంటుందనే అంచనాల నడుమ పశువైద్య నిపుణులు వీటికి కారుణ్య మరణం ప్రసాదించాలనే కఠినమైన నిర్ణయాన్ని తీసుకున్నారు."ఇవి ఇక్కడ ఎంత ఎక్కువసేపు ఉంటే అంత ఎక్కువ బాధను అనుభవిస్తాయి. ప్రత్యామ్నాయ పద్ధతులన్నీ విఫలమయ్యాయి. కారుణ్యమరణమనేది చివరి ఎంపిక" అని డాక్టర్ కార్లైన్ చెప్పారు.వీటిని కాల్చి చంపే పని బుధవారం మొదలై గురువారం కూడా కొనసాగుతుందని చెప్పారు.

# ఇష్టం లేని పేరు మార్చుకోవడం ఎలా, చట్టపరమైన ప్రక్రియలు ఏంటి?



చాలామంది రకరకాల కారణాల రీత్యా తమ పేరు మార్చుకుంటూ ఉంటారు. కొందరికి చిన్నప్పుడు పెట్టిన పేరు నచ్చక, మరికొందరికి సర్టిఫికెట్లలో పేరు, తమ పేరు వేరు వేరుగా ఉన్నందున, ఇంకొందరు జాతకం ప్రకారం, మరికొందరు సంఖ్యాశాస్త్రం మేరకు, కొందరు పెళ్ళయ్యాక, విడాకుల తరువాత, మతం మార్చుకున్నప్పుడు, తమ పేర్లపై సమాజంలో ఉన్న వ్యతిరేకత కారణంగా, ఇలా అనేక కారణాలతో పలువురు తమ పేర్లను మార్చుకుంటూ ఉంటారు.అయితే, పేరు మార్చుకోవడం అనేది ప్రాథమిక హక్కే అయినప్పటికీ, అది పరిమితులతో కూడిందని, దీనికోసం కచ్చితంగా చట్టపరమైన నిబంధనలకు కట్టుబడి ఉండాలని అలహాబాద్ హైకోర్టు ద్విసభ్య ధర్మాసనంలోని చీఫ్ జస్టిస్ అరుణ్ బన్సాలి, జస్టిస్ క్షితిజ్ శైలేంద్ర స్పష్టం చేసినట్లు లా ట్రెండ్ పేర్కొంది. దీనిలో సివిల్ కోర్టు డిక్లరేషన్ తప్పనిసరిగా కావాలని తెలిపింది.

తన పేరును షానవాజ్ నుంచి మొహమ్మద్ సమీర్‌రావుగా మార్చాలని కోరుతూ ఆ వ్యక్తి పిటిషన్ వేశారు.అయితే, అసలు చట్టబద్ధంగా పేరు మార్చుకోవాలంటే ఎలా..? ఏయే న్యాయ ప్రక్రియలను అనుసరించాలి..? రాజ్యాంగంలో ఏ ఆర్టికల్ కింద పేరు మార్చుకునే వీలుంటుంది..? పేరు మార్చుకున్న తర్వాత ఎక్కడెక్కడ అప్‌డేట్ చేసుకోవాల్సి ఉంటుంది..?

పేరు మార్చుకోవడం ఎలా?

భారత్‌లో పేరు మార్చుకోవడానికి కచ్చితంగా న్యాయ, అధికారిక ప్రక్రియలను అనుసరించాలి.ముందుగా పేరు మార్చుకోవాలనుకోవడానికి కారణమేంటో చెప్పాల్సి ఉంటుంది.ప్రస్తుత పేరు, కొత్త పేరు, పేరు ఎందుకు మార్చుకోవాలనుకుంటున్నారు, ఇతర వివరాలు తెలుపుతూ న్యాయవాది సాయంతో స్టాంప్ పేపర్‌పై అఫిడవిట్‌ను సిద్ధం చేసుకున్న తర్వాత, ఆ అఫిడవిట్‌ను నోటరీ చేయించుకోవాలి. ఇద్దరు సాక్షులతో సంతకం చేయించాలి. ఆ డాక్యుమెంట్‌పై అధికారిక స్టాంప్ ఉండాలని ఇండియా లా ఆఫీసెస్ డాట్ కామ్ పేర్కొంది.ప్రస్తుత పేరు, కొత్త పేరు, పేరు మార్పుకు గల కారణాలు తెలుపుతూ వార్తా పత్రికలో దరఖాస్తుదారు ప్రకటన ఇవ్వాల్సి ఉంటుంది.ఆ తర్వాత గెజిట్ నోటిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలి. అవసరమైన డాక్యుమెంట్లు, న్యూస్‌పేపర్ క్లిపింగ్స్, అఫిడవిట్‌ను డిపార్ట్‌మెంట్ ఆఫ్ పబ్లికేషన్‌కు పంపాలి. పేరు మార్చుకునేందుకు అవసరమయ్యే లీగల్ వెరిఫికేషన్‌కు గెజిట్ నోటిఫికేషన్ అదనపు లేయర్ లాంటిది.ఒకవేళ విదేశాల్లో నివసించే భారతీయులు పేరు మార్చుకోవాలంటే, సంబంధిత భారత రాయబార కార్యాలయం, ఇండియన్ హై కమిషన్ ధ్రువీకరించిన డీడ్‌ను పబ్లికేషన్ డిపార్ట్‌మెంట్‌కు పంపాలి.అలాగే, డిపార్ట్‌మెంట్ ఆఫ్ పబ్లికేషన్ నిర్దేశించిన ప్రింటింగ్ వివరాలను కూడా ఒక తెల్లని కాగితంపై టైప్ చేసి, పాత పేరుతో సంతకం చేసి, రెండు సాక్షి సంతకాలను పెట్టించి, సాఫ్ట్ కాపీతో పాటు పంపించాలి.పేరు మార్పుకు ప్రింటింగ్ చార్జీలు కూడా చెల్లించాలి. మేజర్ లేదా ప్రభుత్వ ఉద్యోగి అయితే పేరు మార్పు కోసం రూ.1100 చెల్లించాలి. విదేశాల్లో నివసించే భారతీయులు అయితే రూ.3,500 చెల్లించాలి.దరఖాస్తుదారు పెట్టుకున్న అప్లికేషన్‌తో అధికారి సంతృప్తి చెందితే, అధికారిక రికార్డులలో కొత్త పేరుతో ఆ వ్యక్తి పేరును రికార్డు చేస్తారు. గెజిట్ నోటిఫికేషన్ సాయంతో ఆ వ్యక్తి తన కొత్త పేరును ప్రభుత్వం జారీ చేసిన అధికారిక డాక్యుమెంట్లలో అప్‌డేట్ చేసుకోవచ్చు.అయితే, పేరు మార్చుకోవాలనుకునే వ్యక్తి మైనర్ అయితే, తల్లిదండ్రులు అఫిడవిట్ చేయించి, ఈ న్యాయ ప్రక్రియను పూర్తి చేయాలి.

**పేరు మార్పుకు కావాల్సిన పత్రాలు**

**అప్లికేషన్ ఫామ్**
**రెండు ఇటీవల పాస్‌పోర్టు సైజు ఫొటోగ్రాఫ్‌లు**
**గెజిటెడ్ ఆఫీసర్ జారీ చేసిన పౌరసత్వ పత్రం**
**పేరు ఎందుకు మార్చుకోవాలనుకుంటున్నారో తెలుపుతూ అఫిడవిట్**
**గెజిటెడ్ ఆఫీసర్ సంతకంతో ఒకటో తరగతి నుంచి పదవ తరగతి వరకున్న సర్టిఫికేట్లు**
**గత ఐదేళ్లలో తనపై ఎలాంటి కేసులు లేవని తెలుపుతూ ఇచ్చే పోలీసు సర్టిఫికేట్**
**ఆధార్, రేషన్ కార్డు, ఓటర్ ఐడీ వంటివి సమర్పించాలి.**

**పేరు మార్పును ఎక్కడెక్కడ అప్‌డేట్ చేసుకోవాలి?**

**ఒకసారి పేరు మార్చుకున్న తర్వాత వెంటనే పాన్ కార్డు, ఆధార్ కార్డు, పాస్‌పోర్టు, బ్యాంకు పాస్‌బుక్ వంటి కీలక డాక్యుమెంట్లలో కొత్త పేరును అప్‌డేట్ చేసుకోవాలి.ఈ అన్ని డాక్యుమెంట్లలో పేరును అప్‌డేట్ చేసుకోవడం మీ వ్యక్తిగత, వృత్తి జీవితానికి అత్యంత కీలకం.**

**1. ఎలాంటి ఇబ్బందులు వస్తాయి? పేరు మార్పు ప్రక్రియలో ఎలాంటి నిబంధనలు, ఇబ్బందులు ఎదురవుతాయి?**

పేరు మార్చుకునేటప్పుడు కొన్ని ఇబ్బందులు ఎదురవుతాయి. ముఖ్యంగా, కొత్త పేరును అధికారికంగా గుర్తించేందుకు అవసరమైన ధృవపత్రాలు సేకరించాలి. గెజిట్ నోటిఫికేషన్, ఆధార్, పాన్ కార్డు, బ్యాంక్ ఖాతా, విద్యా ధృవ పత్రాలు, ఆస్తి పత్రాలు మొదలైన వాటిని నవీకరించాలి.కొన్ని సందర్భాల్లో, పేరు మార్పు ప్రక్రియ సమయంలో అనుమానాస్పద లావాదేవీలతో సంబంధముందని భావించి పోలీస్ వెరిఫికేషన్ కూడా కావొచ్చు.పాత పేరుతో ఉన్న ఒప్పందాలు, బ్యాంక్ రుణాలు, లీగల్ కేసులు ఉంటే, వాటిని అప్‌డేట్ చేయడం అవసరం.ఇతర డాక్యుమెంట్స్ మారడానికి ఎక్కువ సమయం పట్టే అవకాశం ఉంటుంది. నోటరీ అఫిడవిట్, వార్తాపత్రికలో ప్రకటన వంటి నిబంధనలు పాటించాలి.కొన్ని ప్రభుత్వ విభాగాలు పేరుమార్పును వెంటనే అంగీకరించకపోవచ్చు, ఎటువంటి సందేహాలు లేకుండా సరైన ఆధారాలు సమర్పించాల్సి వస్తుంది.

**2. దరఖాస్తును ఎప్పుడు తిరస్కరిస్తారు?**

పేరు మార్పు దరఖాస్తు కొన్ని కారణాల వల్ల తిరస్కరణకు గురయ్యే అవకాశం ఉంటుంది. సమర్పించిన పత్రాలలో తప్పులు, అస్పష్టతలు లేదా సరైన ఆధారాలు లేకపోతే అభ్యర్థన తిరస్కరిస్తారు.నోటరీ అఫిడవిట్, గెజిట్ నోటిఫికేషన్ లేదా వార్తాపత్రిక ప్రకటన లేకపోతే అనుమతించరు.న్యాయపరమైన సమస్యలు, బ్యాంకు రుణాలు, క్రిమినల్ కేసులు లేదా ఇతర లీగల్ ఇష్యూలు ఉన్నప్పుడు అప్లికేషన్ తిరస్కరణకు గురయ్యే అవకాశముంది.ప్రభుత్వ నియమాలు, విధానాలకు విరుద్ధంగా ఉంటే లేదా మార్పు అనుమతించని పేరును అభ్యర్థిస్తే కూడా దరఖాస్తును అంగీకరించరు.అదనపు పరిశీలన అవసరమైన సందర్భాల్లో సరైన సమాధానాలు లేకపోతే తిరస్కరణకు గురవుతుంది.

**3. పేరు మళ్లీ మార్చుకోవచ్చా?**

ఒకసారి చట్టబద్ధంగా పేరు మార్చుకున్న తర్వాత, అవసరమైతే మళ్లీ పేరు మార్చుకోవచ్చు. అయితే, ఇది మొదటిసారి మార్చుకున్న దానికంటే మరింత జాగ్రత్తగా చేయాల్సిన ప్రక్రియ అవుతుంది.పునఃమార్పు కోసం గెజిట్ నోటిఫికేషన్, నోటరీ అఫిడవిట్, వార్తాపత్రిక ప్రకటన మళ్లీ ఇవ్వాలి. పేరు వరుసగా మార్చుకోవడంపై అధికారులు అనుమానం వ్యక్తం చేసే అవకాశముంది. అందుకే సరైన కారణాలు చూపించాలి.బ్యాంకింగ్, ఆస్తి, విద్య, పాస్‌పోర్ట్ సంబంధిత వ్యవహారాల్లో ముందుగా మార్పును అంగీకరించడంలో కొన్ని పరిమితులు ఉండొచ్చు. గత మార్పుల గురించి పూర్తి వివరాలతో సరైన ఆధారాలు సమర్పిస్తే మళ్లీ పేరు మార్చుకోవచ్చు.

**4. పేరు అప్‌డేట్‌కు టైమ్ లిమిట్ ఉంటుందా?**

గెజిట్‌లో పేరు మార్చుకున్న తర్వాత విద్యా సర్టిఫికేట్లలో పేరు అప్‌డేట్ చేసుకోవడానికి అధికారికంగా ప్రత్యేకమైన టైమ్ లిమిట్ అనేది లేదని సాధారణంగా భావిస్తారు.అయితే, ప్రతి విద్యా బోర్డు లేదా యూనివర్శిటీ తమ విధానాల ప్రకారం మార్పు దరఖాస్తులకు గడువును నిర్ణయించే అవకాశం ఉంది.కొన్ని సంస్థలు పరీక్ష పూర్తయిన కొన్ని సంవత్సరాల లోపల మాత్రమే పేరు మార్పును అనుమతిస్తాయి, మరికొన్ని మాత్రం ఎప్పుడైనా దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఇస్తాయి.మార్పు కోసం గెజిట్ నోటిఫికేషన్, నోటరీ అఫిడవిట్, పాత, కొత్త పేరు ఆధారాలతో పాటు విద్యా సంస్థ నిర్దేశించిన ఫీజు చెల్లించాలి.నిర్దిష్ట సమయం ఉన్నదో లేదో తెలుసుకోవడానికి సంబంధిత బోర్డు లేదా యూనివర్శిటీ అధికారిక నిబంధనలను పరిశీలించడం మంచిది.

**5. సివిల్ కోర్టు డిక్లరేషన్ ఎప్పుడు అవసరం ?**

సివిల్ కోర్టు డిక్లరేషన్ ప్రధానంగా ఏదైనా హక్కు లేదా హోదా నిర్ధరణ అవసరమైనప్పుడు అవసరం పడుతుంది.ప్రత్యేకంగా, పేరు మార్పు లేదా సంతానం గుర్తింపు వంటి లీగల్ అంశాలలో అధికారిక ధృవీకరణ అవసరమైనప్పుడు దీనిని కోరవచ్చు.ఆస్తి హక్కుల వివాదాలు, వారసత్వ హక్కులు, ఒప్పంద చట్టబద్ధతను నిర్ధారించుకోవడం, లేదా రికార్డులలో తప్పుగా నమోదైన వివరాలను సరిచేయించుకోవడానికి కూడా కోర్టు డిక్లరేషన్ తీసుకోవాల్సి వస్తుంది.కొన్ని సందర్భాల్లో, ప్రభుత్వ లేదా ప్రైవేట్ సంస్థలు పేరు మార్పు లేదా ఇతర హక్కుల నిర్ధరణకు గెజిట్ నోటిఫికేషన్‌తో పాటు కోర్టు డిక్లరేషన్ కూడా తప్పనిసరిగా కోరవచ్చు.అప్లికేషన్ తిరస్కరణ లేదా లీగల్ సమస్యలు ఉన్నప్పుడు కోర్టు ద్వారా అధికారిక నిర్ధారణ పొందడం అవసరం అవుతుంది.

**6. రాజ్యాంగం ఏం చెబుతోంది?**

పేరు మార్చుకునే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుందని న్యాయవాదులు చెబుతున్నారు.భారత రాజ్యాంగంలో కల్పించిన ఆర్టికల్ 19(1)(ఏ), 21, 14 ప్రాథమిక హక్కుల కింద భారతీయ పౌరులు తమ పేరును మార్చుకోవచ్చని అలహాబాద్ సింగిల్ బెంచ్ ఇచ్చిన కోర్టు తీర్పులో పేర్కొంది.అయితే, అలహాబాద్ డివిజన్ బెంచ్ ఇచ్చిన తీర్పులో మాత్రం ప్రాథమిక హక్కులకు కూడా పరిమితులు ఉన్నాయని తెలిపింది.రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(ఏ) వాక్ స్వాతంత్ర్యం, 21వ ఆర్టికల్ వ్యక్తిగత స్వేచ్ఛను, 14వ ఆర్టికల్ సమానత్వ హక్కును భారతీయ పౌరులకు అందిస్తాయి.

# జహీరాబాద్ నిమ్జ్‌లో ప్యూర్ ఈవీ ప్లాంట్

రూ.400 కోట్లతో ఏర్పాటు చేస్తున్న సంస్థ




రాష్ట్రానికి చెందిన ప్రముఖ ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన తయారీ సంస్థ ప్యూర్ ఈవీ..తెలంగాణలో మరో ప్లాంట్‌ను ఏర్పాటు చేయడానికి సిద్ధమవుతున్నది. ఇప్పటికే సంగారెడ్డి వద్ద ప్లాంట్ ఉండగా, కొత్తగా జహీరాబాద్ నిమ్జ్‌లో రూ.400 కోట్ల పెట్టుబడితో మరో ఉత్పత్తి కేంద్రాన్ని నెలకొల్పబోతున్నట్లు కంపెనీ ఫౌండర్, ఎండీ నిశాంత్ డొంగ్రి తెలిపారు. 40 ఎకరాల స్థలంలో ఏర్పాటు చేయబోతున్న ఈ యూనిట్ వచ్చే రెండేండ్లలో అందుబాటులోకి రానున్నట్లు చెప్పారు. నెలకు 12 వేల నుంచి 15 వేల యూనిట్ల సామర్థ్యం కలిగిన ఈ ప్లాంట్ ఏర్పాటు చేయడంతో కొత్తగా వెయ్యి మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయన్నారు. ప్రస్తుతం ఉన్న సంగారెడ్డి ప్లాంట్‌తో 500 మంది ఉపాధి పొందుతున్నారన్నారు. కంపెనీకి చెందిన వాహనాలకు దేశవ్యాప్తంగా డిమాండ్ అధికంగా ఉండటంతో ఈ నూతన ప్లాంట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. అలాగే ప్రస్తుతం దేశీయంగా 70 రిటైల్ అవుట్‌లెట్లు ఉన్నాయని, వచ్చే రెండున్నరేండ్లలో మరో 250 డీలర్‌షిప్‌లను ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. మరోవైపు, స్కూటర్, మోటార్‌సైకిళ్లలోనూ కృత్రిమ మేధస్సు ఆధారిత సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది.

# కొనసాగుతున్న రుపీ పతనం




దేశీయ కరెన్సీకి మరిన్ని చిల్లులు పడ్డాయి. అంతర్జాతీయ ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌కు అనూహ్యంగా డిమాండ్ నెలకొనడంతో రూపాయి చారిత్రక కని ష్ఠ స్థాయికా జారుకున్నది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 7 పైసలు కోల్పోయి 84.75 వద్దకు పడిపోయింది. గ్లోబల్ మార్కెట్లో క్రూడాయిల్ ధరలు భగ్గుమనడం వల్లనే కరెన్సీలు పతనం చెందాయని ఫారెక్స్ డీలర్ వెల్లడించారు. 84.66 వద్ద ప్రారంభమైన రుఫీ-డాలర్ రేటు 64.65-84.76 స్థాయిలో కదలాడింది.

### యూపీఐ లైట్ పరిమితి 5 వేలకు పెంపు


ముంబై, డిసెంబర్ 4: యూపీఐ లైట్‌కు సంబంధించి ఆర్థిక లావాదేవీలు జరిపేవారికి రిజర్వుబ్యాంక్ శుభవార్తను అందించింది. యూపీఐ లైట్ వ్యాలెట్ పరిమితిని రూ.2 వేల నుంచి రూ.5 వేలకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నది. డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించే ఉద్దేశంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సెంట్రల్ బ్యాంక్ వెల్లడించింది. అలాగే ఒక్కో లావాదేవీ పరిమితిని రూ.500 నుంచి రూ.1,000కి సవరించింది. ఎలాంటి పిన్ నంబర్ లేకుండానే ఆఫ్‌లైన్‌లో మొబైల్ ద్వారా లావాదేవీలు జరిపేందుకుగాను ఆర్బీఐ గతంలోనే లైట్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ సేవల కోసం యూపీఐ లైట్ వ్యాలెట్‌ను నగదు ఉంచాల్సి ఉంటుంది.

# యూపీఐ యూజర్లకు గుడ్‌న్యూస్
## లైట్ వాలెట్ పరిమితి రూ.5వేలకు పెంచిన ఆర్‌బీఐ




యూపీఐ ద్వారా చెల్లింపులు చేసే యూజర్లకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శుభవార్త చెప్పింది. యూపీఐ లైట్ వాలెట్ పరిమితిని రూ.5వేలకు పెంచడంతో పాటు ప్రతి రూ.1000 వరకు గరిష్ఠంగా చెల్లింపు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. యూపీఐ ఆధారిత చెల్లింపుల వ్యవస్థను మరింత ప్రోత్సహించేందుకు ఆర్‌బీఐ ఈ నిర్ణయం తీసుకున్నది. యూపీఐ లైట్ ద్వారా.. మొబైల్‌లో ఇంటర్‌నెట్ అందుబాటులో లేకపోయినా చెల్లింపులు చేసుకునేందుకు వీలుంటుంది. అంటే ఆఫ్‌లైన్‌లోనూ చెల్లింపులు చేయొచ్చన్నమాట. ఈ మేరకు 2022 జనవరిలో జారీ చేసిన ఆఫ్‌లైన్ ఫ్రేమ్‌వర్క్ నిబంధనలను ఆర్‌బీఐ బుధవారం సవరించింది. అడిషనల్ ఫ్యాక్టర్ ఆఫ్ అథెంటికేషన్ అవసరం లేనంత వరకు ఆఫ్‌లైన్ విధానంలో చెల్లింపులు జరుగుతాయి. పరిమితి తర్వాత తిరిగి వ్యాలెట్‌లో నగదు జమ చేసుకునేందుకు ఏఎఫ్ఏ ద్వారా ఆన్‌లైన్ మోడ్‌లో మాత్రమే చేసుకునేందుకు అవకాశం ఉంటుందని ఆర్‌బీఐ పేర్కొంది. యూపీఐ లైట్ అనేది యూపీఐ పిన్ అవసరం లేకుండా తక్కువ మొత్తంలో జరిపే లావాదేవీలకు అనుమతించే వ్యాలెట్. ఫోన్‌పే, గూగుల్‌పే, యూపీఐ పే కారణంగా డిజిటల్ చెల్లింపుల్లో విప్లవాత్మక మార్పులు వచ్చాయి. ప్రస్తుతం చెల్లింపులను మరింత విస్తరించేందుకు ఆర్‌బీఐ చర్యలు తీసుకుంటున్నది.


# వరుసగా నాలుగో రోజు లాభాల్లో ముగిసిన సూచీలు



దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా నాలుగో రోజు లాభాల్లో ముగిశాయి. బ్యాంకింగ్, రియల్టీ స్టాక్స్ కొనుగోళ్లతో మార్కెట్లు లాభపడ్డాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 81,036.22 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. మధ్యాహ్నం వరకు ఒక్కసారిగా పడిపోయింది. తిరిగి కోలుకొని చివరకు లాభాల్లో ముగిసింది. ఇంట్రాడేలో 80,630.53 పాయింట్ల కనిష్ఠాన్ని తాకిన సెన్సెక్స్.. గరిష్ఠంగా 81,245.39 పాయింట్ల వరకు పెరిగింది. చివరకు 110.58 పాయింట్ల లాభంతో 80,956.33 వద్ద స్థిరపడింది. ఇక నిఫ్టీ 10.30 పాయింట్లు పెరిగి 24,467.45 వద్ద ముగిసింది. ట్రేండింగ్‌లో దాదాపు 2,307 షేర్లు పురోగమించగా, 1,507 షేర్లు పతనమయ్యాయి. మరో 95 షేర్లు మాత్రం మారలేదు. నిఫ్టీలో హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, అపోలో హాస్పిటల్స్, ఎన్‌టీపీసీ, బజాజ్ ఫిన్‌సర్వ్ టాప్ గెయినర్స్‌గా నిలిచాయి. భారతీ ఎయిర్‌టెల్, సిప్లా, బజాజ్ ఆటో, టాటా మోటార్స్, అదానీ పోర్ట్స్ నష్టపోయాయి. సెక్టోరల్ ఫ్రంట్‌లో ఆటో, ఎఫ్ఎంసీసీ ఒక్కొక్కటి 0.7శాతం క్షీణించగా.. ఐటీ, మీడియా ఒక్కొక్కటి 0.5 శాతం, రియాల్టీ, పీయూఎస్ బ్యాంక్ రంగాల షేర్లు 2శాతానికి పైగా లాభపడ్డాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ దాదాపు ఒకశాతం లాభపడగా.. స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.6 శాతం పెరిగింది.

# అమెరికా-చైనా టెక్ వార్

**ఇరు దేశాల మధ్య మళ్లీ వాణిజ్య యుద్ధం**
**సెమీకండక్టర్ ఇండస్ట్రీలో ఆధిపత్య పోరు**
**చిప్ తయారీ రంగం కేంద్రంగా పరస్పర ఆంక్షలు**
**ట్రంప్ రాకముందే రాజుకున్న మంటలు**



అమెరికా-చైనా మధ్య వాణిజ్య యుద్ధం మళ్లీ మొదలైంది. అయితే ఈసారిది టెక్నాలజీ వార్‌ను సంతరించుకున్నది. చిప్ తయారీపై తీవ్ర ప్రభావం చూపేలా ఇరు దేశాలు పరస్పర ఆంక్షల్ని, నిషేధాల్ని తెచ్చిపెట్టుకున్నాయి మరి. ఈ మేరకు సోమవారం బైడెన్ సర్కారు నిర్ణయాలుంటే.. వాటికి ప్రతిగా మంగళవారం జిన్‌పింగ్ ప్రభుత్వం నిర్ణయాలు వచ్చాయి. నిజానికి గ్లోబల్ సెమీకండక్టర్ ఇండస్ట్రీలో అమెరికా, చైనాలు ఆధిపత్యం కోసం గత కొంతకాలం నుంచి కొట్టుకుంటున్నాయి. దాన్ని తీవ్రతరం చేస్తూ అమెరికా కొన్ని కొత్త నిబంధనల్ని తీసుకొచ్చింది. ఇవి 140 చైనా సంస్థల్ని ప్రభావితం చేస్తున్నాయి. ఇందులో ప్రధాన సెమీకండక్టర్ తయారీ సంస్థలైన పయోటెక్, సైక్యారియర్, నౌరా టెక్నాలజీ గ్రూప్‌లున్నాయి. కాగా, అడ్వాన్స్‌డ్ సెమీకండక్టర్ (చిప్) తయారీ టెక్నాలజీ చైనాకు అందకూడదనే లక్ష్యంగా ఆయా ఎగుమతులపై అమెరికా ఆంక్షల్ని విధించినట్టు తెలుస్తున్నది. కటింగ్-ఎడ్జ్ అడ్వాన్స్‌మెంట్స్ సాంకేతికతలో చైనా దూకుడుగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో దానికి బ్రేకులు వేసేందుకే ఆ టెక్నాలజీలో బలంగా ఉన్న అగ్రరాజ్యం ఈ చర్యలకు దిగిందన్న అభిప్రాయాలు ఇండస్ట్రీ వర్గాల నుంచి వ్యక్తమవుతున్నాయి.

### చైనా ప్రతీకార చర్యలు

అమెరికా తీరుకు చైనా గట్టిగానే స్పందించింది. సెమీకండక్టర్ల తయారీలో కీలక పాత్ర పోషించే విడిభాగాల ఎగుమతులకు బ్రేక్ వేసింది. అమెరికాకు గాలియం, జర్మేనియం, ఆంటిమొని తదితర ప్రధాన హై టెక్నాలజీ సరకు రవాణాకు కళ్లెం వేసింది. జాతీయ భద్రతపై ఆందోళనల దృష్ట్యా మిలిటరీ కోసమైనా, పౌర అవసరాల కోసమైనా జరిగే వీటి ఎగుమతుల్ని నిషేధిస్తున్నట్టు చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఇంతకుముందు వీటి ఎగుమతులపై ఆంక్షలుండగా, ఇప్పుడు పూర్తిగా నిషేధాన్ని తెచ్చింది. ప్రపంచవ్యాప్తంగా గాలియం, జర్మేనియం లభ్యత చాలాచాలా తక్కువగా ఉన్నది. దొరికే ఆ కొద్ది నిల్వలు సైతం చైనాలోనే ఎక్కువగా ఉన్నాయి. కాగా, సెల్‌ఫోన్లు, కార్లు, సోలార్ ప్యానెల్స్, మిలిటరీ టెక్నాలజీల్లో వాడే కంప్యూటర్ చిప్స్ తయారీకి ఈ ముడి పదార్థాలన్నీ కూడా చాలాచాలా కీలకం. ఇంకా చెప్పాలంటే మిలిటరీ అప్లికేషన్ల దగ్గర్నుంచి కృత్రిమ మేధస్సు వరకు ఈ సెమీకండక్టర్లే ప్రధానం. దీంతో అమెరికా-చైనా వాణిజ్య సంబంధాలు ఒక్కసారిగా చెడిపోయాయి. అంతకుముందు అమెరికా.. కొత్త తరం సాంకేతికతతోకూడిన చిప్‌ల తయారీలో వినియోగించే పరికరాలు, అత్యున్నత శ్రేణి మెమరీ చిప్స్, సాఫ్ట్‌వేర్ ఉత్పత్తుల ఎగుమతుల్ని కఠినతరం చేసింది. గతంలోనూ వీటిపై నిషేధం విధించినా ఆ తర్వాత సడలించింది. మానవ సాయంతో నిమిత్తం లేకుండా స్వయంప్రతిపత్తితో పనిచేయగలిగిన ఆయుధాల తయారీలో ఈ చిప్‌లే కీలకం. వాటి విడిభాగాలు ప్రస్తుతం అమెరికా నుంచే చైనాకు పెద్ద ఎత్తున వెళ్తున్నాయి.

### ట్రంప్ రాకముందే..

అమెరికా నూతన అధ్యక్షుడిగా మరోసారి డొనాల్డ్ ట్రంప్ వచ్చే ఏడాది జనవరిలో గద్దెనెక్కబోతున్నారు. ఈ క్రమంలో ట్రంప్ వచ్చిన తర్వాత అమెరికా-చైనా మధ్య వాణిజ్య యుద్ధం మళ్లీ మొదలవుతుందన్న అంచనాలు నెలకొన్నాయి. కానీ ఇప్పుడే ఆ వాతావరణం ఏర్పడటం సర్వత్రా ఆసక్తికరంగా మారింది. నిజానికి ప్రస్తుత అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ కంటే ఆ స్థానంలో ముందున్నది ట్రంపే. అప్పుడు ట్రంప్ దూకుడు.. చైనాతో పరస్పర సుంకాలకు దారితీసింది. కానీ బైడెన్ రాకతో పరిస్థితులు కొంత శాంతించాయి. అయినప్పటికీ గత మూడేండ్లలో అమెరికా-చైనా మధ్య ఈ రకమైన పోరు వస్తూపోతూనే ఉన్నది. ఇప్పుడది తీవ్రరూపం దాల్చగా.. ట్రంప్ రాకతో ఇంకెంత తీవ్రతను సంతరించుకుంటుందోనన్న ఆందోళనలు అంతటా వ్యాపిస్తున్నాయిప్పుడు. ఇక ట్రంప్ హయాంలో చైనా నుంచి అమెరికాకు పెద్ద ఎత్తున జరిగే ఎగుమతుల కట్టడే లక్ష్యంగా సుంకాల పెంపు జరిగింది. కానీ ఇప్పుడు చిప్ తయారీలో ఆధిపత్యం కేంద్రంగా నిర్ణయాలుంటున్నాయి. మొత్తానికి వచ్చే ఏడాది నుంచి సెమీకండక్టర్ ఇండస్ట్రీల్లో అలజడులు ఖాయమనే చెప్పవచ్చు.

### భారత్‌కు లాభమేనా?

అమెరికా-చైనా మధ్య చోటుచేసుకున్న ఈ ట్రేడ్ అండ్ టెక్ వార్.. భారత్‌కు లాభమేనా? అంటే అవుననే సమాధానాలే వస్తున్నాయి. ఇందుకు ట్రంప్ హయాంలో వచ్చిన అవకాశాల్నే గుర్తుచేస్తున్నారు. నాడు చైనాతో అమెరికా వాణిజ్యం పడిపోగా.. భారత్‌సహా మరికొన్ని దేశాలకు పెరిగింది. అమెరికాకు భారత్, వియత్నాం, మెక్సికో నుంచి ఆయా ఉత్పత్తుల ఎగుమతి పుంజుకున్నది. ఇప్పుడు కూడా అమెరికా సాయంతో సెమీకండక్టర్ ఇండస్ట్రీలో భారత్ నిలదొక్కుకోవచ్చన్న అంచనాలున్నాయి. నిజానికి అంతర్జాతీయంగా భారత్ ఎదుగుదలను చైనా అడ్డుకుంటున్నది. కానీ ఇదే సమయంలో భారత్‌పట్ల అమెరికా సానుకూల వైఖరిని ప్రదర్శిస్తున్నది. పైగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి, డొనాల్డ్ ట్రంప్‌కు నడుమ మంచి స్నేహభావం ఉండటం కూడా ఇక్కడ కలిసొస్తుందని అంటున్నారు. భారత్ వంటి పెద్ద మార్కెట్‌ను వదులుకోవడం అమెరికాకు నష్టమేనని, కాబట్టి సాంకేతికంగా అగ్రరాజ్యం నుంచి సహకారం ఉంటుందనే ఇండస్ట్రీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. అయితే అమెరికా తాజా నిర్ణయం జపాన్, దక్షిణ కొరియా, సింగపూర్ తదితర దేశాలనూ కొంత ఇబ్బంది పెడుతున్నది. దీంతో ఆసియా మార్కెట్‌లో అమెరికా-చైనా ట్రేడ్ వార్ గట్టిగానే ప్రకంపనల్ని సృష్టించేలా ఉన్నది.

# ఉమ్మడి ఖాతాలతో బోలెడు లాభాలు
# జాయింట్ అక్కౌంట్లతో ప్రయోజనాలు ఇవే



ఆధునిక కాలంలో ప్రతి ఒక్కరికీ బ్యాంకు ఖాతా తప్పనిసరి అయ్యింది. చదువు, ఉద్యోగం, వ్యాపారం.. ఇలా అన్ని అవసరాలకు కీలకంగా మారింది. ఆర్థిక లావాదేవీలు సక్రమంగా జరగడానికి బ్యాంకు ఖ్షాతా చాలా అవసరం. సాధారణంగా ఒకరికి ఒక ఖ్షాతా ఉంటుంది. అయితే ఇద్దరు, అంతకంటే ఎక్కువ మందికి కలిపి బ్యాంకులు జాయింట్ ఖాతాను కూడా అందజేస్తాయి. దీన్నే ఉమ్మడి ఖాతా అని కూడా పిలుస్తారు. ఉమ్మడి ఖాతాలను ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది దీన్ని ఉపయోగించుకోవచ్చు. ఇలాంటి ఉమ్మడి ఖాతాల వల్ల అనేక ప్రయోజనాలు కలుగుతాయి. బ్యాంకులలో జాయింట్ ఖాతాలను జీవిత భాగస్వామితో కలిసి లేదా పిల్లలతో కలిసి తెరవొచ్చు. స్నేహితులు, వ్యాపార భాగస్వాములతో ప్రారంభించవచ్చు. భారతీయ రిజర్వు బ్యాంకు మార్గదర్శకాల ప్రకారం జాయింట్ ఖాతాలో సభ్యుల సంఖ్యపై నిబంధనలు లేవు. అయితే కొన్ని బ్యాంకులు నలుగురికి మాత్రమే పరిమితం చేస్తున్నాయి. వీటిలో పొదుపు, కరెంట్, ఫిక్స్‌డ్ లేదా రికరింగ్ డిపాజిట్ ఖ్షాతాలు ఉంటాయి. ప్రవాస భారతీయులు (ఎన్‌ఆర్‌ఐ) కూడా దేశంలోని పౌరులతో కలిసి ఉమ్మడి ఖాతాను తీసుకునే అవకాశం కూడా ఉంది. జాయింట్ ఖాతాను దానిలోని సభ్యులలో ఎవ్వరైనా నిర్వహించవచ్చు. ఒకరు మరణించిన తర్వాత మరొకరు దాన్ని కొనసాగించే అవకాశం ఉంటుంది. ఖాతాలోని ఏ లావాదేవీకైనా సభ్యులందరి సంతకం తప్పనిసరిగా కావాలి. అలాగే ఖాతాలోని సభ్యులందరూ తమ ఆధార్, పాన్, పాస్ పోర్టు లేదా ఓటరు గుర్తింపు కార్డులను అందజేయాలి. అదనపు భద్రత కోసం ఉమ్మడి ఖాతాకు నామినీకి కూడా నియమించుకోవచ్చు. ఉమ్మడి ఖాతాకు సంబంధించి అందరు సభ్యులకు సమానంగా బాధ్యతలు ఉంటాయి. ఖాతాలోని ఓవర్ డ్రాఫ్టులు, రుణాలు ఇతర వాటికి బాధ్యులుగా ఉంటారు. ఖాతాలోని డిపాజిట్ల ద్వారా వచ్చిన వడ్డీ ఆదాయాన్ని పన్ను విధించడం కోసం ప్రాథమిక ఖాతాదారుకు ఆపాదిస్తారు. సభ్యుల మధ్య ఏమైనా వివాదాలు ఏర్పడితే ఆ సమస్య పరిష్కారమయ్యే వరకూ ఖాతాను స్తంభించవచ్చు. అలాగే మూసివేయడానికి అందరి సమ్మతి అవసరం. ఉమ్మడి ఖ్షాతాను ప్రారంభించడం చాలా సులభం. ముందుగా బ్యాంకుకు వెళ్లి, జాయింట్ ఖాతా దరఖాస్తును పూర్తి చేయాలి. ఖాతాదారులందరి గుర్తింపు, చిరునామా రుజువు, లేటెస్ట్ పాస్ పోర్టు ఫోటోలను అందజేయాలి. ఖాతాను ఎవరు నిర్వహించాలో తెలిపే ఆపరేషన్ మోడ్ ను ఎంచుకోవాలి. ఆ బ్యాంకు నిబంధనలకు అనుగుణంగా ఖాతాలో కనీస డిపాజిట్ చేయాలి. అనంతరం మీ ఉమ్మడి ఖాతా అమల్లోకి వస్తుంది. ఉమ్మడి ఖాతాలో సభ్యులందరూ సమష్టిగా నిర్ణయం తీసుకోవచ్చు. ఇవి వ్యక్తిగత ఖాతాల కంటే ఎక్కువ వడ్డీ రేటును అందిస్తాయి. డబ్బు ఆదా చేయడానికి ఉపయోగంగా ఉంటాయి. ఇద్దరి వ్యక్తుల మధ్య నిధులను బదిలీ చేయడానికి అనుకూలంగా ఉంటాయి. ఉమ్మడి పెట్టుబడులు, ఇతర ఆర్థిక కార్యకలాపాలను చాలా సులభంగా నిర్వర్తించగలం. కుటుంబంలోని సభ్యులందరూ కలిసి తీసుకుంటే కుటుంబ ఆర్థిక వ్యవహారాలను చాలా సలువుగా ట్రాక్ చేయగలిగే అవకాశం కలుగుతుంది.

# మరో సంచలనానికి సిద్ధమవుతున్న ముఖేష్
# అంబానీ కేవలం రూ.14,999 జియో ఎలక్ట్రిక్ స్కూటర్

భారతీయ మార్కెట్లో ఎలక్ట్రిక్ వాహనాలు తమదైన ముద్ర వేయడం ప్రారంభించాయి. పర్యావరణ హితం పట్ల అవగాహన పెగుతుండటంతో ల రికార్డు అమ్మకాలు పెరగుతున్నాయి. ఎలక్ట్రిక్ స్కూటర్ లేదా మోటార్ సైకిల్, లేదా ఎలక్ట్రిక్ కార్ లేదా త్రీవీలర్ లేదా ఎలక్ట్రిక్ వాణిజ్య వాహనాలు, ప్రజలు బ్యాటరీతో నడిచే వాహనాలను విస్తృతంగా కొనుగోలు చేస్తున్నారు. భారతీయ ఎలక్ట్రిక్ వెహికల్ మార్కెట్ 2027 నాటికి 35-40 శాతం వద్ద వృద్ధి చెందుతుందని అంచనా. 2025 నాటికి భారతదేశంలో విక్రయాల వాల్యూమ్‌లు 3-4 మిలియన్ యూనిట్లకు చేరుకుంటాయని అంచనా వేస్తున్నారు నిపుణులు. ప్రస్తుతం, భారతీయ మార్కెట్ ద్విచక్ర వాహనం, త్రీ-వీలర్ సెగ్మెంట్‌పై దృష్టి సారించింది. ఇది వాహన మార్కెట్లో 80 శాతం వాటాను కలిగి ఉంది. ఈ క్రమంలో దేశవ్యాప్తంగా ఎలక్ట్రిక్ వాహనాల విక్రయంలో కంపెనీల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. ఈ నేపథ్యంలో ప్రముఖ వ్యాపార దిగ్గజం ముఖేష్ అంబానీకి చెందిన జియో కంపెనీ అత్యాధునిక చౌక ఎలక్ట్రిక్ టూ వీలర్‌ను తీసుకువచ్చేందుకు సన్నాహాలు పూర్తి చేస్తున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. అదీ కూడా రూ.14,999 ధరకు ఎలక్ట్రిక్ స్కూటర్‌ను అవిష్కరించేందుకు సిద్ధమవుతున్నట్లు సోషల్ మీడియా కోడై కూస్తోంది. జియో తన కొత్త ఎలక్ట్రిక్ స్కూటర్‌ను భారత్ మార్కెట్‌లో విడుదల చేస్తున్నట్లు వార్తలు వెలువడ్డాయి. ఇది భారత మార్కెట్లో విప్లవాత్మక మార్పులకు సిద్ధమవుతోంది. ఈ స్కూటర్ ధర తోపాటు వాహన ఫీచర్లు, ఆన్‌లైన్ బుకింగ్ ప్రాసెస్‌తో సహా ఇతర సమాచారం మొత్తం సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. జియో ప్రారంభంలో అందించిన చౌకైన ఫోన్ మాదిరి, స్కూటర్‌ను సైతం సామాన్యుడికి అందుబాటులో ఉండే విధంగా రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ స్కూటర్ ఆర్థికంగా మాత్రమే కాకుండా అత్యాధునిక సాంకేతికతను ఉపయోగించి రూపొందించినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై పూర్తిస్థాయి అధికారిక ప్రకటన రావల్సి ఉంది. జియో ఎలక్ట్రిక్ స్కూటర్‌లో అనేక ఆకర్షణీయమైన ఫీచర్స్ ఉంటాయంటున్నారు. దీనికి శక్తివంతమైన ఎలక్ట్రిక్ మోటారును అమర్చారని, ఇది అధిక వేగంతో దూసుకుపోవడానికి సహాయపడుతుందంటున్నారు. అంతే కాకుండా, జియో స్కూటర్‌లో లిథియం-అయాన్ బ్యాటరీ ఉంటుంది. ఇది ఒక్కసారి ఛార్జ్‌పై సుమారు 75 నుంచి 100 కి.మీల పరిధి వరకు ప్రయాణిస్తుంది. ఈ స్కూటర్ నగరాల్లో రోజువారీ




ప్రయాణానికి అనువుగా ఉంటుందని భావిస్తున్నారట. జియో ఎలక్ట్రిక్ స్కూటర్ ధర రూ. 14,999 మొదలుకుని రూ. 17,000 మధ్య ఉంటుందని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో లభించే ఇతర ఎలక్ట్రిక్ స్కూటర్‌లతో పోలిస్తే జియో స్కూటర్ ధర చాలా తక్కువగా ఉండనుందని సోషల్ మీడియా వార్తలు గుప్పుమన్నాయి. ఈ సరసమైన ధర కారణంగా, ఈ స్కూటర్ ఆర్థికంగా మాత్రమే కాకుండా అత్యాధునిక సాంకేతికతనుఈ స్కూటర్ యువ కస్టమర్లకు, మొదటిసారి స్కూటర్ కొనుగోలు చేయాలనుకునేవారికి సదవకాశంగా భావిస్తున్నారు. ఈ స్కూటర్ గనక మార్కెట్‌లోకి వస్తే, మిగతా కంపెనీలకు గట్టి పోటీ ఇస్తుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. జియో స్కూటర్‌ను బుక్ చేసుకోవడానికి ఆసక్తి ఉన్న వినియోగదారులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాల్సి ఉంటుందంటూ వార్తలు వచ్చాయి. నమోదు ప్రక్రియ పూర్తిగా ఉచితమని, దీనికి ఎటువంటి అదనపు ఛార్జీలు వసూలు చేయడం లేదని వైరల్ అవుతున్న ప్రకటనలో పేర్కొన్నారు. విజయవంతమైన రిజిస్ట్రేషన్ తర్వాత, కస్టమర్‌లు తమ స్కూటర్‌ను డెలివరీ చేయడానికి సమీపంలోని జియో స్టోర్‌లో చూపించగలిగే రిజిస్ట్రేషన్ నంబర్ ఇవ్వడం జరుగుతుంది. ఈ జియో ఎలక్ట్రిక్ స్కూటర్ 2025 లో మార్కెట్‌లో విడుదల చేయవచ్చని భావిస్తున్నారు. అయితే, ఈ ఎలక్ట్రిక్ స్కూటర్‌కు సంబంధించి జియో కంపెనీ ఎలాంటి అధికారిక తేదీని ప్రకటించలేదు. అధికారిక సమాచారం అందుబాటులోకి వచ్చిన వెంటనే కస్టమర్‌లకు దీనిపై అప్‌డేట్ రావచ్చు..!!

Editor, printed and owned by Bommarboyina Venkanna, Associate Editor K Rajendra Prasad “office: Amber Nagar, Parshigutta, Secundrabad, Cell.no: 099592 36324, 9912824332